సంవత్సర చందా
రు. 12-0-0
విడిప్రతిక 4 అ.

ఆంధ్రపత్రిక

సచిత్రవారపత్రిక
Founder : K. NAGESWARA RAO

సంపుటము 47
సంచిక 21
3.2-54

విజయ పుష్య బహుళ అమావాశ్య బుధవారం



సంతలో

—కె. సి. యస్. పణికర్.

విషయానుక్రమణిక

ముఖచిత్రం :—

నటి : చంద్రకుమారి.

కాలక్షేపం

నిధియను శంక భూతలము

నిచ్చలు ద్రవ్వితి; - నావచే మహో

దధి దరియించితిన్; - శిఖరి

ధాతువు లూదితి; - రాజుగొల్చితిన్;-

వ్యథగొని ఘోర మంత్ర జప

మర్థి నొనర్చితి; - గవ్వయైన, నే

విధమున బొందనైతి గద -

నే ముదమందగదే దురాశరో!

తా॥ నిధి నిక్షేపము దొరుకుతుంది అనే ఆశతో నేలలో త్రవ్వించిమాచాను. ద్రవ్యలాభంకోసం మహాసముద్రమును దాటివెళ్ళితిని. కొండలలో ఉన్న లోహములను నిప్పులో పెట్టి ఊదినాను. రాజును గొల్చి సేవచేసితిని. చాలా మనోవ్యథపాలై ద్రవ్యంకోసం ఘోరమంత్రజపములు చేసితిని. ఏ విధంగా అయినప్పటికీ గవ్వయైనా నేను పొందనైతినిగదా. కనుక ఓ దురాశా! ఇంతటితోనైనా తృప్తిపడి యూరకుండుము.

ఆర్థికంగా దేశం బాగుపడవలెనంటే, దూరదేశాలతో సముద్రవ్యాపారం చేయవలసిందే. కొండలలోనూ, యితర ప్రాంతాలలోనూ అనేక అమూల్యములైన లోహాలను త్రవ్వించి, ఆ లోహములను వివిధ ప్రయోజనాలకు ఉపయోగపరచాలి. ఇటువంటి ఖనిజశాస్త్రం బాగా తెలిసిన నిపుణులు ప్రవీణులు ప్రభుత్వమునకు చేయూతగా ఉండి, ప్రభుత్వానికి సేవచేసి, తమ శ్రమకు తగిన ప్రతిఫలం యథాశక్తిగా యథోచితంగా పొందుతూ ఉండాలి. ఇంజనీర్లు పనిచేయాలి. గనులు త్రవ్వేవారు గనులు త్రవ్వాలి. వజ్రాలు, వెండి బంగారాలు మొదలుకొని, ఇనుము, సీసం, అభ్రకం, మాంగనీస్, కిరసనాయిలు వగైరా పదార్థములన్నీ ఎక్కడెక్కడ భూగర్భంలో లభిస్తాయో శోధించే టటువంటి ఖనిజాన్వేషణ శాస్త్రజ్ఞులు కావాలి. ఇంతమంది కలిసి పనిచేస్తే, చేసిన పరిశోధన సఫలమైతే, ఆయా ఖనిజములు సమృద్ధిగా లభిస్తే, అవి లోకానికి సద్వినియోగం అయితే, ఆవిధంగా చేసిన కృషిఅంతా సార్థకమైనట్లే భావించాలి.

అయితే, ఒక్క ప్రశ్న ఉంది. వస్తుసంపద అనేది స్వతస్సిద్ధంగా సంపద అయినప్పుడు, దానిని అమ్మగా వచ్చిన నగదు రొక్కమునుమాత్రమే సంపదయని పిలువవలసిన అగత్యం లేదు. పంటలు సమృద్ధిగా పండితే, పశువులపాడి సమృద్ధిగా వృద్ధి అయితే, చాలదా? అని ఏ రైతును అయినా యీ కాలంలో ప్రశ్నించి చూడండి. "చాలదు" అని తప్పక జవాబు చెప్పగలడు. పంట బాగా పండితే చాలదంటాడు. ఆ పంట ధాన్యానికి ధర హెచ్చుగా పలుకుతూఉంటేనేగాని పంట పండించిన ఆసామికి తృప్తిఉండదు. వరిపంట పండించే భూస్వాములు ప్రభుత్వానికి మనవిచేసేది ఏమిటంటే, "మాకు ధాన్యం ధర బస్తా 1 కి కనీసము రూ 20/లు అయినా లభించేటట్లుగా ధాన్యం ధరను నిలువబెట్టడానికి గవర్నమెంటువారు తోడ్పడవలెనని మనవి చేసికొనికొనుచున్నాము" అని విన్నవించుకుంటారు. భూస్వాముల కోరికలను యీడేర్చుటకై ప్రభుత్వం ప్రయత్నిస్తుంది. ప్రభుత్వచక్రం త్రిప్పేటటువంటి ప్రముఖులు విముఖులు కాజాలరు అటువంటి భూస్వాముల విన్నపములకు కారణం ఏమిటంటే పంట పండించే రైతును ఆవిధంగా సంతోషపెట్టినట్లయితే రైతుజనం కూడా ప్రభుత్వాన్ని ఒక కంట కనిపెట్టిఉంటుంది. ఏ పార్టీవారు రైతాంగమును సంతోషపెట్టగల పంచాంగమును గుణిస్తారో, ఆ పార్టీవారికి పంట పండినట్లుగా సమృద్ధిగా వోట్లు లభిస్తాయి. రైతుజనానికి చేతులలో నోట్లకట్టలు అందేటట్లుగా చేసినవారికి వోట్ల ప్రవాహం కట్టలు తెగినట్లుగా వరదగావచ్చి, ఆ పార్టీవారే వరింపబడినవారవుతారు ఎన్నికలలో. ఈభూమిపై వరిపైరులను పెంచేటటువంటి రైతులు అనగా భూమివరుల పెంచు భూమి



వరులు (భూస్వాములు) ఎన్నికలలో ఎవరిని వరి స్తే వారే యీధరను పాలించే ధురంధరులై ధరను నిలువ బెట్టగల ధరాధరములవలె రైతు కులగిరులవలె నిలువబడగలరు. ఈకాలంలో పాడిపంటల సమృద్ధిగాని, కేవలం వస్తు సమృద్ధిగాని ఉన్నంతమాత్రముచేత యీ వస్తుసామగ్రిని ఉత్పత్తిచేసే ఆసామీ సంతోషించడంలేదు. అయా వస్తు సామగ్రికి ప్రభుత్వం ఎంత హెచ్చుగా ధర పెంచితే, ప్రభుత్వాన్ని అంత హెచ్చుగా మెచ్చుకుంటారు భూస్వాములూ, ఫ్యాక్టరీల ఆసాములూకూడా. ఈవిధంగా వారినితృప్తి పరచడమే మన ఆర్థికతంత్రం నడిపించే సాములు చేసే సాములు.

కాని, ఈసాములూ యీ గరిడీలూ వట్టి గారడీలుగా ప్రత్యక్షమౌతు న్నాయి. పూర్వము 1932 సంవత్సర ప్రాంతంలో దేశంలో ధరలు విశేషంగా పడిపోయినాయి. అప్పుడు ఆంధ్ర డెల్టా జిల్లాలలో వరి ధాన్యము పుట్టి 1కి రూ 25లు కూడా అమ్మింది. ప్రపంచం అంతటా ఆర్థిక మాంద్యం చోద్యంగా అంటువ్యాధివలె ఆవరించింది. అమెరికా దేశంలోకూడా ధరలు పడిపోయి నాయి. ఆ దేశంలోని ఆసాములు అవగా పంటలు పండించిన భూస్వాములున్నూ, యంత్రాగారములలో సరకును తయారు చేసిన ఫ్యాక్టరీల ఖామందులున్నూ ఆనాడు ధరలు పడిపోతున్నాయంటే, "హా! హా!" అని మూర్ఛిల్లి పడిపోతున్నారు. ఆసమయం (1933)లో అమెరికా ప్రభుత్వానికిఅధ్యక్షు డుగావచ్చిన రూజువెల్టుగారు నడుము కట్టుకొని, "మీకేమీ భయంలేదు. ధరావలయం అంతానామీద పడిపోయినప్పటికీ నాకే ల్లాడదు బంధులార! నిలుడీ క్రిందన్ ప్రమోదంబునన్" అని చెప్పి గోవర్ధనగిరి పైకెత్తి నట్లుగా ధరలు పడిపోకుండా నిలువ బెట్టాడు. ఆయన అప్పుడు తన యోగప్రభావంవల్ల ఒక నూతన ప్రయోగం చేశారు. అపరిమితంగా గోధుమలు పండింపబడుటవల్లనే అనగా మార్కెటులో సరకు ఎక్కువగా ఉండడంవల్లనే ధర పడిపోయింది. కనుక "ఓ భూస్వాములారా! ఎక్కువగా నిల్వయున్న సరకును తగులబెట్టివేయండి! ప్రతిపంట ఎక్కువగా ఉన్నట్లయితే, దానినికూడా తగులబెట్టివేయండి. ఆర్థికమాంద్యానికి కారణభూతుడైన రాక్షసి ఆవిధంగా మలమల మాడి చచ్చిపోతాడు. ధరలను హరించివేస్తున్నటువంటి ధరాసురుణ్ని ధ్వంసం చేయడానికి అవతరించిన ధరాసురుడను అనగా దేవతను) ధరలు నిలువబడగల విక ధైర్యము వీడవద్దు" అన్నాడు.

ఇదంతా చూస్తే ఎట్లా ఉన్నదంటే, పూర్వకాలంలో మహమ్మదీయులు మనదేశంమీదకు దండెత్తి వచ్చినప్పుడు అంతఃపురములోని రాజపుత్రస్త్రీలు తమ మానమును కాపాడుకొనుటకు అన్యథా శరణం నాస్తియని అగ్నిజ్వాలలలో దూకి ఆహుతియై ఆత్మహత్య చేసికొన్నారు. అదేవిధంగా, హీనమైన హేయమైన, అవమానకరమైన ధరలకు సరకును అమ్మటకంటె అగ్నిజ్వాలల్లో ఆ సరకును ఆహుతి చేయడం ఉత్తమం అని రూజువెల్టుగారు ఆనాడు తమ *New Deal* (న్యూ-డీల్) అనబడే నూతన ఆర్థికతత్వోపదేశం మానం, సరకుల ధర ప్రమాణం కాపాడి అమెరికా కిది పాడియన్నారు.

అయితే, గడచిన సంగ్రామకాలంలో రష్యామీదకు జర్మనుసేనలు వేల యీని వదో యన్నట్లుగా ప్రళయభీకరంగా వచ్చి పడినప్పుడు, రష్యాలోని అనేక గ్రామసీమలు సంగ్రామసీమలైనాయి. కాని యీ గ్రామాలను జర్మనులు ఆక్రమించుటకు సమీపిస్తూ ఉన్నప్పుడు, ఆ గ్రామాలలోని ధాన్యపు కొఠీలను ధాన్యంతో సహా తగులబెట్టి రష్యనులు పారిపోవసాగించారు. కారణం ఏమిటంటే, తమ గ్రామంలోని ఆహారధాన్యాలు ఏవిన్నీ శత్రు సేనలకు భుక్తంకాకుండా, శత్రు

మాండూక్యోపనిషత్తు

సింగరాచార్య

(వంగకవి శ్రీ బుద్ధదేవబోస్ *'Frogs'* అనే గీతం చదివి)

దండిగ వర్షం కురిసింది
మండూక జగం విరిసింది
వంద కంఠముల సంరంభం
బృందగానములు ప్రారంభం

తీరిపోయినది వరపు భయం
తిండి పురుగుల కొరత భయం
కోడె త్రాచుల కోర భయం
కొంటెలు రువ్వే రాళ్ల భయం

మబ్బుల మందల మచ్చికతో
మహి అందగించె పచ్చికతో
చేల మళ్లలో చేరుజలం
అద్దాలంగడి కేవలం

వానాకాలపు అమరత్వం
కాని ఘనం వాచాలత్వం
మెడలయితే అసలే లేవు
గొంతులు మాత్రం మహాలావు!

ఏమా మేనుల మిలమిలలు!
మణులం గేరెడు నయనములు!!

ఊర్ధ్వదృష్టి చెదరని కనులు
భక్తిపారవశ్యపు గనులు!

ఋషులో అని మేషులో యన
రెప్పలు వ్రాలవు ధ్యానమున,
వాన తెర రవంత వీగింది
వాలు నీడ తెగ సాగింది

పైరుగాలి రెక్కల కొనల
స్వారిచేసె స్వరకల్పనలు
చిమ్మ చీకటుల నిశ్శబ్దతలో
చిల్లులు పొడిచెను చిమ్మటలు

పులు గడిగిన నీలాకాశం
బూరటిల్లె వినడం కోసం
చీకటిలో మళ్లీ వర్షం -
కాశ్మీర శాలువలలో హర్షం

కాని మూకు నిద్రలలో మాత్రం
వినబడు నొకటే మంత్రం:
"బెక బెక్ బెక బెక్" సూత్రజపం
భేక మహర్షి గణోగ్ర తపం

★ కాలక్షేపం ★

కుండా చేయవలెనని సంకల్పించారు. ఆ గ్రామాలలోని యిండ్లను కూడా ధ్వంసం చేసి రష్యనులు వెనుకకు పారిపోయినారు. అంతే కాదు. పెద్దపెద్ద ఫ్యాక్టరీలను కూడా స్వయంగా ధ్వంసంచేసి వెళ్ళిపోయినారు. ఇంకా అంతకంటె అధికమైన అఘాయిత్యాలుకూడా చేశారు. ఆయా రష్యను ఫ్యాక్టరీలు ఏ విద్యుచ్ఛక్తివల్ల నడుస్తున్నాయో, ఆ విద్యుచ్ఛక్తిని సప్లయిచేసే టటువంటి నదీజలపాత విద్యుదుత్పత్తి యంత్ర ప్రతిష్ఠాపనలను కూడా—అనేక కోట్లకొలది ద్రవ్యంతో నిర్మింపబడిన డాములను [ఆనకట్టలను] స్వయంగా నిర్మూలించి రూపుమాపి, కాలికి బుద్ధి చెప్పినారు. ఈవిధంగా కష్టపడి నిర్మించిన ప్రాజెక్టులను, కష్టపడి నిర్మించిన గ్రామాలను, యంత్రాగారములను రష్యనులు తమంతట తామే ధ్వంసం చేసికొనడం ఎందుకయ్యా అంటే, శత్రువు ఆక్రమించిన భాగం స్మశానంలాగున ఉండాలన్నారు. దీనినే *Scorched earth Policy* (స్కార్చెడ్-యర్త్-పాలిసీ) "భూదహన విధానం" అన్నారు.

అయితే అమెరికాలో ఆర్థిక మాంద్య కాలంలో ధరలు నిలువబెట్టుటకొరకై పంటసరకులను మంటలపాలుచేసిన ఆర్థిక మాంద్య దహనవిధానమునకున్నూ, రష్యాలో సంగ్రామ కాలమందు అవలంబింపబడిన భూదహన విధానమునకున్నూ ఉద్దేశంలో వ్యత్యాసం ఉంది. కాని, పర్యవసానంలో వ్యత్యాసం లేదు. సమృద్ధిగా పండినపంటను చౌకగా కొనుక్కొని తినదలచిన లోకులు, అమెరికను టోకువర్తకులకుఅరిజనులైనారు. అందుకని అమెరికను పంటను అమెరికన్లు అగ్నికి ఆహుతిచేశారు. రష్యాను అక్రమంగా ఆక్రమించుకొనే అరిజనులకు హస్తగతము కాకుండుటకై రష్యను గ్రామాలలోని నిల్వపంటను నిర్మూలించారు రష్యనులు. అమెరికను వర్తకులు చేసినపని అది. రష్యను యోధులు చేసిన పని యిది. వైశ్య ధర్మం ప్రకారంగా ఆర్థిక సమరం అది అన్నారు. క్షత్రియ ధర్మం ప్రకారంగా శౌర్యధర్మం యిది అన్నారు. కాని, ఈ

(56-వ పేజీ చూడండి)

అక — [illegible] ప్రహసనం

మూడేళ్ళ తరవాత సుందరమ్మ పుట్టింటి కొచ్చింది - ఈ మూడేళ్ళూ అత్తారింట్లో పాపం యమయాతన అనుభవించింది. పుట్టింటికొచ్చిన రెండురోజుల తరవాత—

సుందరమ్మ : సుశీలా, సుశీలా! ఓసేవ్.. సుశీలా! ఇలా రా.

రత్తమ్మ : ఏవిటే సుందరం! ఏవిటా గావుకేకలు! నిమ్మళంగా మాటాడు. కొంప అంటుకుపోయినట్టు అట్టా అరుస్తావేం!

సుం : నేనేం అరవలేదు తల్లీ, అరవలేదు. నామీదేం విరుచుకు పడకు.

ర : నీమీదెవరూ విరుచుకుపడడంలేదు.

సుం : విరుచుకుపడటం కాకపోతే ఇదేవిటి? ఆడబిడ్డని పిలిచేపాటి అధికారం కూడా లేదన్నమాట.

ర : ఎవరు పిలవొద్దన్నారు. ఆ పిలిచేదేదో నెమ్మదిగా పిలవమన్నానుగాని.

సుం : ఆ - ఇంత బిగ్గరగా పిలిస్తే దిక్కూ మొక్కూ లేదు, ఇక నెమ్మదిగా పిలిస్తే ఆవిడగారు వినిపించుకొంటుందా?

ర: వినబడితే ఎందుకు వినిపించుకోదూ.

సుం : వినబడాలనే బిగ్గరగా అరుస్తే. వినిపించుకొంటేనా!

ర : ఏదో పనిలో ఉండుంటుంది.

సుం : పనిలో ఉంటే మటుకూ? పిలిస్తే రాఅక్కర్లా? ఇదే మా అత్తారింట్లో అయితేనా—

ర : ఇది మీ అత్తారిల్లు కాదు. పుట్టిల్లు.

సుం : మా బావుందమ్మా, నాకు పుట్టిల్లేగాని సుశీల కత్తారిల్లేనా! కాదా?

ర : అయితే?

సుం : అయితే ఏవిటి, అయితే? అత్తారిల్లు అన్నాక అనుపాజ్ఞల్లో పెట్టకపోతే ఎల్లాగ. మా వదినగారు పిలిస్తే మా తోటికోడళ్ళం గజగజలాడిపోవలసిందే. అత్తగారితో ఏం చెపుతుందో అని అరచేతిలో ప్రాణాలు పెట్టుకు కూర్చుంటాం.

ర : కూర్చుంటే కూర్చోండిగాని ఇక్కడలాంటివేం పనికిరావు.

సుం : ఎలా పనికొస్తాయి, నీలాంటి చేతకాని అత్తగారయ్యాక.

రత్త : చేతనైనాన్నాళ్ళ - చేతకానన్నాళ్ళ రవ్వారట్టూ లేకుండా బతుకుతున్నాం. ఏదో ఇలా బతకనీ తల్లీ...

సుంద : బతకనివ్వక నేనేం చేస్తున్నానేం?

ర : కాకపోతే మరేవిటి - వచ్చిందగ్గిర్నుంచీ చూస్తున్నాగా - వదినగారి అథార్టీ అంటూ ఇల్లుతీసి పందిరేస్తున్నావ్! ఎవరేనా కూతురింటికొచ్చిందీ అంటే సంబరపడతారు. నువ్వొచ్చేవ్ అందర్నీ నానా హింసా పెడుతున్నావ్.

సుం : బుద్ధి గడ్డితినివచ్చా. ఏదో పుట్టింటికెళ్ళి నాలుగురోజులు సుఖపడదాంకదా అని వస్తే...పోన్లే తల్లీ నీకింత భారమైతే పోతా. మా అత్తారింటికే పోతా.

ర : నిన్నెవరూ పొమ్మన్లేదే! ఎందుకేడుస్తావ్!

సుం: ఏడుపు కాకపోతే...ఇంకేముంది నా బతుక్కి? వచ్చి రెండు రోజులైంది ఎప్పుడు విరగడవుతానా అని అంతా అనుకొంటున్నారు. కన్నతల్లివి. నీకే కంటకమైపోతే...ఛీ ఎందుకీ బతుకు?

ర : నిన్నిప్పు డెవరేవిటన్నారే...అలా శోకాలు తీస్తావ్...?

సుం: ఇంతకన్న ఇంకేవి టనాలి...

ర : ఉండు, ఎక్కడికలా వెళిపోతున్నావ్.

సుం : యీ యింట్లో ఇంకోక్షణం నేనుండను. ఉంటే నేను కోటమ్మగారి కోడల్నే కాను.

ర : ఏవిటే ఈ ఒట్లూ పత్యాలూనూ!

సుం: కాకపోతే మరేమిటి? కన్నతల్లివి నువ్వే తన్ని తగిలేస్తూఉంటే...

ర : నిన్ను నేను తగిలేస్తున్నానా? అవ్వ...ఎవరేనావింటే నవ్విపోతారు.

సుం: ఎందుకు నవ్వరూ! కోడలిచేతుల్లో కీలుబొమ్మ వయ్యావని తప్పకుండా నవ్వుతారు.

ర : నేనేం కాలేదు.

సుం: అయితే దాన్ని వెనకేసుకొస్తూ నన్ను తిడతావేం?

ర : దాన్ని వెనకేసుకూ రాలేదు. నిన్ను తిట్టాలేదు. యీ యిల్లు కొంచెం శాంతంగా ఉండనివ్వమన్నా!

సుం : అదే - నేనుంటే ఈ యింట్లో శాంతుండదనేగా నీ ఉద్దేశం. సరే..పోతా, వెంటనే పోతా.

ర : పోతా పోతా అని బెదిరిస్తున్నావ్! అంత ఇదిగా ఉంటే తప్పకుండా వెళ్లు.

సుంద : వెళ్ళక ఇక్కడ ఉండిపోతా ననుకొన్నావా? ఉండమంటే ఉంటాననుకొన్నావా?

ర : ఉండాలని లేకపోతే నిన్నెవరూ బలవంత పెట్టరులే.

సుం : ఎందుకు పెడతారూ! కూతురని అభిమానం ఏడిస్తేగా!

ర : అభిమానం లేకకాదు.

సుం : ఉంటే ఎందుకు పొమ్మంటావేం.

ర: నేను పొమ్మన్లేదని నీ కెన్నిసార్లు చెప్పాలి!

సుం : నువ్వు చెప్పాక్కర్లేదు, నేను వినాక్కర్లేదు. నా పెట్టే బేడా సర్దుకొని నేపోతా.

ర : అయితే మీ నాన్నగారొచ్చాక ఆయనతో చెప్పివెళ్లు.

సుం : నే వెళ్లాక నువ్వే చెప్పు. సుందరాన్ని ఇంట్లోంచి తరివేశానని.

ర : ఇలాంటి విపరీతమ్మాటలు నే చెప్పలేనమ్మా.

సుం : చెయ్యగాలేంది, చెప్తేనేం.

ర : అమ్మా ... నీ కొఖ్ఖదండం...నన్ను వెళ్ళనీ! అవతల కొళాయికెళ్ళి నీళ్లు తెచ్చుకోవాలి.

సుం : నీళ్లు నువ్వెందుకు తేవాలి...సుశీ అని లేమ్మను.

ర : బావుందేవ్. ఇంటెడి చాకిరీ చేస్తున్నాది చాలదూ! ఇదికూడానా!

సుం : చేస్తున్నాదంటే ఎవరికోసం చేస్తుంది. అదీ, దాని తల్లో పేను కూడా చెయ్యాలి.

ర : పేన్లు ఇంటిపన్లు చెయ్యవ్.

సుం : చేస్తాయి మా చక్కా చేస్తాయి! మా అత్తగా రెప్పుడైనా ఒక చుక్క నీళ్లు

అక్కయ్యకి ప్రమోషను

తెస్తారా. నేనో - మా తో టికోడలో తేవాలిగాని - అరె — వినిపోకుండా వెళ్ళిపోతావేం...సరే, వెళ్లు వెళ్లు.

సుశీలా, సుశీలా...ఒసేవ్ సుశీలా! పిలిస్తే నిన్ను కాదూ

సరోజ: ఏవక్కయ్యా, ఏవిటా అరుపులు!

సుం : అమ్మవలె ందంటే నువ్వొచ్చావ్! రా తల్లీ రా - అమ్మ నన్ను తగిలేస్తానంది. నువ్వు నిజంగా తగిలేయ్ తీరిపోతుంది

సరో : అదేమిటక్కయ్యా - తగిలెయ్యాడ మేవిటి! నీకేం మతిపోయిందా?

సుం: మతి నా కెందుకుపోతుంది నీకు పోయింది, మీ అమ్మగారికి పోయింది, మీ వదిన గారికి పోయింది, మీ యింటల్లి పాదికీ పోయింది. లేకపోతే నన్ను తగిలేస్తానంటారా. తగిలెయ్యండి. తగిలెయ్యండి. వెనకేసుకొచ్చినందుకు ఊరూనాడూ ఏకమై కొంపల్ని మీ అందరి నోట్లో ఇంత గడ్డి పెడితే అప్పుడు తెలిసొస్తుంది. .

స: అట్టే విసిగించక అసలు సంగతేమిటో చెప్పు నిన్నెవరేవిటన్నారు

సుం: ఎవరు ఏవిటన కూడదో అదే అన్నారు. లేకపోతే నేనెందుకు నొచ్చుకొంటాను.

స: ఏదో కోపంలో అనుంటుంది. దాన్ని నువ్ పట్టించుకోడవేవిటి చెల్లా.

సుం: కోపం! అమ్మకి కోపంరావడం నువ్వెప్పుడేనా చూశావా.

స: సాధారణంగా రాదనుకో, గానీ నువ్వేదో కెలికుంటావు, కోపంవచ్చి ఉంటుంది.

సుం: అయ్యో రాత! అదే పతకమైతే అమ్మకు బతికనా అన్నట్టు,అమ్మకే కోపం వస్తే ఇక నేం.. ఈ సుశీల నన్ను దమ్మిడీ ఎత్తయినా ఖాతరు చెయ్యటంలేదని చెవినిల్లు కట్టకొని చెపితే అమ్మ వినిపించుకోంటేనా. పైపెచ్చు నన్నే తిడుతున్నది.

స: ఏవిటే, వదిన నిన్ను ఖాతరు చెయ్యటంలేదూ, అదెప్పట్నుంచీ...

సుం: ఎప్పుడు చేసిందేం - ఫలానా అప్పుడు చెయ్యలేదని చెప్పడానికి? యీ యింట్లో ఆడబిడ్డలకి ఏమాత్రమైనా స్వతంత్రం ఏడిస్తేగా. ఇదే మా అత్తారింట్లో అయితేనా.

స: మీ అత్తారింట్లో అయితే ఏమయ్యేది?

సుం: ఏవయ్యేదని నింపాదిగా అడుగుతావేం. ఈపాటికి మామావగారు చెప్పినట్టు దేవాదేవేషు అయిపోయేది. మా వదినగారు నామీద చాడీలు చెప్పగానే మా అత్తగారు శివాలు తొక్కుతుంది. ఇద్దరూ కలిసి ఇంట్లో ఆటంబాంబు పేలినట్టు రాద్ధాంతం చేస్తారు. చెరో చీపురుకట్టా తీసుకొని నా వళ్లు వలిచేస్తారు.

స: వాళ్ళ మొఖమీడ్చా - వాళ్ళకదేం పోయీకాలం.

సుం: అత్తగారూ - ఆడబిడ్డా అన్నాక ఆమాత్రం అధికారం ఉండదా ఏం? వాళ్ల తప్పేంలేదు.

స: వాళ్లతప్పేంలేదూ - ఏవిటక్కయ్యా - ఏం మాటలివి? ఒంటిమీద స్పృహఉండే మాట్లాడుతున్నావా.

సుం: స్పృహలేకేం-ఎంచక్కా ఉంది, లేందల్లా మీకే...

స: నువ్వనే దేవిటి? మమ్మల్నేమిటి చెయ్యమన్నావో చెప్పు.

సుం : చెప్తే చేస్తారా-పెడతారా, నేను నోరు పారేసుకోడవే గాని.

స: చెప్పకూడదూ ఆదిలోనే అనుమానం అయితే ఎల్లాగ.

సుం : నే చెప్పినట్టు చేస్తావా.

స: చేస్తాలే చెప్పు.

సుం: అలా కాదు. చేస్తానూ అని మాటిస్తే చెప్తాను. ఏదీ ఒట్టెయ్.

స: ఏం వట్టెయ్యమన్నావ్.

సుం: చెప్పినట్టు చెయ్యకపోతే కోటమ్మగారి కోడలినే కానని ఒట్టెయ్.

స: నేను కానుగా?

సుం: అలవాటులో అనేశా. పోనీ అమ్మమీద ఒట్టెయ్.


స: డోంట్ బీ సిల్లీ. నాకే ఒట్లూ వత్యాల్లో నమ్మకాల్లేవు. నువ్ చెప్పినట్టూ చేస్తాగా

సుం: అయితే ఇలా దగరగా రా. విను. తన మొగుడేకద, తను చెప్పినట్టూ వింటున్నాడని సుశీలకి మాగ్రాగా ఉంది.

స: ఉండదేం. నువ్ చెప్పినట్టు మీ ఆయనే గాని వింటే నీకూ ఉంటుంది ఆమాత్రం గర్వం.

సుం: నాకు లేదని కాదు. నేను చెప్పినట్టూ, మా ఆయనా వింటారు.

స: అయితే మీ అత్తారింట్లో ఎందు



కన్ని కొట్లాటలు? మీ ఆయన చూస్తూ ఎందు కూరుకొంటాడు?

సుం : బాపుందేవ్...... పెళ్ళాం ఎంత బెల్లం ముక్క యినా, తల్లికీ తోడబుట్టిన దానికీ ఎదురు చెప్పమంటావా! మా ఆయన మంచివారు కాబట్టి వాళ్లెన్నన్నా నన్ను పడమంటారు. చాటుగా నన్ను ఓదారుస్తారు.

స : అడుసు తొక్కడం ఎందుకు, కాళ్లు కడగడం ఎందుకూ? ముందు పడమనడం ఎందుకూ? తరవాత ఓదార్చడం ఎందుకూ?

సుం : ఎందు కేమిటే సరోజా...... మొగుడూ పెళ్ళాల అన్యోన్యం అంటే మరేమిటి?

స : ఓయబ్బ...ఇదే అన్యోన్యమైతే అది పగవాళ్ళకేనా వద్దు తల్లీ.

సుం : ఇదుగో నువ్విల్లా ఈసడిస్తావనే నేను చెప్పనన్నా.

స : ఫరవాలేదు - చెప్పు.

సుం : అంతా విని నవ్వుతావ్... నేను చెప్పను...బా.

స : నవ్వనక్కా-గూ...చెప్పు.

సుం : చూడూ, నువ్వూ నేను కలిసి యీ సుశీల పొగరణచాలి. ఏమంటావ్?

స : ఓ అణుద్దాం. పొగరు నిజంగా ఉంటే తప్పకుండా అణుద్దాం.

సుం: లేదంటావేమిటే. కళ్లెదురుగుండా కనపడుతూ ఉంటే.

స : సరే, ఎలా అణచడమో అదీ నువ్వే చెప్పు.

సుం : ఏముంది, ఇంకో గంటలో అన్నయ్య కోర్టు కెళ్ళిపోతాడు.

స : అవును వెళతాడు. లేకపోతే ఈ ఇల్లెలా గడుస్తుంది.

సుం: అబ్బ అది కాదే నేననేది. అన్నయ్య కోర్టుకెళ్ళిపోతాడు, నాన్న మరో గంట దాకా రాడు.

స: రాడు, వస్తే ఇక్కడేం ఊడిపోతుంది.

సుం: నువ్విల్లా వేళాకోళం చేస్తే నే చెప్పను.

స: వేళాకోళం కాదు ఉన్నమాట చెప్తున్నాను. సరే అన్నయ్యా, నాన్నా ఇంట్లో ఉండరు, అప్పుడేం చేద్దాం.

సుం: అప్పుడు దీని పని పట్టేద్దాం.

స: ఎలాగే?

సుం: ఎలాగేమిటి? దెబ్బకి దెయ్యం దిగుతుంది. చేంతాడు పట్టుకొని నువ్వూ, గొరక చీపురు పట్టుకొని నేనూ బాదుతే దీని పొగరణుగుతుంది.

స: రైటో ... చితక తందాం. పోనీ అక్కయ్యా, వాతలు పెడితేనో.

సుం: అవునేవ్...నాకది తటనేలేదు సుమా, మా వదినగారూ మా అత్తగారూ నాకు ఎప్పుడూ వాతలు పెట్టలేదు.

స: అయితే మనంవూ పెట్టొద్దులే, బడితె పూజ చేద్దాం చాలు.

సుం: అమ్మ యింట్లో ఉంటే ఇబ్బంది! ఏం సాధనం?

స: అమ్మని నేను ఒప్పిస్తాగా.

సుం: నీ అమ్మకడుపు చల్లగా, నీ అత్త

అక్కయ్యకి ప్రమో...

కడుపు చల్లగా, అలా దార్లోకి రా...

స: గానీ అక్కయ్యా, ఏకారణం లేందే- ఎలా తన్నడం, ఏదో ఒకసాకు కల్పించాలి కద.

సుం: ఆ - నన్ను మా అత్తగారూ ఆడబిడ్డా కారణం ఉండే ఖాయిదాలో పెడుతున్నారా ఏమిటి; మనకుంటే లక్షమార్గాలు.

స: అయితే నాకింకా టెక్నిక్ తెలీదు. ఎలా గిల్లి కజ్జా పెట్టుకోడమో నువ్వే చెప్పు.

సుం: ఏముంది, కాఫీ తెమ్మందాం. అందులో ఈగో, దోమో ఉందని తిడదాం'

స: లేకపోతే—

సుం: ఉండాలా ఏమిటి, మనం ఉన్నాయంటే ఉన్నట్టే.

స: భేష్, లేకపోతే మనమే ఇంత చెత్తా చెదారం పోద్దాం.

సుం: అవునేవ్. నీది అచ్చంగా మా ఆడబడుచు పోలికలే. ఆవిడగారికి తట్టినన్ని ఉపాయాలు నీకూ తడతాయి.

స: నా జన్మ తరించిందిలే. అంత గొప్ప వాళ్ళపోలికలు రావడం చాలా కష్టం.

సుం: కాదూమరి. అవిశ్రాంతంగా ఉండాలని నేనెంత కొట్టుకుచస్తున్నా ఆ ఊహలు తట్టందే.

స: అవున్లే. ఇవి పుట్టుకతో టే రావాలి. చిన్నప్పట్నుంచీ తరిఫీదవాలి.

సుం: నీకు చిన్నప్పట్నుంచీ ఎలా వచ్చేయే? ఒక తల్లికడుపున పుట్టాం కదా, నాకు రాలేదేం?

స: దానికో కిటుకుందిలే.

సుం: ఏమిటో నాకూ చెబుదూ, నేనూ నేర్చుకొంటాను.

స: అది సులభంగా రాదు. సైకాలజీ అని ఒకటుందిలే! అది తెలిస్తేగాని రాదు.

సుం: ఏమిటీ కాలేజీయా? కాలేజీలో

ఆడబిడ్డల్ని సాధించడంకూడా నేర్పుతారా ఏం?

స: ఓ నేర్పుతారు.

సుం: చూశావా. నేను అయిదో క్లాసుతో చదువు మానేడంవల్ల ఎంత ముప్పొచ్చిందో.

స: స్ప్లెండిడ్, ఈవిధంగానైనా చదువుకోనందుకు విచారిస్తున్నావ్, అంతే చాలు.

సుంద: పోనీ నేనో నెల్లాళ్ళపాటు ఇక్కడుంటాగా. ఆ కాలేజీ ఏవిటో నాకు చెబుదూ నీ పుణ్యముంటుంది.

స: నేను చెప్పడం ఎందుకూ, ఈ నెల్లాళ్ళూ నువ్ సుశీలమీద ప్రాక్టికల్సు సాధకం చెయ్.

సుంద: లేదే, వచ్చేనెల్లో మా చిన్న మరిది లేడూ.

స: ఎవరూ, ఆ పిలకాగిలకా ఉన్న పొట్టివాడేనా?

సుం: ఆ, ఆయనే, ఆయనకి పెళ్ళవుతుంది.

స: మే గాడ్ ఫర్ బిడ్.

సుం: అంటే, ఏవిటంటున్నావ్?

సరో: ఏం లేదు.

సుం: ఎంత ఇంగ్లీషు రాకపోయినా నాకామాత్రం తెలీదా ఏమిటి? గాడ్ అంటే దేవుడు, దేవుడేదో చెయ్యాలంటున్నావ్...

స: దేవుడు దయవల్ల అవాలంటున్నాను. సరే అతనికి పెళ్ళయితే నీకేం?

సుం: కాదే, అప్పుడు మా అత్తారింటికి మూడో కోడలు కాపరానికొస్తుంది.

స: వస్తే?

సుం: అప్పుడు నేను ఇంటికి పెద్ద కోడల్నవుతా.

స: నేచురలీ... ఊ అయితే,

సుం: అప్పుడు మా అత్తగారితో, ఆడబిడ్డతోపాటు నేనూ దాన్ని అదుపాజ్ఞల్లో పెట్టాలి.

స: ఓహో, ప్రమోషనొస్తుందన్నమాట, వెరీ యింటరెస్టింగ్, ఆ, చెప్పు.

సుం: అప్పుడు నా కిలాంటి కొత్త ఆలోచనొస్తే మంచిదికాదూ. మా అత్తారూ, ఆడబిడ్డా ముక్కుమీద వేలేసుకోరూ!

స: తప్పకుండా వేసుకొంటారు.

సుం: అప్పుడు వాళ్ళెదురుకుండా కాఫీగ్రటా నేను తాగొచ్చు.

స: ఏవిటీ, వాళ్ళెదురుగుండా నువ్ కాఫీ తాగకూడదా ఏవిటి?

సుం: తాగితే ఇంకేమైనా ఉందా?

స: చిన్నప్పట్నుంచి మనింట్లో అలవాటుకదా, ఎలాగే బతుకుతున్నావ్.

సుం: పాపం ఆయన ఇస్తున్నారు కనక సరిపోయింది.

స: ఎవరూ?

సుం: ఇంకెవరు... మా ఆయనే. పొద్దున్నే గదిలోకి కాఫీ పట్టుకెళతాను, ఆయన తాగకుండా నాకిచ్చేస్తారు.

స: పూర్ బావ. పాపం బావకో...

సుం: ఆయన ఒటేల్లో తాగుతారు.

స: బావ చాలా మంచివాళ్ళాగున్నాడే..

సుం: ఎంత మంచివారనుకొన్నావ్. రోజూ రాత్రి మా అత్తగారూ ఆడబిడ్డా పెట్టే బాధలు చెప్పుకొంటూ ఉంటే కన్నీళ్ళు పెట్టుకొని ఓదారుస్తారు.

స: ఓ షూర్! రాత్రిపూట మొగుళ్ళు ఆమాత్రం ప్రేమ కనబర్చకపోతే ఎలా.

సుం: లేదే - ఆయనకి నామీద నిజంగా ప్రేమే.

స: మరైతే నువ్వలా బాధలు పడుతూ ఉంటే ఎందు కూరుకుంటున్నాడు?

సుం: ఆయనమట్టుకూ ఏం చేస్తారు ఏదో పెద్ద ఉద్యోగం అయేక వేరింటి కాపరం పెడదాం; అందాకా ఓపిక పట్టమంటున్నారు.

స: ఓహో - అదా సంగతి. అక్కయ్యా, మనం వదిన్ని సాధించాం అనుకో, ఆవిడ అన్నయ్యకి చెప్తే, ఇబ్బందే.

సుం: సింగినాదం, ఏం ఇబ్బంది?

స: అన్నయ్య ఆర్జనమీద ఇంటిల్లపాదీ బతుకుతున్నాం గాని, నీ మొగుడులాగ గతిలేక తండ్రి పంచకింద అతనుండటం లేదు.

సుం: ఎంతమాట ఎంతమాట. ఎంతమాటన్నావే, మా ఆయనకి గతిలేదూ,...

స: నువ్వే అన్నావుగా, బావకి పెద్ద జీతం వచ్చేదాకా నీకా బాధలు తప్పవని.

సుం: అన్నాననుకో. అంటే, నువ్వే మాట పడితే, ఆ మాట అనెయ్యడమేనా.

స: ఉన్నమాటంటే ఉక్రోషమెందుకక్కయ్యా. బావంటే నాకు జాలి లేక కాదు. తక్కువ జీతం తెచ్చుకొనే ప్రతి ఒక్కడూ విధిలేక, పెళ్ళాలు ఆడబిడ్డల ఆరడికి అల్లాడుతూ ఉంటే, చూస్తూ ఊరుకొంటున్నారు.

సుం: ఊరుకోక ఏం చెయ్యమన్నావేం?

స: నేను చెయ్యమన్నది ఎలాగూ చెయ్యరు. అయినా ఒకళ్ళతో అయే పని కాదు, కలిసికట్టుగా అంతా బాగుపడినప్పుడు గాని. సర్లే ఇవన్నీ ఎందుకు గాని నువ్వన్నట్టు వదిన్ని మనం బాధపెడితే ఎవరికి మోసమో నీకు తెలుసా? నీకూ నాకూ...

సుం: మన కెందుకు మోసం...

స: అన్నయ్య - తన్ని తగిలేస్తాడు. లేదా తను వెళ్ళి వేరే కాపరం పెడతాడు.

సుం: పెడితే లోకం ఊరుకొంటుందా ఏం. పెళ్ళాం మాటవిని తోడబుట్టినవాళ్ళని న్యూనత పరిచాడని గడ్డిపెట్టరూ.

స: అక్కయ్యా, నువ్వనుకొనే లోకం ప్రస్తుతం ఇక్కడ లేదు. తీరికూర్చొని పనీపాటూ లేక పొరుగువాళ్ళ విషయాలు మాట్లాడుకొనే ఓపికా తీరుబాటూ ఈ మహాపట్నంలో ఎవరికీ? పట్టించుకొనే వాళ్ళున్నా సెబాష్ అనే వాళ్ళేగాని చీవాట్లు పెట్టేవాళ్ళు లేరు.

సుం: ఇదే మా అత్తారూర్లో అయితేనా...

స: అవడానికి ఇది మీ అత్తారి ఊరు కాదుగా. అక్కయ్యా నువ్వింకా పెద్దార్లోనే ఉన్నావ్. నీ దురదృష్టంకొద్దీ పాతికేళ్ళు వెనకబడ్డ మొరటువాళ్ళింట్లో పడ్డావ్.

సుం: పడితే పడ్డా, వాళ్ళేం మొరటువాళ్ళు కారు. ఎంతో మంచివాళ్ళు.

స: అందుకే కాబోలు నిన్నలా రాచిరంపాన పెడుతున్నారు.

సుం: అది వాళ్ళింటి ఆనవాయితీ. నాకోసం మార్చుకుంటారా ఏం...

స: అక్కయ్యా, నీకో నమస్కారం నిన్ను మార్చడం నా తరంకాదు. ఏదో సైకాలజీ తెలిసినదాన్ని నీకు నచ్చచెప్పొచ్చు అనుకొన్నా.

★ అక్కయ్యకి ప్రమోషన్ ★

రత్న: ఏవిటే సరోజా, దాన్తో వాదనేమిటి?

స: ఏం లేదమ్మా. అక్కయ్యకి బోధపరుద్దామని.

ర: నీతరంకాదు.

స: వప్పుకొన్నా.

సుం: నన్నెవరూ మీరు మార్చక్కర్లా, నేనేం పసిపాపని కాను.

ర: అయినా బాగుండేది—నయానో, భయానో చెప్పేవాళ్ళం.

స: పోనీ అమ్మా, ఇవాళ లాభంలేదు, తరవాత చూద్దాం. ఇంకా సెల్లాళ్ళిక్కడుంటుందిగా...

సుం: నే నుండను. ఇందాకల వచ్చేసుకొన్నా. ఈ సాయంత్రం బండికే వెళ్ళిపోతా.

ర: ఏం, అత్తారిల్లు విడిచిపెట్టేక బెంగ పట్టుకొందా?

స: నిజమేనమ్మా. మూడేళ్ళాయి ఆ కత్తులబోనుకి అలవాటుపడ్డాది. ఆ వాతావరణం లేకపోతే ఒడ్డునపడ్డ చేపలాగ బాధ పడుతూంది.

సుం: నేనేం బాధపడలేదు.

స: నువ్వు లేదంటే సరా...నీ నమసులో నీకు తెలియకుండానే నువ్వు బాధపడుతున్నావ్! ఈ యిల్లు మీ అత్తారిల్లు లాగ చేసి తృప్తిపడదామనుకొంటున్నావ్.

సుం: అయితే తప్పా.

ర: తప్పా అని మెల్లిగా అడుగుతావేం.. తప్పా తప్పన్నరా...

స: మీ వదినగారు నిన్ను పెట్టే చిత్రహింసలు ఇక్కడ వదిన్ని నువ్వుపెట్టి నీ మనసులోని ఉబలాటం తీర్చుకొందామనుకొంటున్నావ్ ...

సుం: అనుకొంటున్నాను. అవకాశం వస్తే ఎవరుమట్టుకూ చెయ్యరేం...

స: కొందరు చెయ్యరు.

సుం: ఆ ... యీ మాటలకేం ... వీలు చిక్కితే ఎవరేనా చేస్తారు.

స: మన అమ్మ చెయ్యలేదు. అమ్మా ఆ సంగతు లక్కయ్యతో చెప్పు.

ర: చెపితే తలకెక్కుతుంది కనకనా...

స: అయినా చెప్పు.

ర: సుందరం, నువ్వుచెప్తే నమ్మవుగాని, నేను నువ్వు పడుతున్న బాధలకన్నా హెచ్చు బాధలుపడ్డా. మీ నాయనమ్మ, మేనత్త, నన్ను పెట్టిన హింసలు నరకంలో యమదూతలు కూడా పెట్టరు. యీ చేతి మీద మచ్చ ఏమిటో తెలుసా? నువ్వు ఏణ్ణర్థంపిల్లవిగా ఉన్నప్పుడు మా వదినగారు వాతలు పెట్టింది.

సుం: ఎందుకు పెట్టిందీ...

ర: నీకు పాలిస్తూ ఆవిడపిలిస్తే వినిపించుకోలేదట.

సుం: నువ్ నిజంగా వినిపించుకో లేదా...

ర: నేను వినిపించుకోక కాదు. నువ్వు నన్ను ఒదల్లేదు. గుక్కపెట్టి ఏడవం మొదలెట్టావ్, నిన్ను ఏడిపించడంకన్న ఆవిడ వేసే శిక్ష అనుభవించడమే మంచిదనుకొన్నా.

సుం: నానుంచి నీకు వాతలు పెట్టిందా అత్తయ్య...

ర: వాతలే కాదు, ఎన్ని హింసలు పెట్టాలో అన్నీ పెట్టారు.

సుం: మరి నాకెప్పుడూ చెప్పలేదేం, సరోజ కెలా తెలుసు.

స: నాకుమట్టుకు చెప్పిందా. ఒకనాడు ఈమచ్చ లేవిటమ్మా అని అడిగితే, చివరికెలాగో చెప్పింది.

ర: చెప్తే ఏంలాభమర్రా...వాటినుంచి బుద్ధి తెచ్చుకోవాలిగాని.

సుం: అమ్మా...

ర: నన్ను వెళ్ళనీ; వంటింట్లో పాపం సుశీలొక్కర్తే ఉంది. కొంచెం సాయం చెయ్యాలి.

సుం: సరోజా...

స: ఏవక్కయ్యా...?

సుం: అమ్మకూడా ఇన్ని బాధలు పడ్డా దటే...

స: అవును పడ్డాదికనకనే వదిన్ని పల్లెత్తు మాట అనదు. ఆడపుట్టుక పుట్టింది కనక అర్థం చేసుకోగలిగింది.

సుం: అదికాదే, మా అత్తగారినికూడా వాళ్లత్తగారు ఎన్నో బాధలు పెట్టిందట... అందులో నూరోవంతుకూడా మమ్మల్ని పెట్టడంలేదట.

సరో: అత్తా ఒక యింటికోడలే... గాని తనుపడ్డ బాధలు తనకోడలికి కలిగించకపోడంలోనే ఉంది గొప్పతనం.

సుం: నిజమేననుకో...ఇందాకల నేను సుశీలని పిలుస్తూఉంటే అమ్మ నామీద మండిపడ్డాది. ఎందుకు చెప్మా అనుకొన్నా...

స: ఎందుకేవిటి? తన కోడరికం రోజులు జ్ఞాపకంవచ్చి—

సుం: అయితే నేను పాపిష్టిదాన్నే సుమా...నా మూలకంగా అమ్మకి అత్తయ్య వాతలు పెటిందట.

స: నీ మూలకంగా కాదు. పెట్టదలచుకొంటే నువ్వు కారణం కాకపోయినా పెట్టేది.

అన్నయ్య: సుందరం, సుందరం...

సుం: ఏవన్నయ్యా...

అ: మీ మరిది ఉత్తరం రాశాడు.

సుం: ఏం రాశాడన్నయ్యా...పెళ్ళిబట్టలు కొనడానికి పట్నం వస్తానన్నారు. ఎప్పుడొస్తారేవిటి?

అ: మనూరు రాట్ట, బొంబాయి వెళతాట్ట.

సుం: ఏం అక్కడ బట్టలు కొంటారేవిటి చెప్మా.

అ: బట్టలు కొనడానికి కాదు. ఉద్యోగం చూసుకోడానికి.

సుం: ఇదేవిటి...

అ: వాడు పెళ్ళిచేసుకోడట.

సుం: అయ్యో...అయ్యో...అదేం?

అ: ఏంలేదు. నిన్నూ నీతోడికోడల్నీ మీ అత్తగారు పెట్టే బాధలు చూసి తన పెళ్ళానికి కూడా అదే గతి పడుతుందని అక్కర్లేదన్నాడుట.

స: రియల్లీ...పొట్టిబావగారికి ఇంత సాహసం ఎలా వచ్చిందో...

అ: ఎందుకురాదూ మనిషన్నవాడికి ఆమాత్రం జ్ఞానం ఉంటుంది.

సుం: పెళ్లవుతుందని ఎంతో సంతోష పడ్డానే...

స: సంతోషపడటంలేదు. నీ ప్రమోషను పోయిందికదా అని ఏడుస్తున్నావ్.

అ: ప్రొమోష నేవిటే...?

స: నీకు తెలీదులే అన్నయ్యా. అక్కయ్యకి ప్రమోషను రావలసింది, పోయింది.

అ: నీ మొహం, సుందరానికి ప్రమోష నేవిటి? పోవడమేమిటి...బావకి ప్రొమోషనైతే...

సుం: ఏవిటి నిజంగా...?

అ: అవును.

సుం: నీ తల్లి కడుపుచలగా, నీ అత్త కడుపు చల్లగా, ఎంత చల్లటి మాటచెప్పావ్, నిజంగా నేనా?

అ: అబద్ధమాడ్డానికి నాకేం పట్టిందే...

స: కంగ్రాచ్యులేషన్సు అక్కయ్యా... వేరింటికాపురం పెట్టు.

సుం: అమ్మా, అమ్మా, సుశీలా... సుశీలా, ఇలారండి.

ర: ఏవిటే ఆ కేకలు.

సుం: ఏం లేదమ్మా, నువ్వూ సుశీలా పోయి కూర్చోండి. నేను వంటవండుతాను.

ర: ఏవిటే ఏవిటిది...నువ్వొండుకుంటూండడం...?

సుం: నీకు తెలీదు నువ్వూరుకో అమ్మా. సుశీలా మవ్ రే...

ర: ఏవిటే సరోజా...అక్కయ్యకేం పిచ్చిపట్టలేదుకద...

స: లేదమ్మా అక్కయ్యకి ప్రమోషనొచ్చింది.

[ఈ శ్రవ్య నాటికని 'వదిన' అనే పేరుతో రేడియోలో ఆడేరు.] ★



గోపిక

—వెల్లటూరి పూర్ణానందశర్మ, వెల్లటూరు.

కులవృత్తి

వడ్రంగి ధర్మయ్యకు జుట్టు నెరిసి నడుం వంగే వయసులో సుబ్బిగాడు పుట్టాడు. తల్లి వాడ్ని సుబ్బయ్యా అని పిలుస్తే తండ్రి 'సుబ్బిగా' అనేవాడు ముద్దుగా. సుబ్బిగాడికి రెండు మూడేళ్ళు ఒచ్చేసరికల్లా, గడికట్టె చేతికందిన వస్తువల్లా విసిరిపారెయ్యటమూ, విరగ్గొట్టటమూ, చేస్తూ, ముద్దుగా ఉండేవాడు.

తల్లి వాడిమీద ఈగవాల నిచ్చేదికాదు. తండ్రి వాడ్ని కాలు కిందపెట్టనిచ్చేవాడు కాదు. అటువంటి వాతావరణంలో పుట్టి పెరిగాడు సుబ్బి.

వాడి విషయంలో ఇదివరకు లేని చిలిపి కయ్యాలూ, స్పర్థలూ ఆ భార్యాభర్తల మధ్య తరుచు తలెత్తుతూండేవి "ఈ మధ్య వాడి విషయంలో బద్ధకం పెరిగిపోయిందిలే నీకు" అనేవాడు ధర్మయ్య

ఏం చెయ్యను? ఇప్పుడు నీళ్ళుపోసి, బట్టలు తొడిగి తలదువ్వాను. అప్పుడే ఎంగా తయారయిందో అవతారం చూడు చేతికి దొరుకుతేనా?" అంది భార్య మహాలక్ష్మి.

తెల్లవారింది మొదలు చీకటిపడేవరకూ సుబ్బిగాడితో కాలక్షేపం చేసేవాడు ధర్మయ్య. పనికివెళ్ళినా దానిమీద మనసుండక దప్పున ఇంటికి వచ్చేసేవాడు.

ఆరోజు భార్య గట్టిగా చీవాట్లు పెట్టింది. ఆ మొర్నాడు అవసరం గడవాలంటే ఇంట్లో బొగ్గులదగ్గర్నించి బియ్యంవరకూ నిండుకున్నాయి నిజమే. అది విసుక్కొందంటే తప్పేంలేదు. తెల్లవారటం తరవాయి పిల్లవాడితో, కాలక్షేపం చెయ్యటం తప్పించి ఇంట్లో రోజు ఎలా గడవాలో తను ఆలోచిస్తున్నాడా? ఈ ఆలోచనతో లేచి గబగబా కోట్టుకు బయల్దేరాడు ధర్మయ్య. రెండు రోజులు ఇంటి ధ్యాస లేకుండా శ్రమించాడు - అంతే! - మరో వారం వరకూ ఇబ్బంది లేకుండా గడిచిపోతుంది. బుద్ధిపుట్టి పనిచేస్తే ధర్మయ్యకు, చేతినిండా పనుంటుంది. దానికేం కొదవలేదు. సంపాదనకూడా బాగానే ఉంటుంది డబ్బు కోసం తనుముకోవాల్సిన అవసరం ఉండదు అయితే సుబ్బిగాడి ధర్మమా అని బద్ధకం బలిసిపోయింది ధర్మయ్యకు.

2

సుబ్బిగాడికి ఆరేళ్లు ఒచ్చేసరికల్లా మునుపట్లా కాకుండా కష్టపడి నాలుగురాళ్ళు వెనకేశాడు ధర్మయ్య. ఎప్పుడు చూసినా ఏదో ఒకటి చేస్తూనే అవుపించేవాడు. తోటిపనివాళ్లంతా అనేవారు "కొడుకు పుట్టింతర్వాత ధర్మయ్యకి యావ ఎక్కువై పోయింది సుమా!" అని. తనూ "తప్పుతుందా మరి" అనేవాడు.

కూడబెట్టిన డబ్బుతో ఎక్కడైనా మంచిస్థలం చూసి కొనిపారేస్తే అదృష్టం బాగుంటే కొడుకు హయాంలో కొంపా గోడూ వేసుకోవచ్చు. "తండ్రిని కాబట్టి ఆమాత్రం అప్పచెప్పకపోతే తను చేసిందేముంది? ఇది మా నాన్న సంపాదించాడు అనుకుందుకు చిహ్నంగా కూడా ఉంటుంది" అనుకున్నాడు ధర్మయ్య. అప్పటికే సుబ్బిగాడ్ని బడిలో వేసే వయస్సొచ్చింది తన కింతవరకూ ఆ ఉద్దేశమే లేదు. వాడూ కులవృత్తిని నమ్ముకుని కాలక్షేపం చెయ్యాలనే తను అనుకునేవాడు.

శ్రీరాం పూర్ణప్రకాశరావు

కొడుకును మంచి పనివాడుగా "తండ్రికి మించిన కొడుకురా" అనుకునేట్టుగా తర్ఫీదు ఇవ్వాలని ఉబలాట పడేవాడు. అంతేకాని వాడ్ని ఈ ఇంగ్లీషు చదువులు చదివించి ఉద్యోగాలు చేయించాలని అతను అనుకోనేలేదు. అవంటే అసహ్యం అని కాదుగాని అతని కా ఉద్దేశమే లేదు. నలుగురూ ఏవేవో చెప్పారు. వాళ్ళతోపాటు భార్యకూడా ఆ పాటే పాడింది మొదట్లో తను అంతగా పట్టించుకోలేదు. మంచి రోజు మాసి దేముడికి మొక్కించి కొట్టుకు వెంట తీసుకెళ్ళాడు సుబ్బిగాడ్ని.

మర్నాడు భార్య సణుగుడు ప్రారంభించింది. నా మాటవిని వాడ్ని బళ్లో వేయించు...వాడు చదువుకుని ఉద్యోగం చేస్తుంటే చూడాలని నా కోరిక" అంది మహాలక్ష్మి. "ఆరేళ్లొచ్చాయి, ఈపాటికి రంగయ్య కొడుకు రత్నం చూడు: వీడి ఈడు వాడేగా; ఎలా కష్టపడతాడో. చదువులో పడితే ఈ వృత్తిమీద లక్ష్యం ఉంటుందా?" అన్నాడు ధర్మయ్య

"పోదూ ఇంతోటి మహా వృత్తీను. ఈ పాటి సుబ్బిగాడు సంపాదించలేకపోడు," అంది మహాలక్ష్మి.

ఆ మొర్నాడు కొడుకును బళ్లో వేసి నలుగుర్నీ పిల్చుకుని రాత్రి భోజనాల విందు ఏర్పాటుచేశాడు ధర్మయ్య. నలుగురూ ధర్మయ్య చేసిన పనికి 'సెభాష్' అని మెచ్చుకుంటూ పెద్ద చదువులు చదివి హోదాగా బ్రతకమని దీవించారు సుబ్బిగాడ్ని. ధర్మయ్య మాత్రం నెత్తిన అక్షింతలు చల్లుతూ "నా తండ్రి ఈ వృత్తిమీద ఆధారపడ్డాడు. మా తాత ముత్తాతలనుంచీ ఈ వృత్తిని నమ్ముకున్న వాళ్ళే. నువ్వు మాత్రం దాన్ని నిర్లక్ష్యం చెయ్యకు బాబూ" అన్నాడు మనసులో.

భార్య పట్టుదలమీదే అయిదో తరగతి వరకూ చదివించాడు సుబ్బిగాడ్ని. సుబ్బిగాడు చదువులో చురుగ్గానే ఉండేవాడు. మూడు సంవత్సరాల్లో అయిదో తరగతిలో కొచ్చాడు. రెండు తరగతుల్లో డబుల్ ప్రమోషన్లు కూడా ఇచ్చారు సుబ్బిగాడికి. మహాలక్ష్మి సంబరం చెప్పటానికి తరంగాదు. చిన్నగానవ్వుకునేవాడు ధర్మయ్య.

ఆ యేటితో అయిదో తరగతి పూర్తయిపోయింది. ఫస్టుఫారంలో చేర్చాలి. అంటే పెద్ద చదువుల్లోకి వచ్చాడన్నమాట.

ధర్మయ్య అన్నాడు "ఇక చాల్లేరా బాబూ!" అని. భార్య ఇష్టపడలేదు. కొడుకూడదూ అని భార్య అంటే లక్ష్యపెట్టేవాడు కాదు గాని సుబ్బిగాడికి కూడా చదువుకోవాలనే ఉంది గట్టిగా మందలిస్తే ఏడుస్తూ కూర్చున్నాడు. "సర్లే చదువుకుందువు గాని ఏడవకు" అని ధర్మయ్య ఆనాడే సుబ్బిగాడ్ని స్కూల్లో జాయిను చేశాడు. తల్లీబిడ్డల ఆనందం చూసి మనసులో తృప్తి పడేవాడు ధర్మయ్య.

గదిలో కూర్చుని రాత్రీ పగలూ ఏకధాటిగా చదివేవాడు సుబ్బిగాడు. కిటికీ బయట్నించి తోడి స్నేహితులు ఆడుకుందాం రమ్మంటే, తను కనబడుతున్నంత సేపూ వాళ్ళలానే అల్లరి చేస్తారని కిటికీ రెక్కలు మూసేసేవాడు అప్పుడప్పుడు తల్లి మహాలక్ష్మి కసిరికొడుతూండేది వాళ్ళని. "ఆకతాయి వెధవలు. కూసేగాడిద సామెతలాగుంది" అంటూ విసుక్కుంటూ లోపలికొచ్చింది.

"ఏమిటది?" అన్నాడు ధర్మయ్య.

"ఏముంది? పనా పాటా...చదువుకుంటున్నవాడ్ని చెడగొట్టాలని - వెధవల్లారి వీళ్ళూను" అంది మహాలక్ష్మి.

"ఎవరే వాళ్ళు?" అని అడిగాడు ధర్మయ్య కొద్ది చిరాగ్గా.

"ఇంకెవరూ? ఆ రంగయ్య కొడుకు రత్నం వాళ్ళూను. వాళ్ళకి అబ్బలేదుగా చదువు; మనవాడు మాత్రం బాగుపడ్డ మేమిటని దుగ్ధ"

"పిల్లల్ని అలా అనకూడదే!"

"ఆ రంగయ్య పెళ్ళాంకు ఎంత కన్నె

కుల వృత్తి

త్రగా ఉందో తెలుసా?" అంది మహాలక్ష్మి.

ఇందులో నిజానిజాలు ధర్మయ్యకు తెలియకపోలేదు. పైకి "వాళ్ళఖర్మం కాలింది. ఏవిటి మనవాడ్ని చూసి అసూయపడటానికి? వాళ్ళ రత్నం తెలివితేటల ముందు మనవాడు చాల్తాడనా? రంగయ్య పిల్లవాడ్ని చదివించదల్చుకోలేదుగాని చదివించేపాటి స్థితిగతులు లేనివాడుకాడు." అన్నాడు ధర్మయ్య.

ఇటువంటివే చిన్న చిన్న విషయాల్లో తేలిపోతూండేది భార్య. "సాటివాళ్ళలో కాస్తఅక్షరజ్ఞానం ఉన్నవాడు సుబ్బిగాడే" అనుకునేది భార్య. ధర్మయ్య చివాట్లు పెట్టేవాడు. ఏమన్నా అంటే కంటనీరు పెట్టుకునేది. తనే జాలిపడేవాడు.

ఆ వరసని సుబ్బిగాడు మూడో ఫారం వరకూ మంచి మార్కుల్తో క్లాసుకంతా మొదటివాడుగా ప్యాస్ అవుతూ వచ్చాడు.

మూడో ఫారం పూర్తయి ఫోర్తుఫారం చదవాలంటే హైస్కూలు మారాలి. ధర్మయ్య మెల్లగా నసిగాడు" పోనీ ఇక్కడితో మానెయ్యకూడదూ" అని.

ఈసారి భార్యతోపాటు సుబ్బిగాడు కూడా విసుక్కున్నాడు. ఇదివరకు మల్లే ఏడవలేదు. "చదువులో ఉన్న గొప్ప, దుంగలు చెక్కుకోవటంలో ఉంటుందా!" అన్నాడు సుబ్బిగాడు. ధర్మయ్య మనసు కలుక్కుమంది. ఎంత నిర్లక్ష్యం?! తన తండ్రివడ్రంగి. తనవంశీకులంతా ఆ వృత్తిని నమ్ముకున్నవాళ్ళే. పిఱప కాలం, పిదప బుద్ధులూ - కాకపోతే అంత తీసి కట్టుగా మాట్లాడతాడా?...మళ్ళీ ఎప్పుడూ ఆ ప్రస్తావన తెచ్చేవాడు కాదు ధర్మయ్య.

ఫోర్తుఫారంలో జాయినయి జీతం కట్టాలంటే మాట్లాడకుండా జేబులో డబ్బుతీసి కొడుకుచేతిలో పెట్టాడు - అంతే! ఉలక లేదు పలకలేదు.

సుబ్బి ఫిఫ్తుఫారంలో కొచ్చే సరికల్లా చదువుకున్న స్నేహితులు ఎక్కువయ్యారు. అంతా తన క్లాసువాళ్ళే... సాయంత్రంపూట ఇంటిదగ్గర కూడా వాళ్ళతో నే గడిపేవాడు. రత్నం దూరంనించి చూస్తూ నిలబడేవాడు. సుబ్బి తనవేపు తిరిగి నవ్వితే మళ్ళీ నవ్వేవాడు. అంతే! మునుపటిలా గంటల తరబడి కబుర్లు చెప్పుకోటానికి వీల్లేకుండా ఉండేది. ఎప్పుడూ సుబ్బి చుట్టూ చదువుకున్నవాళ్లే తిరుగుతూ ఉండేవారు.

సుబ్బిగాడు రత్నం ఒక మంచి పనివాడుగా మాత్రం ఊహించుకునేవాడు. అంతవరకే! ఆ పనితనం అంటే ఏమిటో తనకి తెలుస్తేగా? అందులో మెరుగులు, అనుపానులు రత్నానికి తెలిసినటు తనకు తెలియవు. ఆ వృత్తి తను నేర్చుకోలేదుగా ?" అలా నేర్చుకోలేదనే చీకూ చింతా కూడా ఉండేదికాదు సుబ్బిగాడికి. పైపెచ్చు స్నేహితుల్తో తనకి బాడిద పుచ్చుకోవటమే చేతకాదు" అనేవాడు గర్వంగా. అంటే వాడి ఉద్దేశం తను కేవలం వడ్రంగి వంశంలో పుట్టినా తన కవేవీ అబ్బలేదని.

సుబ్బిగాడి కిప్పుడు తన్నెవరైనా 'సుబ్బిగా' అంటే అభిమానం వేస్తోంది. ఓనాడు తండ్రితో సహా చెప్పాడు ఇక ముందునుంచీ తన్ను సుబ్బారావు అని పిలవాలని. ధర్మయ్యకూడా అప్పుడప్పుడు అలవాటు కొద్దీ 'సుబ్బిగా' అన్నా మళ్ళీ సర్దుకునేవాడు.

ఆ ఏటితో సుబ్బారావుకి స్కూలు ఫైనలు పూర్తయింది. ఇక పై చదువులకి కాలేజీలో చేరాలి. సుబ్బారావు ఉత్సాహం చూస్తే ధర్మయ్యకు నోట మాట రాలేదు. అతనికి తోచాలిగాని ఈ వయసులో తను చెప్పి చేయించగలడా?" అనుకున్నాడు ధర్మయ్య. సుబ్బారావు కాలేజీలో చేరాడు. మొదటి టరమ్ఫీజు కట్టిం తర్వాత పదిపదిహేను రోజులవరకూ పాఠాలే మొదలుపెట్టలేదు. రోజల్లా సుబ్బారావు ఇంట్లో ఉన్నట్టే ఉండేది. "కాలేజీ చదువంటే ఇదేనట్రా" అంది మహాలక్ష్మి నవ్వుతూ. సుబ్బారావు పగలబడి నవ్వేశాడు.

కాలేజి చదువంటే మాటలా? ఎలా లేదన్నా అదుగో ఇదిగో అంటే మూడొందలవరకూ ఖర్చయింది. ఒంద రూపాయిలు సుబ్బారావు బట్టలకిందా, పుస్తకాలకిందా ఖర్చయింది. అక్కడితో సరిపోతే బాగానే ఉండేది. సుబ్బారావు కాలేజీ చదువుతో మరో సమస్య ఎదురొక్కింది. పొద్దున్న పదింటికి కాలేజీకి పోతే సాయంత్రం ఆరింటివరకూ ఇంటికి రావటానికి వీలుండేది కాదు. మధ్యాహ్నం భోజనం చెయ్యటానికి ఇంటికి రావాలంటే వ్యవధి చాలేది కాదు. అన్నం పట్టుకెళ్ళమని తల్లి అంటే సుబ్బారావుకి నామోషీగా ఉండేది. సాయంత్రం ఇంటి కొచ్చేసరికి ముఖం డొక్కుపోయి ఉసూరుమంటూ అవుపించేవాడు. రాగానే పెరట్లోకి వెళ్ళి మంచి

క్కుంటేగాని సుబ్బారావుకి ప్రాణం లేచి వచ్చేది కాదు. "ఏడిసినట్టే ఉంది చదువు" అని మనసులో బాధకొద్దీ చిరాకుపడేవాడు ధర్మయ్య.

కొడుకు కష్టం చూడలేక సైకిలు కొన్నాడు ధర్మయ్య. దానికింద మూడొందలు ఖర్చయింది. డబ్బు పోతే పోయింది గాని కొడుకు సుఖపడుతున్నాడంటే ఆ డబ్బుపాటి చెయ్యదా ఈ సంతృప్తి?

మొదటి ఏడాది పూర్తయింది అనేసరికి సుబ్బారావు చదువుకింద వెయ్యి రూపాయిలు ఖర్చయాయి.

కొడుకు విషయంలో ఏ ఆశలయితే పెట్టుకున్నాడో అవన్నీ ఇప్పుడు తారుమారైపోతున్నాయి. వాడ్నిగురించి కన్న కలలన్నీ ఇలా పరిణమించాయి. స్థలం కొందామని కూడబెట్టిన డబ్బులో అప్పుడే చాలావరకూ సుబ్బారావు చదువుకిందే ఖర్చయిపోయింది. తనకా వయస్సు మళ్లింది చూపు సరిగా ఆనటం లేదు. మునుపటిలా కష్టించలేక పోతున్నాడు. పనిలో మునుపటంత ఉత్సాహం కూడా ఉండటం లేదు. సుబ్బారావు ఇంకా ఏడాది చదవాలి. అప్పటికిగాని చేతి కక్కరకు రాడు. రంగయ్య తన ఈడువాడే. ఈ మధ్య దారిలో కనుపించాడు. కొడుకు రత్నం చేతికందింతర్వాత ఇప్పుడు చాలా సుఖంగా ఉందనీ, చిల్లర మల్లర పనుల్లాటివి తను చూసుకుంటే పెద్ద పనులన్నీ వాడే సెట్టుకొస్తున్నాడనీ అన్నాడు.

రంగయ్యను తల్చుకుంటే పనీ పాటా నేర్చుకుంటే తన కొడుకూ అక్కరకు వచ్చేవాడుకదా అనిపించింది ధర్మయ్యకు.

ఆనాడు భార్యతో అన్నాడు చూశావా రత్నం ఎంత ప్రయోజకుడయ్యాడో" అని.

"మనవాడు మాత్రం కాడనా మీ ఉద్దేశం?" అని ఎదురు ప్రశ్న వేసింది మహాలక్ష్మి.

దానితో తనకేవిటి వాదన అని మాట్లాడకుండా ఊరుకున్నాడు ధర్మయ్య.

ఆరోజు ఇంట్లో చిన్న రభసజరిగింది. నిజంగా ఈ ఇరవైఏళ్ళలో ఆ ఒక్కసారే కొడుకుమీద అంతగా చిరాకుపడింది. కాఫీ హోటల్లో అరువు బాపతు పాతికా ఇమ్మని తలుపువార నిలబడి నసిగాడు సుబ్బారావు, ధర్మయ్యకు ఒళ్ళు మండుకుపోయింది. గట్టిగా చివాట్లుపెట్టి చేతిలో డబ్బు పెట్టిం తర్వాత "కష్టం తెలుసుకుని మసులుకోవాలి" అన్నాడు ధర్మయ్య.

తప్పు మీదపెట్టుకుని సుబ్బారావు ఏం మాట్లాడుతాడు? గప్‌చిప్‌గా ఊరుకున్నాడు.

రత్నం తన పనితనం గురించి చెప్తుంటే నీళ్లు తాగి చల్లటి నీళ్లతో ముఖం కడు ... భార్యకూడా "భోసి బద్ధుడా! ఇం...

ప్పుడూ అరువు పెట్టడులెండి" అని సమర్థించింది. ఆ తర్వాత మహాలక్ష్మి పెరట్లోకి వెళ్ళిపోయింది. సుబ్బారావు కాలేజీకి వెళ్ళిపోయాడు. పదిదాటింది. అప్పుడే ఎండ చుర్రున పాకిపోతోంది. ధర్మయ్య మెల్లగా లేచి గదిలోకి వెళ్ళాడు. చొక్కా వేసుకుని చేతికర్ర ఊతంతో వీధిగుమ్మంలో కొచ్చేసరికి రత్నం "నేను బాబయ్యా!" అంటూ పలకరించాడు.

"నువ్వరా? ఎవరో అనుకున్నాను. చూపు బొత్తిగా మసకేసి పోయిందిరా రత్నం" అన్నాడు ధర్మయ్య. అరుగుమీద కూర్చుని "ఎలాగుందిరా పని?" అని ప్రశ్నించాడు ధర్మయ్య. "ఎక్కడన్నా మంచిస్థలం చూసికొనాలని ఉంది. ఎంతకాలమని చెప్పు వాళ్ళ కొంపల్లో వీళ్ళ కొంపల్లోనూ గడపటం?" అన్నాడు రత్నం.

"నువ్వెనట్రా స్థలం కొనేది?" అని ఆశ్చర్యంగా అడిగాడు ధర్మయ్య.

"నాన్న సంపాదన, నాది కలిపితే సంసారం గడిచిపోగా కాస్తోకూస్తో వెనకేశాం. అది వృథాగా ఖర్చయిపోకుండా ఈపని చేద్దాం అనిఉంది" అన్నాడు రత్నం.

చేతిలో డబ్బుంటే మంచిపనికాదురా. శుభస్య శీఘ్రం...వెంటనే కొనెయ్యండి" అని సలహా ఇచ్చాడు ధర్మయ్య.

కాసేపు అవీ ఇవీ చెప్పుకుని రత్నం వెళిపోయాడు.

రంగయ్య అదృష్టవంతుడూ తను దురదృష్టవంతుడనే తలపు ధర్మయ్యను గాఢంగా పట్టుకుంది. లేకుంటే ఈ వయసులో ఒంట్లో శక్తిలేకపోయినా చచ్చినట్టు పనిచెయ్యాలి. కొడుకు ఆశ ఇప్పుడప్పుడే లేదు. తనున్న పరిస్థితిలో ధర్మయ్యకు అకారణంగా కోపం వచ్చేది; నిష్కారణంగా విసుక్కునేవాడు, చిరాకు ఎక్కువయింది. తరుచు భార్యమీద ఎగిరిపడేవాడు.

"స్థలం కొందామనుకుంటే ఎంత డబ్బూ మనవాడి చదువుకే సరిపోయె" అన్నాడు ధర్మయ్య.

"ఏం చేసినా వాడికోసమేగా స్థలం బదులు చదువు చెప్పించాం. ఎలాగయితే నేం?" అంది మహాలక్ష్మి. కొడుకంటే ఇష్టంలేకనా విసుక్కోవటం? పనిచెయ్యలేని స్థితి, చెయ్యక తప్పని పరిస్థితులూ అతన్నలా అసందర్భపు మనిషిని చేస్తున్నాయి. భార్య ఊరుకు నేమనిషి కాదు. "పెద్దవయసొస్తుంటే చిరాకు హెచ్చిపోతోంది" అనేది. దాంతో మరింత రెచ్చిపోయేవాడు. రొప్పుకుంటూ బయటికి నడిచేవాడు.

3

బాడిద బుజాన్నవేసుకుని చిల్లర మరమ్మత్తులు చెయ్యటానికైనా సిగ్గువిడిచి బజార్నపడినా ఎవరన్నా ఎదురై ఎక్కడికి ధర్మయ్యా అంటే 'కొట్టుకురా' అని అబద్ధం ఆడేవాడు. చాటుమాటుగా బేడకీ పావలాకీ కూడా కష్టించేవాడు. పైకి నలుగురుతో ఘరానాగా, మసులుకునేవాడు. తోడి పనివాళ్ళంతా పరువుగా బ్రతుకుతుంటే తన ఖర్మం కాలిందా? బేడకీ పావలాకీ కూడా కక్కుర్తి పడాలా? ఈ తలపుతో చాలా బాధపడేవాడు ధర్మయ్య. ఒక్కడూ కొట్లో కూచుని దిగులుపడేవాడు. రోజుకో రూపాయి రెండూ సంపాదిస్తే మటుకు సంసారం గడిచిపోతుంది కాని సుబ్బారావుకి జీతం కట్టాలంటే వాళ్ళనీ వీళ్ళనీ దేవురిస్తేగాని అప్పు పుట్టేదికాదు. తీర్చాలంటే ఇంట్లో ఉన్నవన్నీ ఒకటొకటే తాకట్లలోకి పోతున్నాయి. ఒకటి రెండుసారు రత్నం దగ్గిర అప్పు పెటాడు. ఇంతవరకూ తీర్చలేదు. ఏముఖం పెట్టుకుని అడుగుతాడు మళ్ళీ. తోడివాళ్ళంతా స్థలాలు కొనటం, ఇళ్ళు కట్టటం గురించి ఆలోచిస్తుంటే తను ఎంతసేపూ అప్పుల గురించిన ఆలోచనల్లోనే మునిగిఉండటం ధర్మయ్య నెత్తి మొత్తుకునేవాడు.

ఆ దిగులుతోనే, కష్టంతోనే కొడుకు చదువు అయిందనిపించాడు ధర్మయ్య. ఇంకా పై చదువుల మాట ఇంట్లో పరిస్థితుల్ని బట్టి తలపెట్టటం మానేశాడు సుబ్బారావు. ఇంతకాలం సంసారంకోసం శ్రమించి, విశ్రాంతి తీసుకోవాల్సిన వయస్సులో వల్లమాలిన బాధ్యతలనుంచి తండ్రిని తప్పించవల్సిన బాధ్యత తనమీద ఉందనీ, తను అందుకు సర్వప్రయత్నాలూ చెయ్యాలనీ ఆత్రుత సుబ్బారావుకు లేకపోలేదు. దిగులుతో చిక్కి శల్యమయిన ధర్మయ్యకు నవ్వుతూ ధైర్యం చెప్పాడు సుబ్బారావు. తల్లి కొడుకుని గురించి ఆశగా కొండంత సంతృప్తి వ్యక్తంచేస్తూ భర్తకు ధైర్యం చెప్పేది. ధర్మయ్య మూలిగేవాడు.

సుబ్బారావు ఖాళీగా ఉండకుండా రోజూ కనిపించినవాడినల్లా ఉద్యోగం గురించి వాకబులు మొదలుపెట్టాడు. పత్రికల్లో ప్రకటనలు చూసి వాటికి అప్లై చేశాడు. మొదట ప్రయత్నం హోదాగా పెద్ద ఉద్యోగాలకోసం ప్రయత్నాలు చేశాడు. ఎవర్ని కలుసుకోవాలో వాళ్లందర్నీ కలుసుకున్నాడు. ఈ ప్రయత్నంలో కొంత డబ్బుకూడా లంచంగా అయితేనేం, మరో ఖర్చుగానైతేనేం ఖర్చు పెట్టాల్సివచ్చింది. లాభం లేకపోయింది. ఆఖరికి గుమాస్తాగానైనా చేరాలి అనుకున్నాడు మనసులో. అక్కడికి గుమాస్తాగా చేరటం సులభమైనట్లు. ఆఖరికి ఉద్యోగమంటూ దొరుకుతుందా అని దిగులుపడ్డాడు సుబ్బారావు. ఎప్పుడూ అదే ఆలోచన. చిన్నతనంలో భవిష్యత్తుని గురించి ఊహించుకున్నదానికీ జరుగుతున్నదానికీ ఏవిధమైన సంబంధమూ లేదు. అవన్నీ పగటి కలలు. ఇంట్లో పరిస్థితులు కలవరపెడుతుంటే పట్టుదల హెచ్చినా ఫలితం లేకపోవటంతో మనసులో ఏడ్చేవాడు.

★ కులవృత్తి ★

ఒక్కొక్కప్పుడు ఎంత దూరమో తెలియకుండా పరాగ్గా నడిచేసేవాడు. ఎంతసేపూ కష్టించి చెమట కార్చే ధర్మయ్య బడుగు దేహం కంటిముందు నిలిచేది. కడుపులో చెయ్యి పెట్టి దేవేస్తున్నట్టుగా బాధపడేవాడు సుబ్బారావు.

ఈ ఉద్యోగంకోసం పడే ఆరాటంలో ప్రపంచంఅంతా దయారహితంగా అవుపించేది. మనిషికి మనిషికీ మధ్య ఇంత అగాధం ఎందుకుండాలి? ఎవరు సృష్టించారు? తనకెందుకు ఉద్యోగం దొరకదూ? అనుకున్నాడు సుబ్బారావు. ఎంతసేపూ లోకం తన కేదో అన్యాయం చేస్తోందనే తలపు అతన్ని గాఢంగా పట్టుకుంది. ఎవర్నీ పలకరించేవాడుకాదు. వ్యక్తుల తరహా లెటుకంటివో తనకు తెలియకపోయినా మనుష్యుల్ని సిద్ధాంతాల్లోంచి చూ[illegible] డబ్బున్నవాళ్ళంటే ఏవగించుకునేవాడు. ముఖం ఎత్తి మాటాడేవాడుకాడు. అడుక్కునేవాళ్ళంటే సుబ్బారావుకి గుండె కరిగిపోయేది. జేబులోంచి కానీ తీసి మూకుటులో వేసి చరచరా వెళ్ళిపోయేవాడు. ఎన్నడూలేనిది ప్రతి విషయంలోనూ అనుమానం, ఏవగింపూ ఎక్కువయింది సుబ్బారావుకి. "సుబ్బారావు పూర్తిగా మారిపోయాడురా" అన్నాడు పాతస్నేహితుడు వెంకట్రావు. వెంకట్రావు బాగా ఉన్నవాడు. సుబ్బారావు ఆవేశంగా" ఎవరు మారినా మీరుమటుకు మారరు. మారాల్సిన అవసరం ఉన్నా లక్ష్య పెట్టరుగా" అన్నాడు.

అయోమయంగా చూస్తూ నిలబడిపోయాడు వెంకట్రావు.

4

పువసులో తండ్రి కిచ్చిన వాగ్దానం గుర్తొస్తే ఇంటిముఖం చూడ్డానికే సిగ్గుగా ఉంటుంది. రోజల్లా ఇలా తిరగటం వేళకి భోజనానికి ఇంటికి చేరటం - ఇంతేనా? తనకి ఉద్యోగం దొరకదా?

"ఏరా ఎక్కడా దొరకలేదూ?" అన్నాడు ధర్మయ్య.

"ఎందుకు దొరకదు? ఉద్యోగం అంటే మాటలా మరి?" అన్నాడు సుబ్బారావు.

ధర్మయ్య దిగులుగా నవ్వాడు. సుబ్బారావు తలవొంచుకుని వెళ్లిపోయాడు. ఆ రాత్రల్లా అదే ఆలోచన. ఏవిటి చెయ్యటం? ఎటూ తెగని ఆలోచనల్లోంచి తెప్పరిల్లేసరికి దూరంగా మూడు గంటలు కొట్టటం విన్నాడు. కిటికిలోంచి చిన్నగా వానజల్లుమీదికి కురుస్తోంది. కిటికీ రెక్కలు మూసి పడుకోబోతుంటే తండ్రి గొంతు చించుకుని దగ్గటం వినిపించింది. వర్షపుహోరు హెచ్చి కిటికీలోంచి చూస్తే అంతా అలుముకు పోయినట్లుగా అవుపిస్తోంది. ముందు దారి తెలియక అగమ్య గోచరంలా ఉంది తనస్థితి. తండ్రి కష్టపడుతున్నాడు. చిరివకి ఓ ఆలోచన తట్టింది. ఏలూరులో ఇద్దరు ముగ్గరు స్నేహితులున్నారు. వాళ్ళకి రాసి వాకబు చెయ్యాలి. అదృష్టం బాగుంటే కలిసిరాకూడదూ? అనుకున్నాడు.

నిట్టూరుస్తూ లైటు తగ్గించి పడుకున్నాడు.

రాత్రి బాగా పొద్దుపోయేవరకూ మెలుకువగా ఉన్నాడేమో తెల్లవారి లేచేసరికి బారెడు పొద్దెక్కింది. లేచి కళ్లు నులుపుకుంటూ నడవలోకి ఒచ్చేసరికి బుజాన్న బాడిద తగిలించి గుమ్మం దిగుతున్న తండ్రి అవుపించాడు. సుబ్బారావు కెందుకో శరీరమంతా సిగ్గుతో కుంచించుకుపోయింది. ఆ క్షణంలో పెద్ద తప్పు చేసినవాడిలా బాధ చెందాడు. తన్ని కన్నందుకు ఇదా శాస్తి తండ్రికి అనుకున్నాడు. ఈ బాధతో రాత్రి తట్టిన ఆలోచనపట్ల పట్టుదల హెచ్చింది. ముఖం కడుక్కుని కాఫీ అన్నా పుచ్చుకోకుండా గదిలో కెళ్లి ఉత్తరం రాస్తూ కూర్చున్నాడు.

తను ఉత్తరం రాసిన వారంరోజులకి జవాబు అందుకున్నాడు. ఉద్యోగాలయితే ఉన్నాయని, తనలాంటివాళ్ళు చెయ్యాల్సిన వని కావని, వాటి వివరాలు రాసుకొచ్చాడు. భద్రాచారి అనే స్థితిమంతుడున్నాడని, వాడివద్ద గుమాస్తాగా నమ్మకమైనవాడు కావాలనీ తనకు ఎరిగున్న వాళ్ళ ద్వారా తెలిసిందనీ రాశాడు. జీతం ఏభై ఇస్తాట్ట. ఇక పైన దమ్మిడీ అడిగి ప్రయోజనం లేదనీ రాశాడు. మనసు కొంత తెరిపిన పడింది సుబ్బారావుకి. అయితే తండ్రి ఒప్పుకుంటాడో లేదో? ఆ ఉత్తరం తండ్రికి చూపించటానికిగ్గానీ, ఆ ఉద్యోగం సంగతి ఎత్తటానిగ్గానీ ఏదో తప్పుచేసినవాడిలా సిగ్గుపడుతున్నాడు. "ఏదైనా సానుకూలపడిందా" అంటే చప్పున "ప్రయత్నిస్తున్నాను" అన్నాడంతే. ఉత్తరం సంగతి ఎత్తలేదు. ఆ రాత్రల్లా దీర్ఘంగా ఆలోచించాడు. తెల్లవారింతర్వాత సుబ్బారావు వీధి గదిలోకొచ్చి నిలబడ్డాడు. ధర్మయ్య అంపం పదును పెడుతున్నాడు. తల్లికూడా ఆ సమయంలో అక్కడేఉంది. నెమ్మదిగా మనసులో చెప్పదల్చుకున్నది చెప్పేశాడు "ఉద్యోగం దొరికింది" అన్నాడు. ఈ సంతోషవార్త చెప్పటంలో ఎంత ఉత్సాహం వ్యక్తం చెయ్యగలిగితే ఆ ఉద్యోగం విలువకూడా ఎదురువాళ్లకి ఆ అంతస్థులోనే అర్థం చేసుకోగలరు. అని సుబ్బారావు ఉద్దేశం. అయితే అతి మామూలు విషయం ప్రస్తావిస్తున్నట్టే చెప్పాడు.

"ఎక్కడరా?" అన్నాడు గంపంత ముఖంతో ధర్మయ్య.

అయితే ఆ ముఖం మరుక్షణంలో దమ్మిడీ కొసంతయిపోయింది ఏలూరులో ఉద్యోగం అనీ ప్రస్తుతం ఏభై ఇస్తారని తర్వాత మన సామర్థ్యాన్ని బట్టి అదృష్టం బాగుంటే వృద్ధిలోకి రావచ్చనీ ఉన్నవీ లేనివీ చెప్పేశాడు సుబ్బారావు. తండ్రిని సుముఖుడ్ని చెయ్యాలని అనేకవిధాల ప్రయత్నం చేసాడు. ధర్మయ్య అమీతుమీ తేల్చలేదు. మౌనంగా తన పనిలో నిమగ్నమైపోయాడు.

అయితే తల్లిని సుముఖురాల్ని చెయ్యటానికి సుబ్బారావుకి ఎక్కువసేపు పట్టలేదు. "నాకుమటుకు ఇంత చదువు చదివింతర్వాత ఈపాటి ఉద్యోగం చెయ్యటం మనసా చెప్పు. పరిస్థితుల్ని బట్టి తొందరపడాల్సి ఒస్తోంది. నాన్నని ఒప్పించాల్సిన బాధ్యత నీదమ్మా" అన్నాడు సుబ్బారావు. తల్లి సరే లెమ్మంది.

ఆ సాయంత్రం ధర్మయ్య అన్నాడు. "పుట్టినప్పట్నించీ ఈ ఊరులో పెరిగాను. పెద్దవాడ్నయి పనిపాటలు నేర్చుకున్నాను. ఈ వయసులో మరో వూరు పోవాలంటే అదోలా అనిపిస్తోంది" అని.

సుబ్బారావు చెప్పాడు "నాకుమటుకు మనసా? పరిస్థితులు..." ఈ ఆఖరి మాటలు సుబ్బారావు నోటిలోంచి ఊడిపడలేదు. ధర్మయ్య ఆవేశంగా అరిచాడు "ఎంతో ఆశ పెట్టుకున్నాను. అన్నీ తప్పేశావు. నిన్ను నీవు ఉద్ధరించుకోలేని స్థితిలోకి జారిపోయావు. రత్నం చూడు. సుఖంగా కాలక్షేపం చేస్తున్నాడు. రంగయ్య అదృష్టవంతుడు"

సుబ్బారావు తల వంచుకుని ఠావక్కైతిరిగాడు. ధర్మయ్య మెల్లగా భుజం తట్టి "మరేం బాధపడకు. నా జీవితం చాలావరకూ గడచిపోయింది. నిర్వాకం చేద్దామనుకున్నాను. దేవుడు తప్పు తలిచాడు. నీ విషయమే ఆలోచిస్తాను. భగవంతుడు దయదల్చి మంచి ఉద్యోగం దొరికితే మంచిదే. లేకుంటే ఓ కులపాఠం నేర్చుకుంటావు" అన్నాడు.

సుబ్బారావు ఏమీ మాట్లాడలేదు. నిశ్శబ్దంగా వీధిలోకి నడిచాడు. తండ్రి అన్న ప్రతి ముక్కా అతని మెదడులో బాగా పనిచేస్తున్నాయి. "తను చేసింది తప్పు పనా? కాదే! చదువుకున్నాడు. ఉద్యోగం చెయ్యా లనుకుంటున్నాడు. ఇందులో తప్పేముంది?" ఈ విషయం అంతు తేల లేదు సుబ్బారావుకి. ఆ రాత్రి ఎలాగయినా తండ్రిని ఒప్పించి మర్నాడు ఏలూరు ఉత్తరం రాయా లనుకున్నాడు.

ధర్మయ్య కొడుకు తాపత్రయం చూసి జాలిగా "మనసులో బాధకొద్దీ అన్నాను కానీ రాక తప్పుతుందా మరి" అన్నాడు. కొంచెంత బరువు తీరినట్లనిపించింది సుబ్బారావుకి

ఆ మర్నాడు ఏలూరు ఉత్తరం రాశాడు తర్వాత మంచిరోజు చూసి ఏలూరు బయల్దేరాడు. ముందు తను వెళ్ళి మంచీ చెడూ చూసుకున్న తర్వాత తండ్రికి ఉత్తరం రాయొచ్చు. అనుకున్నాడు.

ఏలూరు వెళ్ళింతర్వాత అంతా అనుకున్నట్టుగా సవ్యంగానే జరిగిపోయాయి. భద్రాచారి తన్ను గుమాస్తాగా చేర్చుకోవటానికి ఇష్టపడింతర్వాత జీవితం ఖాయం చేసుకుని చిన్న పెంకుటిల్లు పదిహేను రూపాయలకి అద్దెకి తీసుకుని తండ్రికి ఉత్తరం రాశాడు బయల్దేరి రమ్మని. తర్వాత అయిదారు రోజుల్లో తల్లి తండ్రి సామానుతో సహా వచ్చేశారు. ఆ సామాను సర్దుకోవటం, హడావిడిలో రెండు రోజులు గడిచిపోయాయి. ఆ సాయంత్రం ధర్మయ్య అడిగాడు భద్రాచారి అంటే ఎవరో, ఆ ఉద్యోగమేమిటో, జీతమెంతో వివరంగా చెప్పమని.

సుబ్బారావు తెచ్చిపెట్టుకున్న నవ్వుతో, షావుకారు గురించి ఉన్నవీ లేనివీ పొగిడి, ముందు ముందు అభివృద్ధిలోకొచ్చే అవకాశం తప్పకుండా ఉంటుంది అన్నాడు. ఇంత పెద్ద అబద్ధం ఆడింతర్వాత సుబ్బారావు మరో ప్రశ్న వేసే అవకాశం ఇవ్వకుండా 'పనుంది' అంటూ లేచి వీధిలోకి వెళ్ళిపోయాడు. అప్పుడే చీకటి పడుతోంది. మహాలక్ష్మి దీపం వెలిగిస్తూ భగవద్ధ్యానం చేసుకుంటోంది.

ధర్మయ్య మెల్లగా వీధిగుమ్మంలో కొచ్చి నిలబడ్డాడు. వచ్చేపోయే జనంతో రోడ్లన్నీ రద్దీగా కోలాహలంగా ఉన్నాయి. ధర్మయ్య ఆలోచనల్లో పడ్డాడు. కళ్ళు చెమ్మగిలాయి. అరవైఏళ్ళ సంబంధం తెంచుకుని ఈవూరు రావాల్సొచ్చింది. ఎవరో ఆత్మీయుడు దూరమైనట్టుగా స్వగ్రామం తల్చుకుని బాధపడ్డాడు. ఇటువంటి అనుభవం తన కెప్పుడూ కలగలేదు. నాది అనేది ఏదీ లేక [illegible]

పోయినా ఆ గడ్డమీద జీవించిన మమకారం అతని ప్రేగుల్ని చుట్టుకుపోయింది. తన కావూరుతో ఋణం తీరిపోయింది.

5

భద్రాచారి బాగా ఉన్నవాడు. ఏకాకిగా ఉంటున్నాడు. భార్య చనిపోయి రెండు సంవత్సరాలయింది. ఇద్దరాడపిల్లలూ అత్తవారింటికి వెళ్ళిపోయినా తరుచువాళ్ళని అల్లుళ్ళతో సహా పిలిపించి వారం పది రోజులు ఉంచుకుని సంతోషపడుతూంటాడు.

క్రమంగా సుబ్బారావు వారి కుటుంబ విషయాలన్నీ తెలుసుకోగలిగాడు. భద్రాచారి బహు కోపిష్ఠి మనిషి అని తెలుసుకోవటానికి సుబ్బారావుకు ఎక్కువకాలం పట్టలేదు. గడించింది చాలదన్నట్లు అతను పడే తాపత్రయం చూస్తుంటే సుబ్బారావుకి ఆశ్చర్యం వేసేది. కొత్తలో నవ్వుకునేవాడు. రాను రాను ఏవగింపు పుట్టేది. భద్రాచారి ఎక్కువ గంభీరంగా ముభావంగా ఉండేవాడు. అతని మనసుకు నచ్చని పనేదైనా జరిగితే ముఖం ఎర్రబడేసుకుని చిరాకుపడేవాడు. ఒకటి రెండుసార్లు తన విషయంలో కూడా ఇలాగే జరిగింది. చచ్చేటంత అభిమానపడ్డాడు సుబ్బారావు.

మర్నాడు యజమానిగురించి ఎత్తుకొస్తూ "మహాకోపిష్ఠిలాగున్నాడే" అన్నాడు వంటవాడితో.

వంటవాడు భయంగా వలువేపులా పరిశీలించి రహస్యంగా "కర్కోటకుడు. బ్రతికున్నంత కాలం రాసి రంపాన బెట్టాడు భార్యని. ఇప్పుడు తల్చుకుని బొల్లి ఏడుపు లేడుస్తాడు. ఎవడికి జాలి పీడంటే?" అన్నాడు.

సుబ్బారావు ఏదో అడగాలనుకుని తన కెందు కన్నట్లుగా మాట్లాడకుండా ఊరుకున్నాడు.

వంటవాడు చెప్పుకుపోతున్నాడు. "విషం పెట్టి చంపేశాడంటారు. ఎంత వరకూ నిజమో తెలియదు సుమండీ" అని క్షణం ఆగి "నిజమైనా కాకపోయినా అందుకు తగినవాడే సుమండీ" అన్నాడు.

ఈ ధోరణి ఇలా సాగనివ్వటం ప్రమాదమనిపించింది సుబ్బారావుకి. వస్తానని చెప్పి తప్పించుకున్నాడు. ఇంటికి వస్తుంటే దారిలో ఆనాడు జరిగిన పరాభవం తల్చుకుని మథనపడసాగాడు. చెట్టంత మనిషిని పట్టుకుని ఎన్ని మాట లన్నాడు. సుబ్బారావు జీవితంలో ఇదో కొత్త అనుభవం.

అయితే మర్నాడు వంటవాడి చరిత్ర వింటుంటే కేవలం అంతమాత్రానికి అభి [illegible] ...కంటె

పౌరుషాలు పెట్టుకుంటే ఈ ఉద్యోగం ఎంతకాలమో చెయ్యలేమనీ తేలింది. ముందు ముందు ఎటువంటి పరిస్థితులు ఎదురొక్క వలసివస్తుందో అనే దిగులు పట్టుకుంది సుబ్బారావుకి. ఓనాడు పుస్తకంలో లెక్క రాస్తుంటే కలం కక్కసింది. భద్రాచారి పక్కనే ఉన్నాడు. "కలంలో సిరా అయిపోతే పోసుకోవాలని తెలియదూ?" అన్నాడు విసుగ్గా.

సుబ్బారావు మనస్సు కలుక్కుమంది. మాట్లాడకుండా తల వంచుకుని పని చేసుకుపోయాడు. వంటవాడిముందు తను మాట పట్టం తల్చుకుంటే తలకొట్టేసినట్టుగా అనిపించింది.

చీకటి పడింది. సుబ్బారావు ఆఫీసుగదికి తాళం వేసి ఇంటికి బయల్దేరబోతుంటే వంటవాడు పలకరించాడు. సుబ్బారావు మాట్లాడలేదు.

"మీరు బాధపడుతున్నారు కదూ? అలా అయితే. ఎంత కాలమో పనిచెయ్యలేరు" అన్నాడు వంటవాడు.

మారు జవాబు చెప్పకుండా ఇంటికొచ్చేశాడు సుబ్బారావు. "అలాగున్నావేం?" అని అడిగింది తల్లి. "ఏమీ లేదు" అంటూనా న్చేశాడు సుబ్బారావు ఇటువంటివన్నీ ఇంటిదగ్గిర చెప్పేవాడుకాదు. మనసులో మటుకు బాధపడేవాడు.

*　　　*　　　*

రంగయ్యరాసిన ఉత్తరం ధర్మయ్య చదువుతుంటే తలుపువార వింటూ నిల్చున్నాడు సుబ్బారావు. సుబ్బారావు చదువు

★ కులవృత్తి ★

కున్న చేతికందినందుకు సంతోషిస్తున్నానని తన కొడుకు రత్నం గురించి తన కింక చింత లేదనీ వాడో దారిన పడ్డాడనీ సంతృప్తి వ్యక్తంచేస్తూ రాసుకొచ్చాడు.

* * *

స్వేచ్ఛకోసం పెనుగులాడే స్వభావం మానవసహజం; ప్రకృతి ధర్మమూను. సుబ్బారావు కిప్పుడు వాటిగురించి ఆలోచించి ప్రయోజనంలేదు. ఈ సంఘర్షణ అనంతమైనది.

6

అప్పుడే అయిదారు నెల్లయింది సుబ్బారావు పనిలో చేరి. ఈ ఆరునెల్లో సుబ్బారావు ఎన్నో విషయాలు అనుభవ పూర్వకంగా గ్రహించాడు. భద్రాచారివద్ద ఇంక్రిమెంటు విషయం ఎత్తి ప్రయోజనం లేదు అని తెలిసిపోయింది. వంటవాడు ఓ రూపాయి జీతం హెచ్చు చెయ్యమంటే ఆరోజల్లా వాడ్ని తిడుతూనే ఉన్నాడు భద్రాచారి. "ఇంతకంటే తక్కువకే దొరక్కపోరు" అన్నాడు.

వంటవాడు తన దగ్గిర ఆ ప్రస్తావన తెచ్చి కళ్ళనీళ్లు కార్చాడు. సుబ్బారావు మాట్లాడలేక ఇంటికొచ్చేశాడు.

ధర్మయ్య అడిగాడు "జీతం పెంచారా?" అని.

"రెండుమూడు నెల్లో ఇవ్వొచ్చు" అన్నాడు సుబ్బారావు. "నిజమే కామోసు" అనుకున్నాడు ధర్మయ్య.

పనిమాత్రం ఊపిరి సలపకుండా ఉండేది. జీతం మామూలే. రాత్రి పదింటివరకూ చెమట ఓడ్చి పనిచేసి ఇంటికొచ్చేసరికి "ఇంత ఆలస్యం అయిందేరా!" అని తల్లి అడిగితే స్నేహితుల్తో షికారు వెళ్ళాననో, సినిమాకనో అబద్ధం చెప్పేవాడు. మళ్ళీ తనే ఈ అబద్ధాల బ్రతుకుని తల్చుకుని చిరాకు పడేవాడు. తండ్రికి తన్నుగురించి ఏర్పడ్డ అభిప్రాయం నిజంకాదని నమ్మించాలనే ప్రయత్నంలో ఇటువంటి అబద్ధాలు ఆడక తప్పటంలేదు.

భద్రాచారికి ఊళ్ళో నాలుగు మేడలున్నాయి. అవన్నీ చిన్నచిన్న వాటాలుగా అద్దెలకిచ్చాడు. ఓ చిన్న పేటలాగుంటుంది ఒక్కొక్క మేడ. ప్రతినెలా అద్దెలు వసూలు చెయ్యవలసిన బాధ్యత సుబ్బారావుది. ప్రతి నెలా పెద్దజట్టీ జరుగితే గాని అద్దెలు సక్రమంగా వసూలయ్యేవి కావు. ఈ తగాదాలతో సుబ్బారావు తలబట్టకట్టిపోయేది. రెండు మూడు తారీకుల్లో అద్దెలు పూర్తిగా వసూలు కాకపోతే భద్రాచారికి తను సంజాయిషీ చెప్పుకోవాలి. అయితే నోరు చించుకుని అరిచినా ప్రయోజనంలేని ముసలమ్మగోడు ప్రతీనెలా తప్పేదికాదు. కొడుకూ, కోడలూతో సహా తూర్పువేపు భాగంలో ఉంటున్నారు. అద్దె విషయం ఎత్తేసరికల్లా కాళ్ళావేళ్ళా పడేది. ఒకటి రెండు నెలలు తన జీతంలోనే కట్టి ఆ తర్వాత ఆవిడవద్ద వసూలు చేసుకునేవాడు.

ఈ నెల్లోకూడా పరిస్థితులలానే ఒచ్చాయి. ముసలమ్మ నాలుగురోజులు ఆగమని మరీ మరీ ప్రాధేయపడింది. సుబ్బారావు చెప్పాడు "నే చెయ్యగలిగేది ఏమీ లేదు. షావుకారి సొమ్ముగాని నాది కాదు నీమూలాన నేను బాధపడాలి. నాగురించి కొంతమంది బాధపడేవాళ్లున్నారు." అని.

ఆ ముసల్ది చాలా పేదదనీ, చాలా కష్టాలు పడుతోందనీ, చెప్పేసరికి ఏకళనున్నాడో భద్రాచారి అద్దె విషయం రొక్కించలేదు. ఈ సమయం కనిపెట్టి ఇంక్రిమెంటు విషయం ఎత్తాడు సుబ్బారావు. వినిపించుకోనట్టే భద్రాచారి నటించడంతో ఇక మళ్ళీ ఆ ప్రస్తావన తీసుకురాలేదు సుబ్బారావు.

ఆ నెల జీతం తీసుకుని ఇంటికి ఒచ్చేశాడు సుబ్బారావు. తెచ్చిన జీతం మర్నాటికల్లా చిల్లి దమ్మిడీ మిగలలేదు. ఊరంతా అప్పులు తల మునిగిపోయేట్టుగా ఉన్నాయి. లేకుంటే ఎలా గడుస్తుంది? పదిహేను రూపాయలు అద్దెకిందే పోతుంటే తక్కిన ముప్పై అయిదు రూపాయల్తో సంసారం గడవాలంటే మాటలా? ఇంతవరకూ అప్పులు చెయ్యడమే కాని తిరిగి దమ్మిడీ తీర్చలేక పోతున్నాడు. నడిబజార్ని తిరగటానికే సిగ్గుపడుతున్నాడు. ఊపిరి సలపని పనితో దైహికంగా కూడా బాధపట్టం జరుగుతోంది. తప్పటంలేదు. అప్పుడప్పుడు వంటవాడు సానుభూతి చూపించేవాడు.

వారంనుంచీ ఆకాశం ముసురేసి ఎడతెరిపి లేని వర్షాలు కురుస్తున్నాయి. ఎక్కడికీ కదలటానికి వీల్లేకుండా ఉంటే చిరాకు వేసేది. తండ్రికి ఆరోగ్యం బాగుండక రెండు రోజులు మంచం దిగలేదు. అక్కడితో తగ్గిపోతుంది; ఏమీ కాదనుకున్న నలత మరో పదిరోజులవరకూ ఊపిరి సలపని దగ్గుతో పీల్చి పిప్పిచేసి మనిషిని ఆర్చేసింది. ఉన్నట్టుండి కాళ్ళు లాగుతున్నాయనో, కళ్ళు మండుతున్నాయనో అంటూండేవాడు. మహాలక్ష్మి కన్నీళ్ళు కార్చి లోలోపల ఏడ్చేది. ఎందుకన్నా మంచిదని రెండు రోజులు సెలవుపెట్టి ఇంట్లోనే ఉండిపోయాడు సుబ్బారావు.

అవాల్టికి ధర్మయ్య మంచానపడి పదమూడురోజులయింది. బాగా నీరసించిపోయాడు. తల్లి పెరట్లో పనిచేసుకుంటోంది. గుమ్మంవార నిలబడ్డ కొడుకును దగ్గిరకు రమ్మని సంజ్ఞ చేశాడు ధర్మయ్య. సుబ్బారావు మంచంవారగా వచ్చి నిలబడ్డాడు. లోతుకుపోయిన కళ్ళు నిలబెట్టి "నువ్వు చాలా కష్టపడుతున్నావు. బాబూ! నేనేం చెయ్యగల్ను" అంటూ వాపోయాడు.

తర్వాత ఏవేవిటో చెప్పాడు. వడ్రంగి సామాను పెట్టెకి వెనకతట్టు చెదలు పడుతున్నాయి అన్నాడు. కొడుక్కు పెళ్లిచేస్తే చూసే అదృష్టం తన కుంటుందో లేదో అని కళ్ళనీళ్లు కార్చాడు. కొడుకు పడుతున్న కష్టాలు తల్చుకుని నెత్తి మొత్తుకున్నాడు. రత్నాన్ని గురించి చెప్పుకొచ్చి వాళ్లంతా అదృష్టవంతులు అన్నాడు. ఈ మాటలు వింటుంటే కడుపులో దుఃఖం ఆపుకోలేకపోయాడు సుబ్బారావు. గబగబా గదిలోకి వెళ్ళిపోయాడు. పరుపుమీద పడుకుని వెక్కి వెక్కి ఏడ్చాడు.

ఏ చింతా లేకుండా జీవించవల్సిన వయసులో కూడా తన్ను గురించి బాధపడాల్సి ఒచ్చింది తండ్రికి. తను కష్టపడుతున్నాడు. తన్నుగురించి తండ్రి బాధపడుతున్నాడు. ఎవరికీ సుఖంలేని జీవితం. ఈ తలపుతో హృదయం కృంగిపోయింది. ఏ అభిమానమయితే కులవృత్తిని నేర్చుకుందుకు అడ్డుపడిందో ఆ అభిమానం ఇప్పుడేమైంది? భద్రాచారి చెప్పుకింద తేలులా ఉంటేనే రోజులు ఈమాదిరిగా అన్నా గడుస్తాయి. స్వేచ్ఛ లేదు; స్వతంత్రం లేదు. తన్ను గురించి ఆలోచించుకుంటే తనకే రోత పుడుతోంది. ఈ ఆలోచనలతో మనస్సు అప్రయత్నంగా రత్నం చుట్టూ అల్లుకుపోయింది. నిజంగా రత్నం ప్రయోజకుడు!... స్వేచ్ఛాజీవి!... తను?

సంక్రాంతి పూట

గొల్లపూడి
గోపాలకృష్ణమూర్తి

జానకమ్మ: ఏమండోయి! మిమ్మల్నే... ఇంకా నిద్రలేచారా లేదా! ఇంత పొద్దెక్కినా లేవనేలేదమ్మా. ఏంనిద్రో, ఏమో!

రామమోహనరావు:................

జా: (లోపలికొచ్చి) అబ్బ! తెల్లవారిందో లేదో. వెలిగించారూ ఈ వెధవ సిగరెట్టు. వీటితోనే ఈ ఇల్లు పొగమూరి పోతున్నది.

రా:.........

జా: ఏమిటండీ! పలంకా తెగ ఆలోచిస్తున్నారు.

రా: ఆ! ఏమీలేదు. నిద్ర లేవక పోతే చాలా పొద్దెక్కిందంటివి, సిగరెట్టు వెలిగిస్తే తెల్లవారిందో లేదో అంటుంటివి. ఈ రెంటిలో ఏది రైటా అని.

జా: ఈ సిగరెట్లు తాగటం ఈ వెర్రి ఆలోచనలు చేయటాని కన్నమాట. ధూమపాన నిషేధం ఒకటిపెడ్తే మనలాటివాళ్ళు ఎంత బాగుపడేవారు.

రా: నీదీ ఒక వెర్రిఆలోచనే. అప్పుడు కానీ సిగరెట్టు పావలాకి కొని చాటుగా తాగుతాము. తెల్సా.

జా: ఈ వ్యర్థప్రసంగా లెందుకు కానీ, త్వరగా లేవండీ. చాలా పనులున్నాయి.

రా: ఏమిటీ?

జా: ఏమిటంటా రేమిటండీ? నిన్న చెప్పినవన్నీ మరిచిపోయినట్టున్నారే! ఇవాళ భోగిపండుగయితే!

రా: మరిచిపోతేనేం. జ్ఞాపకం చేయటానికి నీవున్నావుగా!

జా: సరే. బాగానేఉంది వరస.

రా: బాగా ఉండక ఏమయిందిప్పుడు.

జా: ఏమయిందంటా రేమిటండీ ఇంకా. అవవలసింది ముందుంటే.

రా: ఉంటే ఉండనీ. ఏం ముంచుకొచ్చింది.

జా: అదేమిటండీ సంక్రాంతినాడు అట్లా అంటారు. పిల్ల పేరంటానికి పిలవటానికి పోతూ ఒకటే ఇదిగా చెప్పిపోతే.

రా: పేరంటం పిలవటానికీ నాకూ లంకే ఏమిటే? నే నెప్పుడన్నా పిలిచాను గనుకనా? దాన్నే పిలవమనక పోయావూ.

జా: ఆలూ లేదు; చూలూ లేదన్నట్లుంది. ఏమని పిలిచేదండి. భోగిపళ్ళు పోసుకోటానికి శనగలు తెమ్మంటే లేదు. శనగలు లేకుండా ఏం పేరంటానికి పిలవమంటారండీ?

రా: తప్పంతా నాదేనంటావు. నా సంగతి నీకేం తెలుస్తుంది. శనగలకోసం నిన్న బజారంతా తిరిగీ తిరిగీ కాళ్ళరిగినై. ఏ కొట్లో దొరక్కపోతే నన్నేం చేయమంటావు?

జా: ఎందుకు దొరకవండీ? కాస్త ధర ఎక్కువ ఇస్తానంటే కొండమీద కోతయినా దొరుకుతుంది.

రా: ధర ఎక్కువ ఇచ్చి బ్లాక్‌లో కొంటం నాకు ఇష్టంలేదు.

జా: బ్లాక్‌మార్కెటంటే ఇష్టంలేదంటా రేమిటండీ. మీ మాట మీరే మరిచిపోతే ఎట్లా. ఇందాక సిగరెట్లు ఎట్లా కొంటానన్నారు?

రా: నీవు ఇట్లా అంటుంటే నేనేం చెప్పేది.

జా: మీరు ఏమీ చెప్పక్కరలేదు. చెప్పింది చేస్తే చాలు.

రా: నన్నెందుకు అవస్థ పెడతావు గానీ, ఆ ఏర్పాటులేవో నీవే చేయరాదూ. కావాల్సినంత డబ్బు తీసుకో, నేనేమన్నా.

జా: నేను చేయగల్గితే మిమ్మల్ని అడగటం దేనికీ? మొన్నటినుంచి కొట్టుకుంటున్నా ఇంతవరకూ గతీమోక్షం లేదు. ఇట్లా అయితే ఈ కాపురం నే చేయలేను బాబూ.

రా: చదువుకున్నదానివే అట్లా అంటే ఎట్లా.

జా: ఏం చెప్తారండీ? నేను చదువు రాసిదాన్నని. అంతకాడికి నన్నెందుకు చేసుకున్నారు. నాకు బజారుకు పోయే యోగ్యతే ఉంటే మీ యింటి కెందుకు వస్తాను. మా యింటికే ఒకదాన్ని తెచ్చుకొనేదాన్నిగా.

రా: చదువుకున్నవాడిని నన్నే ఇంత వేళాకోళం చేస్తున్నావు. చదువుకోనివాడ్నయితే...?

జా: ఈ వేళాకోళాలకేం గానీయండి. ఇప్పుడయినా బయలేరుతారా లేదా? మీరు శనగలు ఎప్పుడు తెచ్చేటట్లు, అవి ఎప్పుడు నానేటట్లు.

రా: ఒక ఆడపిల్ల ఉంటేనే ఈ శనగల కింత రభస చేస్తున్నావే, ఇద్దరు ముగ్గురుంటే ఇంకెట్లా ఉండేదో.

జా: (నవ్వి) బాగానే ఉంది. పిల్లలు ఎంతమందయినా శనగల ఖర్చు ఒకటేగా!

రా: అంతేనా! అయితే నీవు ఇంకొక ఆడపిల్లను కనరాదూ.

జా: (సిగ్గుతో) చోద్యమా అని. ఆ రోజులూ వస్తున్నవి లెండి. త్వరపడబోకండి.

రా: శనగల ఖర్చు ఎక్కువయితే అయింది గాని, నీవు మాత్రం అంత పనీ చేయవాకు. ఇంతకూ అమ్మాయి ఏదీ?

జా: మీరు ఇప్పుడు లేస్తుంటిరి. అది అప్పుడే తలంటిపోసుకొని పేరంటం పిలవటానికి పోయింది.

రా: మరి శనగలు లేకుండా ఎట్లా పిలుస్తున్నారు.

జా: మీరు తేక పోతారా అనే ధీమాతో...

రా: ఒకవేళ మరి నేను తేననుకో.

★ సంక్రాంతి పూట ★

జా : మా నాన్న మొన్ననే పంపుతా నన్నాడు. నేనే వద్దన్నా అవి తెప్పి స్తాను. అసలు మీరు తేగల్గుతారని ఎవరను కొన్నారు.

రా . అరె! నేనేం తేలేననుకొన్నావా. మంచివి లేవని ఊరుకున్నా గానీ. చూస్తూ వుండు ఇంకొక పావుగంటలో పావుమూట శనగలు నీముందర వాలకపోతే నన్నడుగు.

జా : సరేలెండి.

రా : సరే ఏమిటి?

జా : పావుగంట తరువాత నే, తేలే దేమని అడుగుతానండి అదేగా మీరు చేయమన్నది.

రా : ఇప్పుడు చూస్తావుగా నాతడాఖా.

జా : ఇన్నాళ్ళనుంచి ఏమయిందో ఆ ప్రజ్ఞ!

రా : అది వేరేసంగతి. (బయలుదేర బోవును...)

జా . ఎక్కడికండీ పోతున్నారు?

రా . ఎక్కడికేమిటి. శెనగలు తేవటానికి.

జా : అదేమిచోద్యమండీ ముఖం కడు క్కోలేదు, కాఫీ అయినా తాగలేదు.

రా : అంతా వచ్చినతరువాత చేస్తాలే.

జా : ఏడ్చినట్లే ఉంది ఇంత మతి మరుపయితే ఎట్లాగండి ఒజారుకుపోయే వాళ్లు ఒక సంచీగానీ, కనీసం డబ్బులయినా తీసుకుపోనక్కరలేదా !

రా : డబ్బులు తీసుకోనిపోతే మనగొప్పే ముంది.

జా : మనముఖం చూచి ఊరికనే ఎవ డిస్తాడండి! ఈ గొప్పదనం ఆ జరీచీర తెమ్మన్ననాడు ఏమయిందండీ?

రా : మళ్ళీ మొదలు పెట్టావూ.

జా . సరే. పోయిరండి తెచ్చింతరు వాతేచూద్దాం.

రా : అంత అనుమానంగాఉందేం? నేను తేలేకపోతే నన్ను మారుపేర్న పిలు. సరేనా?

జా . ఇప్పుడు పేరుపెట్టి మిమ్మల్ని పిలు స్తున్నట్లు.

రా : అయితే నేను తేలేకపోతే నున్నగా గుండుచేయిస్తా. సరేనా.

జా . మీ ఇష్టప్రకారమే చేయండి. త్వరగా వస్తారుగదూ.

(ఆయన పోంగానే తలుపు వేస్తుంది.)

(కాసేపయినతరువాత)

లక్ష్మి : అమ్మా! తలుపే.

జా : (తలుపుతీసి) అప్పుడే అందర్నీ పిలిచొచ్చావుటే. వాళ్ళ ప్రసన్నవాళ్ళని పిలిచావూ క్రిందటిమారు మరిచిపోయి తరు వాత పిలిస్తే నానాగోల చేశారు.

ల : అబ్బ! ఊరుకోవే అందర్నీ పిలిచా గానీ నాన్నేడీ?

జా : శెనగలు తెస్తానని బజారు కెళ్ళా రమ్మా. పది కావచ్చింది అన్నం తింటా వుటే. నైవేద్యం పెట్టి పెట్టాను.

ల . తొందరేమిటే. నాన్ననిరానీ

సుబ్బయ్య : (బయటనుంచి లోపలకు వస్తూ) ఎవరండీఇంట్లో. పంతులుగారూ... (అని మూట పడేస్తాడు)

జా : బజారు కెళ్ళారయ్యా పావుగంట క్రిందట.

సు : బజారుకెళ్ళారా! అప్పుడే! నే ననుకుంటునేఉన్నా, వెళ్ళే ఉంటారని.

జా : వారు బజారు కెళ్ళారని నీవను కోవట మేమిటయ్యా? వెళ్ళేదాకా వారికే తెలియదే!

సు : ఎందుకు తెలియదమ్మా బాగానే తెలుసు. నే నేగా తొమ్మిదిగంటలకు రమ్మంది. తప్పకుండా వస్తానన్నారు

ల: (నవ్వుతూ) నీతో మా నాన్నకి రాచ కార్యం లేమిటయ్యా.

సు: అదేనమ్మ శెనగలు తెప్పించమని పదిరూపాయిలిచ్చారు. మా దుకాణంలో ఉన్నాయి. తెప్పించి పెట్టానన్నాను కానీ ఇవాళ పండగకి కొట్టుమూసి నేను ఊరికి పోతున్నా అందుకని శెనగలు లేకపోతే అయ్యగార్కి కోపమొస్తుందని నేరుగా నేనే తెచ్చా ఒక అయిగు నిమిషాలు ముందొచ్చినట్లయితే అయ్యగారికి శ్రమ తగ్గేది...

జా: అదా సంగతి అందుకనేనా అంత ధీమాగా బజారు కెళ్ళింది.

ల: చూచావా! నాన్న ఎంత మంచి వాడో. అన్ని ఏర్పాట్లూ చేశాడు మరి నువ్వేమో ఆయన్నెప్పుడూ ఆడిపోస్తావు.

జా అవునులేవే. అంతా నాలిముచ్చు రకం. ఈ సంగతి నాతో ముందుగా చెపితే ఏమయిందో! కాఫీఅయినా తాగకుండా పోయారు.

ల: నీవు ఉలుకుతుంటే నాన్నకి సర్దా. అందుకని...

సు: సుబ్బయ్య శెనగలుఇచ్చి వెళ్ళాడని చెప్పండమ్మా, అయ్యగారొచ్చింతరువాత. బస్తా నాదేగానీ తరువాత తీసుకుపోతా లెండమ్మ.

జా: సరలే.. ఇదుగో సుబ్బయ్యా, నీవు మంచివాడివిగానీ అయ్యగార్కి తలంటి పొయ్యాలి మంగలి బాలయ్యని ఒకమాటు రమ్మని చెపుతావూ?

సు: సరేలెండి. కేలవిప్పిస్తారా.

జా: పోయి రా. (సు పోవును)


ఒసేయి లక్ష్మి చిన్న తమాషా చేద్దాం. మీ నాన్నగారితో ఈ సంగతి చెప్పవాకే

ల : ఏమోనమ్మా. చెప్పకుండా నే నుండలేను

జా . కాసేపు చెప్పకుండా ఉన్నా వంటే నీవు కావాలన్న సిల్కులంగా కుట్టించిపెట్టానే. సరేనా.

ల: సరే లేవే.

[చాలా సేపటికి రామమోహనరావు కాళ్ళీడ్చుకుంటూ వస్తాడు...]



హౌరా బ్రిడ్జి

ఫొటో: వి. యల్. యన్. చారియర్, (కలకత్తా)

జా: ఏమిటండీ తెగ ఆలోచిస్తూ వచ్చారు శనగలేవీ?

ల: శనగలు వ......

జా: నీ వూరుకోవే. పిలిచినా పలకరేమండి. పావుగంటలో పావు మూట తెస్తానని బిక్కముఖం వేసుకొచ్చారేం. ఈ మాత్రం దానికి ఇంత ఆలస్యం దేనికండీ?

రా: (కోపంగా) ఎంత ఆలస్యం అయితే నీకేం? నోరుమూసుకొని కూర్చోక.

జా: మీ రొచ్చేదాకా నోరుమూసుకొనే కూర్చున్నాగా.

రా: కూర్చుంటే కూర్చున్నావుగాని నన్ను విసిగించవాకు.

ల: అన్నీ ఉత్తదే నాన్నా.

జా: నీ వూరుకోవే పానకంలో పుడకలాగా. శనగలమూట తెస్తానని కోపం మూటగట్టుకొచ్చారేమండీ

రా: మొదలుపెట్టావూ నీ నసుగుడు. కాసేపు ఆగు చెపుతా.

జా: మీరు చెపే[illegible] మీ ముఖం చూస్తేనే తెలుస్తున్నదిలేండి.

రా. అటువంటిదానివి నన్ను అడగటం దేనికీ.

జా: ఎట్లా చెపుతారో చూద్దామని.

ల. అమ్మా! బాలయ్య వచ్చాడే.

జా. అయిందేదో అయింది లేవండి మంగలి వచ్చాడు.

రా: మంగల్నెవరు పిల్చారు. నేను కబురు చెయ్యలేదే!

జా. నేనే మీకోసం పిల్పించా తేలేకపోతే గుండు చేయిస్తానన్నారుగా

రా ఏమిటే? (బిత్తరపోతాడు)

జా మీకేం మాటపట్టింపుకోసం ఎంత పనయినా చేస్తారు మీరు గుండుచేయిస్తే మాటవచ్చేది నాకు త్వరగా లేవండి ఇవాళ భోగి. తలంటిపోసుకోపోతే ఎట్లా. మేమందరం పోసుకున్నాం

రా. నాకు తలంటి పుట్టం లేదు

జా అయితే వాడిని పొమ్మని స్నానం చేసిరాండి పిల్లకూడా మీకోసం అన్నం తినకుండా కనిపెట్టుకూర్చుంది.

రా. నాకు ఆకలిగా లేదు. మీరు భోంచేయండి

జా ఏవైన్నం తిన్నమ్మ మొగుడాకలి ఎరగదుట. ఇంట్లో పెళ్ళాం బిడ్డలున్నారని కూడా అనకోకుండా హోటలులో ఇంత మెక్కితే సరా

రా: నేను ఇవాళ కాఫీకూడా తాగలేదు

జా. పోనీయండి వెధవ శనగలు అవి లేకపోయినా ఏదోవిధంగా ఈ భోగి వెళ్ళబుచ్చుదాం లేగాని మీరు స్నానం చేయండి. అమ్మాయి! నాన్నగారికి నీళ్లు తోడవే.

నేను పీటలు, కంచాలు పెట్టి వడ్డించేలోగా స్నానం పూర్తవుతుంది.

ల: సరే లేవే (అని పోతుంది, రా. స్నానానికి పోతాడు.)

రా: (దొడ్లో స్నానం చేయబోతూ.) అమ్మాయి. నీళ్ళబిందె బదులు శనగలబిందె పెట్టేవేమే. అసలు ఈ శనగలు ఎక్కడివి?

ల: నీవు పంపినవే నాన్నా.

రా: నేనా! నేనేం పంపలేదే. ఆ సుబ్బయ్య మోసపుచ్చాడే.

ల: కాదు; పంపేవు నాన్నా. నీకు తెలియకుండా.

రా: నాకు తెలియకుండా నేను పంపటమేమిటే?

జా: (ప్రవేశించి) ఔనండి సుబ్బయ్య చేత మీరు పంపినవేనండీ.

రా: దొంగవెధవ మోసం చేశాడు. నిలువునా నమ్మించి మోసం చేశాడు

జా. కాదండి వాడు చాలా మంచివాడు.

రా: కాదంటారేమే! మీకేమన్నా మతులున్నాయా లేవా. అంత దగాకోరు ఇంకొకరు లేరని చుట్టుపక్కలవాళ్ళంతా చెప్తే కొట్టు కట్టేసి ఊరికిపోయాడని ఇంట్లో వాళ్ళుకూడా చెప్తే; అటువంటివాడికి పది రూపాయలుకూడా ఇచ్చా, నమ్మి ..

ల: కాదు నాన్నా. నీవు ఇటు పోంగానే అతను అటునించివచ్చి శనగలు ఇచ్చి వెళ్లాడు ఏదో ఊరికికూడా వెళుతున్నాట్ట. నీతో చెప్పమన్నాడుకూడా

రా. ఇంతసేపు నన్ను బాధించకపోతే, ఆ సంగతి నేను రాగానే ఎందుకు చెప్పలేదే?

"బ్రదర్! పుస్తకాలు కొనాలంటే డబ్బులేదు. చదవాలని కోరికుంది. మా నాన్న నాకు 'అక్షరాభ్యాసం' చెయ్యకుండా వుంటే బాగుండేది.

"అవునురా బ్రదర్! నాకు అన్నముకూడా లేదు, మా నాన్న నాకు 'అన్నప్రాశన' చేయకుండావుంటే బాగుండేది

—కె కోటి, గుంటూరు.

జా. మీరు చేయబోయినది మాకు చెప్పారూ, మేం చేయపోయేది, మీకు చెప్పటానికి.

రా. నీవయినా చెప్పలేదేమే లక్ష్మీ?


ల: అమ్మ చెప్పవద్దంది నాన్నా

జా. అదయినా ఊరికే చెప్పనందా. లంచం ఇస్తేగాని ఒప్పుకోలా. దానికి సిల్కులంగా కావాలిట ముందు అది కొనండి. సుబ్బయ్య మోసం చేశాడనుకొన్న పదిరూపాయిలు గిట్టుబాటయినవిగా.

రా ఒసేవ్ ఇదొక శిక్షా మళ్ళీ.


జా. శిక్ష కాకపోతే అమ్మాయి, మీకు భోగిపళ్ళు పోసినందుకు దానికి ఇచ్చిన బహుమతి అనుకోండి ..

రా. సరేలే మీరందరూ తల్చుకుంటే తప్పుతుందా. త్వరగా వడ్డించు ఆకలి దహించుకుపోతోంది ★



హౌరా బ్రిడ్జి

ఫోటో: వి. యల్. యన్. చారియర్ (కలకత్తా.)



26

పెంపుడు కొడుకు జిప్సీ యువతిని ఉరితాడునుంచి రక్షించిన సమయంలో పెంపుడు తండ్రి అయిన క్లాడ్ ఫ్రాలో నాటర్ డామ్ చర్చి పరిసరాలలో లేడు. జిప్సీ యువతిని ఆఖరు సారి అడిగి నిరాశచెంది లోమందిరంలోకి వెళ్లిపోయాడు. తన గది ప్రవేశించి టోపీ, పై అంగరఖా, విసిరివేశాడు. వెనుకద్వారం గుండా చర్చినుండి బైటపడ్డాడు. సీన్‌నదిలో ఒక బోటు పిలిచి అవలిఒడ్డుకి చేరాడు. యూనివర్సిటీ వీధులగుండా చరచర నడిచాడు. దారిలో గుంపులు గుంపులుగా పోతున్న జనం కనపడ్డారు. జిప్సీ యువతిని ఉరితీస్తుంటే సంబరం చూడాలని వారు వెడుతున్నారు. క్లాడ్ ఫ్రాలో మరింత వేగంగా నడిచాడు. అతని ముఖం తెల్లగా పాలిపోయివుంది. ముఖాన వార్థక్యరేఖలు మరింత గుంపుజేరినట్లున్నాయి. జుట్టురేగి కనుగ్రుడ్లు వెళ్ళబెట్టుకుని పిచ్చివానివలె ఉన్నాడు. అతని హృదయం ఛిద్రమయింది. అంధునివలె దారీతెన్నూ కానక వడివడిగా నడిచిపోతున్నాడు. నడుస్తున్నాడో పరుగిడుతున్నాడో చెప్పడం కష్టం. గ్రీవ్ చౌకుకు దూరంగా, అతి వీలైనంతదూరం పారిపోవాలని దొరికిన దారిని బడి పోతున్నాడు. క్రమంగా గుట్టలు, కొండలు దగ్గరైనాయి. ఒకచోట నిలిచి వెనక్కు చూశాడు. పారిస్‌కొండల మాటున ఛడిపోయింది. అక్కడాగి ఒక్కసారి ఊపిరి పీల్చుకున్నాడు.

అప్పుడతనికి ఒక్కపెట్టున అనేక యోచనలు ముసురుకు వచ్చాయి. అంతరంగాన్ని ఒకసారి పరిశీలించుకొని గజగజ వణికిపోయాడు. తనను సర్వనాశనం చేసిన యువతిని తలపుకు తెచ్చుకున్నాడు. తానామెకు సర్వనాశనం తెచ్చిపెట్టాడు. ఇద్దరి ప్రారబ్ధమూ ఏ వంకరదారులవెంట ఇద్దరినీ నడిపించిందో నెమరువేసుకున్నాడు. తన మతం, తన దీక్ష, తన సంయమనం అన్నీ ఒక్కక్షణంలో కర్పూరంవలె హరించిపోవడం తెలుసుకున్నాడు. ఇంత సర్వనాశనమైన తరువాత ఇంక చెడుగేది అనే యోచనతో అతిక్షుద్ర విషయాలను మనసులో రూపొందించుకోనారంభించాడు. లోలోన నిగ్రహించబడిన నీచోద్రేకాలు వెల్లుబికి అతణ్ణి లోబరుచుకున్నాయి. అసూయాద్వేషాలు తలమున్కలై పొంగాయి. దీనికంతటికీ విఫలప్రేమయే హేతువని అతడెరుగును. మానవుని గుణశీలాలకు, అభ్యున్నతికి మూలహేతువైన ప్రేమయే నిస్సంగి కావలసిన మతాచార్యునికి పతనహేతువౌతుంది. క్లాడ్ ఫ్రాలో భయంకరంగా నవ్వాడు. అంతలోనే అతని వికటాట్టహాసం ఆగిపోయింది. ముఖం మరింత పాలిపోయింది. దురితమైన అతడి అనురాగం అతణ్ణి నరకానికి, ఆమెను ఉరికంబానికి పాలుచేసింది.

ఫీబస్ చచ్చిపోలేదని అతడికి గుర్తు వచ్చింది. జిప్సీ యువతి కాక మరొక ప్రియురాలతనికుంది. తరువాత తన వివేకాన్ని, హృదయాన్ని హరించి పిచ్చివానిగా చేసిన సుందరి పారిస్ నగరవాసులందరి సమక్షంలో అవమానింపబడుతున్నదని జ్ఞప్తికివచ్చింది. మల్లెపువ్వువంటి సుందరి ఉచ్చులోపడి నలిగిపోతున్న దృశ్యం అతని కళ్లకు కట్టినట్లయింది. తన నిస్సహాయత, భంగపాటు, నిస్సత్తువ మరింత అనుభవమైనాయి.

ఫీబస్ అనేవాడు లేకపోతే, తాను మతాచార్యుడే కాకపోతే, ఆ సుందరిని పొంది అనుభవించగల ఆనందం ఊహించుకొన్నాడు. తన ప్రస్తుత స్థితికి చింతించాడు. ఉన్మత్తునివలె జుట్టు పీక్కోవడం మొదలుపెట్టాడు. ఉన్నట్టుండి మొట్టమొదటిసారి ఆ సుందరిని చూసిన దృశ్యం మనోగోచరమయేది. తరువాత ఆమె ఉచ్చులో విగతజీవియై తామరతూడువలె వ్రేలాడుతున్నట్లు పొడగట్టేది.

ఈ రీతిగా వేయి తలపులతో ఉన్మత్తుడై తిరిగి పరుగెత్త

మూలం :
విక్టర్ హ్యూగో

అనువాదం :
సూరంపూడి సీతారామ్

నారంభించాడు. ప్రకృతికి, జీవితానికి, మనుష్యులకు, భగవంతునికి దూరమై పారిపోవాలని పరుగెత్తాడు.

సాయంకాలమయింది. అతనిలో పెనుతుపాను భీభత్సమై చెలరేగింది. చివరికి హతబుద్ధియైన అతనికి రెండే రెండు చిత్రాలు —జిప్సీ సుందరి నృత్యం, ఉరికంబంలో సుందరి—ఇవే మనోగోచరమాతున్నాయి. అయితే ఇంత దుర్భర వేదనలో ఆత్మహత్య చేసుకోవాలనే తలపు అతనికి కలగలేదు. అతనికి జీవితంపై మక్కువ అధికం. మరణానంతరం నరకం తనకోసం సిద్ధంగా ఉంటుందని అతనికి తెలుసు.

చీకటి పడింది. పారిస్ నగరానికి అతిదూరంలో ఉన్నట్లు భావించాడు. కాని ఒకసారి జాగ్రత్తగా పరిసరాలను గమనించగా యూనివర్సిటీ ప్రాంతంలోనే ఇంతవరకూ తిరుగాడినట్లు తెలిసివచ్చింది. దగ్గరలోనే పరిచయమైన గోపురాలు కనిపించాయి.

వెనక్కు తిరిగి నగరాభిముఖమై నడిచాడు. నగరవీథుల వెంబడి నడుస్తూ ఎరిగినవారి కంటబడకుండా తల వంచుకుని నడిచాడు. ఒక బోటులో సీన్ నది దాటాడు. జలప్రవాహధ్వని వినేసరికి అతని మనస్సు కొంత కలకదేరినట్లయింది. బోటు దిగి పరిచయ మార్గంవెంట నడిచాడు. బుద్ధి భ్రమించిన అతని కళ్ళకు చీకటిలో ఆ భవనాలు, గోపురాలు, మధ్య మధ్య కిటికీలలోని దీపాలవెలుగులు అన్నీ నరకలోక దృశ్యాలవలె కనపడుతున్నాయి. మధ్యమధ్య చిన్న చిన్న యిళ్ళలోనుంచి, భవనాలలోనుంచి ఆక్రందన ధ్వనులు, హర్షోల్లాస ప్రలాపాలు వినవస్తున్నాయి చెవులు మూసుకుని పరుగెత్త నారంభించాడు. వంతెనవద్దకు వచ్చేసరికి అతడికి వృద్ధురాలి గృహం గుర్తుకువచ్చింది. అక్కడే ఎమరాల్డా ఫీబస్‌ను కలుసుకున్నది. అక్కడే ఫీబస్‌ని అతడు కత్తితో పొడిచినది. ఇల్లు సమీపించి తలుపుల సందులోనుంచి తొంగిచూశాడు. చూసి నిర్ఘాంతపోయాడు. అతని తమ్ముడు జెహాన్ ఒక యువతి ప్రక్క కూర్చుని సరసమాడుతున్నాడు. గ్లాసెత్తి మద్యం తాగాడు. తరువాత జేబులు తడుముకున్నాడు. ఖాళీజేబు చూసుకుని విసుగుచెందాడు. "ఇంక నాదగ్గిర డబ్బు లేదు. మళ్ళీ అన్న దగ్గరకు పోవాలి. అన్న అదృష్టవంతుడు. జేబులో నిత్యం డబ్బు ఉంటుంది" అంటూ లేచాడు. క్లాడ్ తొందరగా రెండడుగులు వేసి బాటప్రక్కగా బోరగిల పడుకున్నాడు. జెహాన్ తలుపులు తెరుచుకు వచ్చాడు. బాటప్రక్క పడినట్లున్న మనిషి ఆకారం గమనించి సమీపించాడు. క్లాడ్ కదలలేదు; శ్వాసైనా విడువలేదు. జెహాన్ కాలితో అన్నతలను ఒక్క తాపు తన్నాడు. క్లాడ్ కదలలేదు. "తెగ తాగాడు ఎవడో. ఒంటిమీద స్పృహలేదు. అదృష్టవంతుడు" అనుకుంటూ జెహాన్ తనదారిని తూలుతూ వెళ్లిపోయాడు.

తమ్ముడు కనుచూపుమేర దాటగానే క్లాడ్ గ్రహాలో లేచి నాటర్ డామ్ చర్చివైపుకు శక్తికొద్దీ పరుగెత్తాడు చౌకు మొగలో ఆగాడు. కాని ఉరిస్తంభంవంక కన్నెత్తిచూసే ధైర్యం లేకపోయింది

"ఇవాళ—ఈ ఉదయమే ఇక్కడ అటువంటిఘోరం జరిగి ఉంటుందా!" అని విభ్రాంతి చెందాడు.

మెల్లిగా తలెత్తి చర్చివంక చూశాడు. గుడ్డివెన్నెలలో చర్చి ప్రశాంతంగా కనపడింది. గోపుర శిఖరంపై చంద్రవంక కనపడింది. చర్చి ద్వారాలన్నీ బంధింపబడి ఉన్నాయి గోపుర ద్వారపు తాళపుచెవి నిత్యం అతనివద్దనే ఉంటుంది. ఆ ద్వారం తెరుచుకుని వెనుకగా తలుపుమూసి లోనికి ప్రవేశించాడు. ప్రవేశించి చుట్టూ కలయచూశాడు. చుట్టూ శిల్పాకృతులు ప్రాణం పోసుకుని తన విన్నబాటును గమనించినవని భ్రమించాడు. మందిరమంతా చైతన్యవంతమై తనవంక పరీక్షగా చూస్తున్నట్లు ఊహించాడు. వికృతాకారులు తన్ను తేరి చూస్తున్నట్లు భావించి, అపరిమితమైన భీతితో గోపురం సోపానాలవంకకు పరుగుతీశాడు. మతి భ్రమించిన అతని దృష్టిలో భ్రమకీ యదార్థానికీ మధ్య వ్యత్యాసం నశించింది కన్నులకు కనపడినది భ్రమ అనీ, భ్రమించినది వాస్తవమనీ పొరపడి నిజానిజాలు తెలియలేని స్థితిలో పడ్డాడు: మిద్దెఎక్కి చూసేసరికి గోపురంలో వెలుగు కనపడింది. పవిత్ర గ్రంథంవద్ద నిత్యం వెలిగే దీపమది. పరుగెత్తి అక్కడకు వెళ్లి ఆగాడు. తెరిచిఉన్న బైబిల్ గ్రంథంవంక చూశాడు. అందులో ఒక వాక్యం అతనికంట పడింది "నా కన్నులయెదుట ఒక ఆకారం గాలిలో తేలి వెళుతోంది. అప్పుడు భీతివల్ల నా తలపై జుట్టు మొనలపై నిలబడింది."

చదవగానే క్లాడ్ భీతితో కన్నులు మూసుకున్నాడు. కాళ్లు వణికాయి. సత్తువ వీగిపోయింది. నేలపై కూలబడిపోయాడు.

అలా అత నెంతసేపున్నాడో అతనికే తెలియదు. కొంతసేపటికి లేచి నిలబడ్డాడు. విశ్వాసపాత్రుడైన తన పెంపుడు కొడుకు సమీపంలో ఆశ్రయం తీసుకోవాలనుకున్నాడు. పాపమనియైనా తలచక బైబిల్‌వద్ద వెలుగుతున్న దీపం చేతిలోకి తీసుకున్నాడు. తడబడుతున్న అడుగులతో తిరిగి మెట్లెక్కాడు. శిఖరం సమీపించే సమయానికి అతని ముఖంపై చల్లనిగాలి సోకింది. గోపురంలో చిట్టచివరి అంతస్థు గదిదగ్గరకు చేరాడు. ఆకాశం చాలవరకు మేఘావృతమైఉంది. చంద్రవంక మధ్యమధ్య కనపడుతూ మబ్బులచాటున దాగుతోంది. ఒకసారి నగరంవంక చూశాడు టవర్ గడియారం పన్నెండుగంటలు కొట్టింది. అర్ధరాత్రయింది. మధ్యాహ్నం పన్నెండుగంటల సంగతి అతనికి జ్ఞప్తికి వచ్చింది. "ఇప్పటి కామె శవం మిగిలిఉంటుంది" అనుకున్నాడు.

ఒక గాలితెరవచ్చి అతని చేతిలోని దీపం ఆర్పివేసింది. అదే క్షణంలో గదిముందు ఒక స్త్రీ ఆకారం అతని కళ్ళబడింది. క్లాడ్ గజగజ వణికిపోయాడు: ఆ స్త్రీ ప్రక్క మేక ఆకారం కనపడింది. ఆమెనుచూసి చేష్టలు దక్కి నిలబడిపోయాడు. యువతి ముఖం పాలిపోయింది. ఆమె ముఖంలో విషాదం గూడుకట్టుకుంది. ఆమె శిరోజాలు భుజాలపై విస్తరించాయి. ఆమె మెడకు ఉరితాడు మాత్రం లేదు. చేతులు బంధించబడలేదు. ఆమె తెల్లని దుస్తులు ధరించింది. ఆమె తలపై తెల్లనివలువ కప్పిఉంది.

ఆమె మెల్లిగా అతని వంకకు నడిచివస్తోంది. ఆమెచూపులు ఆకాశంవంక తిరిగిఉన్నాయి. క్లాడ్ పారిపోవాలనుకున్నాడు; కాని కాళ్ళాడలేదు. అతని ఒంటిలో నెత్తురు గడ్డ కట్టినట్లయింది. ఆమె అతన్ని చూడనేలేదు. ప్రక్కగా నడిచివెళ్ళిపోయింది. మేకకూడా ఆమె వెంటనే వెళ్ళింది. ఆమె పగలు చూసినప్పటికంటె పొడుగెదిగినట్లు అతనికి కనపడింది. గుడ్డివెన్నెలలో ఆమె తెల్లని దుస్తులు అతని మతిని భ్రమింపచేశాయి.

ఆమె వెళ్ళిపోగానే అతని కాళ్లు కదిలాయి. వెర్రిచూపులతో ఒక్కొక్కటే మెట్లు దిగాడు. ఆరిపోయిన దీపం చేతిలోనే ఉంది. బైబిల్‌లోని వాక్యం అతని చెవులలో ప్రతిధ్వనించింది.

27

మధ్య యుగాలలో ప్రతి పట్టణంలోనూ శరణార్థులకు ఆశ్రయమిచ్చే గృహాలుండేవి. న్యాయశాసనంప్రకారం శిక్ష పొందినవారు అక్కడికి చేరి తలదాచుకొనేవారు. ఇటువంటి ఆశ్రయాలలోనికి అధికారులు ప్రవేశించకూడదని నిషేధముండేది.

★ ఘంటారావం ★

ఒకవంక శిక్షాశాసనం అపమార్గాలలో ప్రవర్తిల్లుతుంటే, దోషులు శిక్ష తప్పించుకొనే విధానం ప్రజలలో అలవడింది. మహారాజుల భవనాలు, రాజవంశస్థుల నివాసాలు, క్రైస్తవ మందిరాలు శరణార్థులకు ఆశ్రయాలు.

ఈ ఆశ్రయాలలో చేరిన శరణార్థులను అధికారులు తాకలేరు. అయితే అప్పుడప్పుడు పార్లమెంటు ప్రత్యేక శాసనం చేసి కొన్ని కొన్ని ఆశ్రయాలలో శరణుపొందిన దోషుల్ని పట్టించడం కద్దు. అయితే అటువంటిది అరుదు. ఈ ఆశ్రయాలలో తలదాచుకొన్నవారు ఆశ్రయం దాటి ఒక్క అడుగు బయటకు వస్తే చాలు పట్టుకోడానికి భటులు సిద్ధంగా ఉండేవారు. అందువల్ల శరణార్థులకు ఆ ఆశ్రయాలే బందిఖానాలయేవి. కొందరు కొందరు అలా జీవితాంతం గడిపినవారున్నారు. ప్రతి ఆశ్రయంలోనూ శరణార్థులకొక గదో కూపమో ప్రత్యేకించబడేది. నాటర్ డామ్ చర్చిలో గోపురంపైన ఒక గది అటువంటిదే ఉంది. క్వాసిమోడో ఎమరాల్డాను తీసుకువచ్చి ఆ గదిలోనే విడిచిపెట్టాడు.

అక్కడ విడిచిపెట్టిన కొంతసేపటికిగాని ఆమెకు స్పృహ రాలేదు. స్పృహ తప్పిపోయినప్పుడు ఆమె తన మెడకు ఉచ్చు తగిలి చచ్చిపోతున్నట్లు ఊహించుకుంది. ఆమెకు స్పృహరాగానే ఎదుట క్వాసిమోడో కనపడ్డాడు. బెదిరి చుట్టూ చూసింది. ఆమె చర్చిలో ఉన్నట్లు తెలుసుకుంది. అప్పుడామెకు జ్ఞప్తివచ్చింది. భటులవద్దనుంచి క్వాసిమోడో తన నెత్తుకుపోయినట్లు, ఫీబస్ బ్రతికే ఉన్నట్లు, అతడికి తనపైన ప్రేమ లేనట్లు గుర్తుకు వచ్చింది.

క్వాసిమోడో ఆమె ప్రక్కనే నిలబడ్డాడు. ఆమె అతని ముఖంవంక చూసింది.

"నన్నెందుకు రక్షించావు?" అని అతణ్ని ప్రశ్నించింది.

అతడామెవంక ఆందోళనతో చూశాడు. ఆమె చెప్తున్నదేమిటో గ్రహించడానికి ప్రయత్నించాడు. ఆమె మళ్ళీ అలాగే ప్రశ్నించింది. అతడామెవంక అతిదీనంగా చూసి తల దించుకున్నాడు. తరువాత మెల్లిగా అడుగులో అడుగు వేసుకుంటూ వెళ్లిపోయాడు. ఆమె ఆశ్చర్యపడింది

అతడు తిరిగివచ్చి ఒక బంగీ తెచ్చి ఆమె పాదాలవద్ద ఉంచాడు. ధర్మపరులెవరో ఆమెకోసం ఆ దుస్తులు చర్చిముంగిట ఉంచారు. ఎమరాల్డా ఒకసారి తనవంక చూసుకొంది. లోదుస్తులు తప్ప మర్యాదైన ఆచ్ఛాదనం తన ఒంటిపైలేదని అప్పుడు గ్రహించింది. ఆమె చెక్కులు లజ్జవల్ల ఎఱ్ఱబడినాయి. అప్పటికామె ముఖంలో తిరిగి జీవం ప్రకాశించినట్లయింది. క్వాసిమోడో ఆమె లజ్జ కనిపెట్టాడు. ఒక చేతితో తన ముఖం మూసుకుని వెనుతిరిగి వెళ్ళిపోయాడు.

ఎమరాల్డా బంగీ విప్పింది. అవి తెల్లని దుస్తులు. తల కప్పుకునే తెల్లని వలువ ఒకటుంది. గబగబ ఆమె ఆ దుస్తులు ధరించింది. ధరించినంతలోనే క్వాసిమోడో తిరిగి వచ్చాడు. ఒక చేత్తో బుట్ట ఒకటి, మరొక చేత్తో చాప పట్టుకువచ్చాడు. బుట్టలో రొట్టె, పళ్ళు, ఒక సీసా ఉన్నాయి. బుట్ట కిందపెట్టి "తిను" అన్నాడు. చాప నేలపై పరిచి "ఇక్కడ పడుకో" అన్నాడు. తన ఆహారం, తన పడక ఆమెకిచ్చాడు.

యువతి తన కృతజ్ఞత తెలపాలని తలెత్తిచూసింది. కాని అతని వికృతాకారం ఆమెకు విపరీతమైన భయం కలిగించింది. చూడలేక తలవంచుకుంది.

"ఓ!" అన్నాడు క్వాసిమోడో. "నన్ను చూస్తే మీకు భయం వేస్తోందనుకుంటాను. ఏం చెయ్యను! దేవుడల్లా చేశాడు. నావంక మీరు చూడకండి. నామాటలు వింటూఉంటే చాలు. పగటివేళ మీరిక్కడే ఉండండి. ఎక్కడికీ వెళ్ళవద్దు. రాత్రివేళ చర్చిలో అంతటా మీరు తిరగవచ్చు. అయితే రాత్రికాని పగలుకాని ఎప్పుడూ మీరు చర్చిదాటి ఒక్క అడుగుకూడా వెళ్ళకూడదు. వెడితే మిమ్మల్ని పట్టుకుంటారు. పట్టుకుని ప్రాణాలు తీసేస్తారు. మీరు చనిపోతే నేను బతకలేను."

ఈ మాటలకామె కరిగిపోయింది. జవాబివ్వాలని తలెత్తి చూసింది. అతడక్కడ లేడు; అప్పుడే వెళ్ళిపోయాడు. ఆగదిలో ఒంటరిగా ఉండి అతని మాటలను ఆమె తలుచుకోనారంభించింది. గొంతుక బొంగురైనా, అతని మాటలలోని మార్దవం ఆమెకు ఆశ్చర్యం కలిగించింది.

తరవాత కొంతసేపటికి ఆమె కదిలి గది పరిశీలించింది. గది చాలా చిన్నది. మొత్తం నేల అటూ ఇటూ ఆరడుగులుంటుంది. ఒకపక్క కిటికీవంటి చిన్న రంధ్రం ఉంది. ద్వారం తెరిస్తే ఇటుకలు పేర్చిన మిద్దెమీదికి దారి. వాన నీరు ప్రవహించే గొట్టాలు వికృత శిల్పాకారాలలోనుంచి వచ్చి ఈ మిద్దెపైకి వంగి ఉన్నాయి. రంధ్రంలోనుంచి చూస్తే శిల్పాకృతిలో క్రూర జంతువులు ఆమెవంకకే చూస్తున్నట్లు కనపడ్డాయి. మిద్దెమీద నిలబడి చూస్తే పారిస్ నగరంలోని పొగగొట్టాలలోనుంచి పైకి వచ్చే పొగలు కనడతాయి.

ఆమెకా గదిలో ఒంటరితనం ఇనుమడించినట్లు తోచింది. ఆమె తన దీనస్థితిని గురించి తలపోస్తున్న సమయంలో చేతికేదో తగిలింది. ఉలిక్కిపడి చూసింది. డాలీ! ఆమె ఆ క్షణంలో ప్రతి చిన్న విషయానికీ హడలిపోతోంది. క్వాసిమోడో ఎమరాల్డాను త్రుటిలో తప్పించి చర్చిలోకి తీసుకువచ్చినప్పుడు డాలీ దుముకుతూ వెంట వచ్చింది అంతవరకూ ఆమెకు డాలీమాటే గుర్తుకురాలేదు. "అయ్యో నా డాలీ! నిన్ను మరిచేపోయాను. నీకైనా నామీద ప్రేమపోలేదు నయం." అంటూ ఆమె మేకను ముద్దుపెట్టుకుంది. తరవాత మేకను కౌగలించుకుని తన దుస్థితి తలుచుకొని వెక్కి వెక్కి ఏడ్చింది. చెంపలు కన్నీటితో మలినమైనాయి. కొంతసేపటికి తేరుకుని చూసింది. చీకటిపడింది. గుడ్డివెన్నెలలో ఆకాశం అప్పుడామెకు మనోహరంగా కనపడింది. మెల్లిగాలేచి మిద్దెమీదకు వచ్చింది అంతటా ప్రశాంతత ఆవరించి ఉంది. అప్పటికామె సేదదేరింది

మరునాడుదయం మెలకువ వచ్చేవరకూ ఆమెకు తాను నిద్రపోయినట్లే తెలియదు. ఆమె అంత సుఖంగా నిద్రించి చాల రోజులయింది. కిటికీలోనుంచి సూర్యరశ్మివచ్చి ఆమె ముఖంపైన పడుతోంది. కాని సూర్యబింబం ప్రక్కనే క్వాసిమోడో వికృతముఖం కనపడింది ఆమె వెంటనే కళ్ళుమూసుకుంది. కాని కళ్ళుమూసుకున్నా అతనిముఖం కన్నులకు కట్టినట్లుంది. ఆమె కళ్లు తెరవలేదు. ఈ మాటలుమాత్రం వినపడ్డాయి "భయపడకండి. నేను మీ మేలుకోరే స్నేహితుణ్ని. మీరు నిద్రపోతుంటే చూడాలని వచ్చాను. మీరు కళ్లుమూసుకుని నిద్రపోతున్నప్పుడు నేను చూస్తే భయం లేదుకదా. సరే. నేను తప్పుకుంటున్నాను—ఇక్కడ గోడపక్కనే ఉన్నానిప్పుడు. ఇప్పుడు మీరు కళ్ళు తెరవండి"

ఈమారు అతనిమాటలలో మరింత మార్దవం, అనునయం వినవచ్చాయి. ఎమరాల్డాకి జాలికలిగింది. కన్నులు తెరిచిచూసింది. నిజంగానే అతడు కిటికీవద్ద లేడు. కిటికీవద్దకు వెళ్లింది. అందులోనుంచి తలదూర్చి పైకిచూసింది. గూనివాడు గోడపక్క ఒదిగొదిగి నిలబడి ఉన్నాడు. అతని ముఖంలో విషాదం, నిస్పృహా స్పష్టంగా కనపడు

తున్నాయి. ఆమె భయమూ, జుగుప్సా జయించాలని ప్రయత్నించింది. "రా ఇక్కడికి" అందామె. ఆమాటలలో దాక్షిణ్యం ఉట్టిపడుతోంది. ఆమె పెదవుల కదలిక చూసి వెళ్లిపొమ్మన్నదని భావించాడు క్వాసిమోడో. తల మరింత వొంచుకొని మెల్లి మెల్లిగా అడుగులు వేసుకుంటూ కదిలిపోయాడు. అతని కీమాటు ఆమెవంక చూసే ధైర్యంలేకపోయింది. "ఇక్కడికి. ఇలారా" అని ఆమెమళ్ళీ పిలిచింది. కాని అతడదే దిక్షుగా పోతున్నాడు. ఆమె తటాలున గది దాటివచ్చింది. అతనివద్దకు పరుగెత్తి అతని చేయి పుచ్చుకుంది. ఆ స్పర్శతో క్వాసిమోడో నిలువెల్లా చలించిపోయాడు. అతిదీనంగా ముఖమెత్తి ఆమెవంక చూశాడు. ఆమె అతన్ని చెయ్యిపట్టుకుని దగ్గరకు లాగి నిలబెట్టింది. అతని ముఖంలో శిశు సహజమైన

(43-వ పేజీ చూడండి)

మలేరియా

చలి, జ్వరము, దేహ నొప్పులతో వచ్చును.

'పాలుడ్రిన్'

మలేరియాను తరిమివేయును.



మలేరియాయొక్క ఈ లక్షణములు గమనించండి

మొదట చలిచే వణికించును. జ్వరము తగిలి చెమటలు పోయును, దేహమంతటా నొప్పులుగా యుండును. ఈ లక్షణములున్నచో వెంటనే వైద్యునివద్దకు వెళ్లండి.

ఎల్లప్పుడు భోజనానంతరము గ్లాసునీళ్లతో 'పాలుడ్రిన్' సేవించవలయును.

వయస్కులకు, 12 యేండ్లకు మించిన వారికి: ఒక మాత్ర
6 నుండి 12 యేండ్లలోగల పిల్లలకు: అర్ధమాత్ర
6 యేండ్లు మించని పిల్లలకు: పావుమాత్ర
ప్రతి దినం జ్వరం తగ్గువరకు.

ICI

ICP 177

3-2 …



విజ్ఞాన వీధులు

"డాక్టర్"



170. దేవుడంటే యేమిటి?

ఏ గ్రంథమూ చూడకుండా, ఎవరి మాటలూ ఆధారంగా గ్రహించకుండా 'దేవుడంటే ఏమిటి' అని ఆలోచిస్తే మన మనస్సుకు తట్టేదేమిటి? అని కాకినాడ నుంచి డి. వి. దుర్గాప్రసాద్ గారు అడుగుతున్నారు.

నేనొకసారి శ్రీ జిడ్డు కృష్ణమూర్తిగారి ప్రసంగము విన్నాను. ఆయన రెండు ప్రశ్నలు వేశారు. 'దేవుడంటే ఏమిటి? మృత్యువు అంటే ఏమిటి?' అని. గోష్ఠిలో తేలిన జవాబు: 'మనకు తెలియదు' అని. ఆయన మళ్ళీ అడిగేరు. 'దేవుడంటేనూ తెలియదూ, మృత్యువు అంటేనూ తెలియదూ. అయితే దేవుడంటే ఇష్టమూ మృత్యువంటే అయిష్టమూ యెందుకూ?' అని! ఈ ప్రశ్నలు రంపాలవలె మన నమ్మక ప్రపంచాన్ని కోసి పారేస్తాయి

దేవుడన్న అభిప్రాయము మానవుడు నిర్మించుకున్నదే. మబ్బు, కొండ, నది, పంట, వీటన్నిటికీ అధిష్ఠానజీవము ఏదో ఉన్నదన్న నమ్మకము క్రమక్రమంగా ఏకేశ్వరారాధనగా పరిణమించింది. చదువరికి సరస్వతి, వర్తకునికి లక్ష్మి, వేటగానికి కాళి, ఇలాగ ఎవరికి వారిదేవుడు కల్పనఅయినాడు. మానవుడే తన కోరికలకీ ఊహలకీ సరిపోయే దేవుణ్ణి నిర్మించుకున్నాడు. (బలిద్వీపపు గరుత్మంతునికి కోరలున్నాయి!) మనకి కనబడే రూపాలన్నీ మానవులు కల్పించుకున్నవే. ఆఫ్రికాలో తేలు దేవత, హిప్పొపొటోమస్ దేవతా ఉన్నారు. చేప, తాబేలు, పంది, సింహము, వ్యాఘ్రము (వ్యాఘ్రేశ్వరుడు) ఏనుగు, గ్రద్ద, కోతి, పాము, దేవతలు కాగలిగితే తేలూ, నీటి గుర్రమూ తప్పేమిటి?

ఈ దేవతలమాట నటుంచి బ్రహ్మ విష్ణు మహేశ్వరుల సంగతి ఆలోచించండి. వేద కాలానికి ఆర్యుల సంప్రదాయంలో వీరు లేరు. తరవాత సృష్టికి బ్రహ్మ, పాలించడానికి విష్ణు, నశింపుకి రుద్రుడూ వచ్చారు నమ్మకాలలోకి. వీరి వ్యాపారాలకి అనుగుణముగా బ్రహ్మకి విద్య, విష్ణుకి ధనమూ, రుద్రుడికి శక్తి భార్యలన్నారు. ఇక కుమారులు కలగవద్దా? విష్ణుకి మన్మధుడు కొడుకు. రతీదేవి కోడలు. వీరిద్దరూ విష్ణువులాగే మనికికి సంబంధించినవారే. ఇక రుద్రుడికి దేవసేనాపతి కుమారుడు కొడుకు. పాపం బ్రహ్మకిమాత్రము ఈ రకపుసంతానము లేదు. (రాక్షసులున్నారు!) ఈ దేవసమాజమంతా మానవనిర్మితమే.

ఈ కోలాఅంతా ఏమిటని, బసవేశ్వరుడు శివుడొక్కడే దేవుడన్నాడు. రంగనాథుడే దేవుడన్నాడు రామానుజస్వామి. రూప కల్పన ఎప్పుడైతే వచ్చిందో అప్పుడే భేదమూను. క్రీస్తుతరవాత క్రీస్తు, మేరీ, జోసెఫూ, ఇంకా అనేక యోగులూ ఉపాసనాదేవతలుగా ఏర్పడ్డారు క్రైస్తవులకు. ఇది గుచించక దేవుడొక్కడే, ఆయనకు మనమెరిగిన రూపము లేదన్నాడు మహమ్మద్ పైగంబర్. దానితో విగ్రహధ్వంసము బయలుదేరింది. ఎన్ని దేవాలయాల విగ్రహాలో విరిగిపోయాయి. ఔరంగజేబు విశ్వనాధలింగమును విరగగొట్టినాడు. బహమనీ సైనికులు హంపి నారసింహుని కోరలు పెరికి చేతులు కొట్టినారు. వారందరూ కొట్టినవి రాతి విగ్రహాలు. మనవారర్చించినదీ రాతి విగ్రహాల్నే, దేవుణ్ణికాదు.

కేశవ చంద్రసేను విగ్రహాల్ని దేవుని గుణములన్నాడు. సర్దుకోడానికి అలాగ చెప్పుకోవచ్చును కాని విఘ్నేశ్వరుడే గుణమూ? ఏనుగు బుర్ర ఏమిటి? ఏనుగు జంతువులన్నిటా తెలివైనది కానే కాదు. ఎలకవాహన మేమిటి? ఇక వెలపరమువచ్చే రూపాలు మాటేమిటి? గుడిమల్లములోని శివలింగము చూస్తే కొన్నాళ్ళదాకా శివాలయానికి పోలేము. అస్సాములో కామాఖ్య దేవాలయములోది సతీదేవి యోని ముద్ర! ఇక మలబారు ప్రాంతాల్లో జగన్మోహినికీ, శివునికీ పుట్టినాడట అయ్యప్పన్! వీరంతా స్వయంభువులేనా?

దేవుడంటే నాటికి తోంభయి తొమ్మండుగురికి కోరికలుతీర్చే స్వామి. అంటే కోరికలకే గుడికట్టి అర్చిస్తున్నారు నరమానవులు! కోరికన్నదే లేకపోతే దేవుడే లేడన్నమాట! (ఇదే కాబోలు బుద్ధుని ఉద్దేశము)

చిత్రప్రశ్నలకు జవాబులు

—నీటిబిందువు నిండా నీరుంటుంది. బిందువుకి అవతల గాలిఉంటుంది. వెలుతురు కిరణము గాలిలోంచి నీటిబిందువులో ప్రవేశించినప్పుడు - గాజుపట్టకములో ప్రవేశించినప్పుడు వలెనే - ఏడురంగులుగా విడిపోయి, ఆ బిందువునుంచి బయటికి వచ్చేటప్పుడు మరింత విడిపోతుంది. నీటి గుండా పోవునప్పుడుకూడా కిరణాలు రంగులుగావిడనూ విడతాయి, నీటిఅడుగున రంగుల మచ్చలలాగు పడనూ పడతాయి. అయితే ఈ రంగులు నీటికి వెలుపలనున్న కంటిని చేరడంలో మళ్ళీ మొదటి తెల్లవెల్తురులాగ కలిసిపోతాయి

—శబ్దముయొక్క వేగముకన్న వెలుతురుయొక్క వేగము ఎక్కువ కనకనే ముందు మెరుపూ, తరవాత ఉరుమూ వినబడతాయి. పిడుగు పడ్డచోట మెఱుపూ శబ్దమూ ఒక్కసారే వినబడతాయి మెరుపు

ఈ గాలుమన్న కొంతవరకూ శబ్దము వినబడక పోతే పిడుగు చాలాదూరాన్న పడిందనుకో వచ్చు. అంటే జడవనక్కరలేదు. కోట గోడలమీదనుంచి దుర్గరక్షణ చేసే సైనికులు, శత్రువుల ఫిరంగులు పేలినప్పుడు ముందు మంట చూస్తారట, తరవాత ఆ గుండు కోటగోడకి తగలడము చూస్తారట, ఆతరవాతే శత్రు ఫిరంగినాదము వినబడుతుందట. తుపాకి దెబ్బతిన్న పిట్ట అనుభవమూ ఇలాగే వుండాలి మరి.

—సముద్రములో ఏర్పడే వాయుగుండము కాళీగుండము. అక్కడికి నాలుగు మూలలనుంచీ గాలి విసురుగా వీస్తుంది. ఈ గాలి మీదనే వానమబ్బులూను. వానమబ్బులు కిక్కిరిసి, వాన కురుస్తుంది. కనక "వాయుగుండము నెల్లూరిదగ్గర తీరరేఖని దాటుతుంది" అంటే, వాయువులు ఆ చోటుకి కేంద్రీకృతమై అక్కడ వర్షాలు పడతాయన్న మాట.

—వర్షకాలములో తలుపులు బిఱ్ఱబిగవడము తడికి నానుటవల్లగాని చలికి సంకోచించుటవల్ల కాదు. ఎండకాలంలో తడి ఆరి కుంచించుకుంటాయి, కనక చక్కగా పడతాయి. వర్షకాలంలో తడికి ఉబ్బి, సరిగ్గా పడవు. ద్వారబంధములోని కర్ర కూడా ఉబ్బుతుంది కొంత. దీని ఫలితమూ అదే.

—'లోకులూ లోకమూ క్షీణించిపోతున్నాయి, నేటికంటె నిన్నటి రోజే మెరుగు' అనుకోవడమే ముదిమి. రేపన్న రోజులో ఆశతో ఉండడమే యువ్వనము.

—మనుష్యులనూ, జంతువులనూ తినే చెట్లు లేవు గాని చిన్న చిన్న ఈగలనూ, పురుగులనూ పట్టి నెత్తురు పీల్చే మొక్కలున్నాయి. పురుగు వాటి ఆకులమీద వాలగానే ముళ్ల ఆకులు గభీమని ముడుచుకుని, పురుగును నొక్కి దాని నెత్తురుని జీర్ణం చేసుకుని, పిప్పిని వదిలేస్తాయి.

—పిడుగు ఏ చెట్టుమీద పడినా భూమిలోకి పోవలసినదే. పిడుగు మేకు కాదు. మెఱుపు.

—పురికొస అనేది ఒక రకపు పాలీడు. అయితే సుమారు రెండు అంగుళాల పొడవుని అటూ ఇటూ సన్నని కాళ్ళు నూరుదాకా ఉన్నట్టుంటాయి. కుట్టునంటారు. నేను ఎవరికీ కుట్టగా వినలేదు. ఈ రకపు పాలీడుకు విషముంటుంది.

—పాలలో తెల్లని కణములు ద్రవములో తేలుతూ వుంటాయి. పాలకు తోడు చేర్చి పెట్టినప్పుడు మొత్తమంతా ముద్దగట్టి పెరుగు (*Jelly*) అవుతుంది. పెరుగులో నీళ్ళుపోసి గిలకొట్టినప్పుడు ఈ ముద్ద చిన్న కణాలుగా అంతటా సర్దుకుంటుంది. మరి నీటి భాగము ఎక్కువైపోలేదూ? కనక నే, నిలువ ఉంచితే నీరు తేలిపోతుంది.

—ప్రకృతిలో తేలిక వస్తువులయ్యా, గాలీ, ఆవిరీయొక్క శక్తులు అమోఘములే. ఎందుచేతనంటారా? సంఘీభావమువలన గాలీ, ఆవిరీ కణములు ఒకేవైపు ప్రసరించునప్పుడే ఈ శక్తి.

★




పల్లె కొంపలు
చిత్రకారుడు:— హెచ్. వి. రామగోపాల్.



'దుశ్శాసనుని దుండగం'
చిత్రకారుడు :
పి ఎల్ మూర్తి

★



ఏ. ఏ. ఏ. చిత్రకళా ప్రదర్శనం

ఆర్థర్స్ అండ్ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ (మద్రాసు) వారి యాజమాన్యాన యిటీవల మద్రాసు మ్యూజియంలో చిత్రకళా ప్రదర్శనం జరిగింది. ఈ సంచికలో ప్రకటించబడిన కె. సి. ఎస్ పణికర్. హెచ్. వి. రామగోపాల్, పి ఎల్. నరసింహామూర్తి, కె. శ్రీనివాసులుగారి చిత్రాలు ఆ ప్రదర్శనలోనివి.

★

"మంజీరం"
చిత్రకారుడు :
కె. శ్రీనివాసులు.



మిణుగురులతో

దిట్టకవి పద్మకుమారి

ఎవరమ్మా, మీరంత?
నిండారు జగమంత!
తళతళలు తనువంత!
రాత్రొస్తిరేం? వింత?
ఎవరమ్మా!

మబ్బులో రిక్కల్ల
మనుమరాళ్ళా మీరు?
మట్టిలో పిక్కల్లి
మెరుపురాళ్ళా మీరు?
ఎవరమ్మా!

భువినుంచి ఎగిరారా!
దివినుంచి దిగినారా!
మిన్నుమన్నుల మధ్య
మిడిసిపడుతున్నారు!
ఎవరమ్మా!

మెరుపుతీవియ మీకు
ఏమి కావాలమ్మా?
చందమామకు మీకు
చుట్టరిక మేముంది?
ఎవరమ్మా!

రారమ్మా, రారమ్మా,
రారమ్మ మీరంత,
నా పలుకు లాలించి
మీ స్థితిని యోచించి
రారమ్మా!

నిశివేళ పయనమ్ము
సరిగాదు జేయంగ,
వసియించి మాయింట
తరలిపోదురు రేపు
రారమ్మా!

మల్లిపందిరి మీకు
విడిదియిల్లుగ జేతు,
తీపి తేనియలు, పు
ప్పొడి, విందు గావింతు,
రారమ్మా!

మా నాన్నతో చెప్పి
మంచి బహుమతు లిత్తు
సల్లాపములనాడి
సాగనంపగ వత్తు
రారమ్మా!


అత్తాకోడళ్ళు

కె. యస్. దేవి

ఆనందాలభరిణె ఎవరంటే మా వదినే నని చెప్పొచ్చు. చంపకి చారెడు కళ్ళతో, పసిడి ఛాయతో మిసమిసలాడి పోతుంటుంది. స్వభావం కూడా చాలా మంచిది. కాని ఒచ్చిందల్లా ఒకటే చిక్కు. ఆమెని ఎవరూ పల్లెత్తుమాట అనకూడదు. అంతా తన యిష్ట ప్రకారమే జరగాలంటుంది. అందరితోను అన్నివిషయాల్లోనూ చాలా మంచిగా ప్రవర్తించే అమ్మ, కోడలిదగ్గిర కొచ్చేసరికి ఎక్కడ లేని ఒడితనం ఒలకబోస్తుంది.

నిజంగా వీళ్ళిద్దరితో వేగటం నాకు చాలా చికాకు. ఏదో చిలిపి పని చేసో, పెంకి జవాబు చెప్పో వదిన అంటించేది. అగ్నిహోత్రం దాంతో పెద్ద ప్రళయం లేవదీసేది అమ్మ. నాకెందుకీ గొడవ అని పోయేదాన్ని. కాని ఇట్టే గడిచిపోయేది ఆరు గంటల కాలం కాలేజీలో. మళ్లీ ఇంటి కొచ్చేసరికి కార్యక్రమం లక్షణంగా జరుగుతూండేది. ఇంతా చేస్తే ఏం లేదు. పువ్వులు చేతి మాల కడతానని వదినె, 'ఒద్దు, కాలిమాల కట్ట'మని అమ్మ! జడలోకి అది బాగుంటుందని ఆమె; ముడిమీదికి ఇది అందం అని ఈమె! 'పోనీ మీమాట్టుకు అలా చేస్తాన'ని సరిపెట్టచూసేది వదినె. 'ఇంట్లో నలుగురూ ఓలా ఉండక పువ్వులు పెట్టుకోవడం దగ్గిర్నించి భేదమే చేస్తారు' అని అమ్మ ఉడుక్కునేది. ఇంతే కారణం. ఇదే కాదు.

అసలు వీళ్ళిద్దరి కలహకారణాలు ఎప్పుడూ ఇంతమాత్రంగానే ఉండేవి. ఏదో ఒక దానిమీద వీళ్ళిద్దరికీ అలా జరుగుతూనే ఉండేది రభస. పోనీ నేను పోయి ఎవరిప్రక్క మాట్లాడదామన్నా భయమే. ఇంకొస్తే అమ్మ 'నువ్వూ తయారవుతున్నావు' అని నన్నే తిడుతుంది. పోనీ అని అటు పోతే, 'ఆడబడుచువైనందుకు నేర్చుకున్నావులే' అంటుంది వదినె. దేవుడా! ఇంక ఈ ఇంట్లో శాంతి ఉండదు కాబోలు అనిపించేది. ముఖ్యంగా నాకు. ఎంచేతంటారా అన్నయ్య, నాన్నగారు అంటే మా యింట్లో అందరికీ హడలే. వాళ్ళింట్లో ఉన్నంతసేపూ చివరికి మా చెల్లి కూడా కిక్కురుమనదు. తరవాతా? మా అందరికీ సంపూర్ణ స్వాతంత్ర్యం ఒచ్చేసేది. వాళ్లు పొద్దున్న 9 గంటలకి ఆఫీసుకు వెళ్ళితే, మళ్ళీ రాత్రి 10 గంటలకే ఇంటికి రావటం. ఏంగొచ్చీ ఉన్న చిక్కల్లా నాకే ఒచ్చిపడింది. పోనీ పెద్దది, ఏదో అంటుంది అని వదినె ఊరుకున్నా బాగున్ను. కాని ఈమె మాత్రం ఏం తక్కువ తిన్నది? అలా అని - మేడిపండు చూడ మేలిమై యుండును, పొట్ట విప్పి చూడ పురుగులుండు' అన్న రకం కాదు సుమండీ. స్వచ్ఛమైన స్వభావం ఉన్నదే. కాని అత్తవారింట్లో కాపురం చేస్తున్నా, చిన్నతనం చిలిపిచేష్టలుమాత్రంపోలేదు.



గుసగుసలు

ఫొటో: — జి. ఎన్. భూషణ్ (మద్రాసు.)

★ అత్తాకోడళ్లు ★

ఏ పనైనా తనకి నచ్చినట్లు కాక ఇతరుల ఇష్టప్రకారం చెయ్యటం బానిసతనమని అనుకుంటుంది.

ఆ రోజు, బహుశా, మంగళ వారం అనుకుంటా. జోరుగా వర్షం కురుస్తోంది. ఇంటర్ వల్లో ఇంటికెళ్ల లేక కాలేజీకే కాఫీ తెప్పించుకుని తాగే. కాని సాయంత్రం ఇంటి కెళ్ళక తప్పదుగా. వదినె కారు కూడా పంపింది వేగం రమ్మని. సరే. ఎలాగూ తప్పదు ఇంక అని బయల్దేరాను-మా వాళ్ళ కయ్యాలు ఆసాంతం వినడానికి చెవులు సరి చేసుకుంటూ.

వీధిగుమ్మంలోనే వదినె ప్రత్య క్షమయింది. సావిట్లో అమ్మగారి దర్శనమయింది. కాని వీళ్ళిద్దరి మధ్య మామూలుగా జరిగే జగడం తో తుల్యమైన సంభాషణ ఏదీవిని పించకపోయేసరికి ఆశ్చర్యపోయా. 'వేగం డ్రెస్సు వేసుకో సుధా. సినీ మాకి పోదాం' అంది వదినె 'నీవు సిద్ధంకావే శశీ. దానికి కాఫీ నేను ఇస్తా' అంది అమ్మ. ఓ! మైగాడ్. ఏమిటీ వైపరీత్యం అను కుంటూ ఐదు నిమిషాల్లో రెడీ అయ్యాను.

కారు మెయిన్ రోడ్డుమీదించి వేగంగా సాగిపోతూంది. 'ఏ సినీ మాకి' అని అడిగా వదినెని. 'సంసారానికి పోదాం' అంది ఆమె. 'కాదు దీక్షకి' అంది అమ్మ. 'సంసారమే బాగుంటుం' దంది వదినె. మరేం. మళ్ళీ మామూలు వ్యవహారం ప్రారంభమవుతుం దను కున్నా. పూర్తిగా దానికి వ్యతిరేకం అయింది! 'సరే. దానికే పోదాం' అంది అతి సరళస్వభావం తెచ్చు కుంటూ అమ్మ. నిజంగా నేను తల క్రిందులై పోయాను - అకారణంగా ఎందుకిలా ఇద్దరి మనసులూ ఏక మయిపోయాయి అని.

సినిమా చూస్తున్నానే కాని నా మనసులో అంతా వీళ్ళ వింత ప్రవ ర్తనే మెదులుతోంది. ఉండబట్ట లేక ఇంటర్ వల్లో అడిగేసే వదినెని 'అమ్మని ఏం మందుపెట్టి లొంగ దీసుకున్నావు' అని. ఆమె నవ్వుతూ 'నేనేం చెయ్యలేదు సుధా. ఆవిడే నబబుగా మాట్లాడటం మొదలె ట్టారు. అనవసరంగా దెబ్బలాడట మెందుకని నేను సరిపెట్టుకుం టున్నా' అంది. ఆ సమాధానం నాకు బొత్తిగా నచ్చలేదు.

"ఎంతసేపట్నించీ ఈ సయోధ్య?" అని అడిగాను.

ఈమాటు నన్ను చూసి నాలుక వెళ్ళబెట్టి వెక్కిరించింది వదినె. "అయిదు గంటలనించి" అంది.

అయిదు గంటలకి ఏం జరిగి వుంటుందా అని ఆలోచించా. ఎంతకీ బోధపడలేదు. అడిగేశా.

"అయిదు గంటలకి ఏం జరిగిం దేం?"

వదినె నవ్వేసింది. "ఈమధ్య మీ స్కూల్లో నాటకం వేశారు జ్ఞాపకం వుందా?"

"ఆ"

"అందులో కథేమిటి?"

"కథేమిటా?" జ్ఞాపకం తెచ్చుకు న్నాను. అందులో అత్తాకోడళ్ళు తగువులాడుకుంటారు. చివరికి తగు వులు మానుకుని సుఖపడతారు.

"ఆ! తెలిసింది" అన్నాను. "అయితే అమ్మకి మనమడో?"

వదినె నా వీపుమీద చరిచింది. మెల్లిగా చెవిలో చెప్పింది. "ఆ సంగతే అత్తగారికి అయిదు గంట లకి చెప్పాను."

"అమ్మ దొంగా" అని వదిన్ని వీపుమీద కొట్టబోయి అంతలోనే చెయ్యి దించేశాను. ★

పిచ్చి కుక్కలు

ఇది సుమారు పదునెనిమిదవ శతాబ్దపు ఆఖరు రోజులలో మూరు మూలవున్న మావూర్లో జరిగిన సంఘటన.

రంగయ్య రొట్టెల దుకాణం అంటే ఆ ప్రాంతంలోని అయిదారు వీధుల వారికెంతో నమ్మకంగా వుండేది. ఉదయం లేవగానే ఆవీధుల్లోవుండే రమారమీ ప్రతి వ్యక్తి రంగయ్యయింటికివచ్చి అతను ఒక్కొక్క రొట్టె కాల్చియిస్తూ వుంటే తీసుకొని వెళ్ళిపోతూవుండే వారు! రామన్న, సుబ్బయ్య, వీరభద్రం, శేషావతారం, భగవానులు, వెంకటేశం అంతా రంగయ్య దుకాణందగ్గర స్నేహితులైన వాళ్లే రంగయ్య దుకాణం దగ్గర తమవంతురొట్టె దొరికేవరకు ఏదో లోకాభిరామాయణం చెప్పుకోవడం, తరువాత ఎవరిపనులమీద వారు వెళ్లిపోవడం వారినిత్య దినకృత్యం ...... వారిమాటల్లో మాత్రం గతసంవత్సరపు పండగ రోజుల్లో రాణీగారి అలంకారాల్లోని ప్రత్యేకత దగ్గరనుంచి, నిన్న ఫలానీ వాడు ఫలానీ దగ్గర తాగి తందనాలాడినవైనం వరకూ ఎన్నో భోగట్టాలిట్టే దొర్లిపోయేవి.

ఒకరోజు కాస్త పెందరాళే వచ్చినసుబ్బయ్య మరేమీవిషయం స్ఫురించక "రామన్న మావా! యీకుక్కపిల్ల వుందిచూసేవూ... నల్లకుక్కపిల్ల. రోజూ నేనురొట్టెపట్టుకొని వెళ్లిపోయేటపుడు...కూ.కూ. కూ అంటూ నావెంటచాలాదూరం వరకూ వస్తుందిసుమా.."అన్నాడు. ఇంకాఏమో చెప్పబోయే లోపలే తనవంతురొట్టె దొరకడం చేత వెంటనే వెళ్లిపోయేడతను.

మరికొంత సేపు వంటరిగా కూర్చున్న రామన్న, ఆతరువాత వచ్చిన వెంకటేశంతో, సుబ్బన్నని నల్లకుక్క కరిచేసిందని కుక్కలుచాలా ప్రమాదకరంగా విజృంభించేయని ఓ చిన్న ఉపన్యాసం దంచేసేడు.

పంతుల సావిత్రి

తరువాత ఆమాట భగవానులు, శేషావతారం, వీరభద్రం, చెవి నుండిచెవికి దాటేసరికి నల్లభైరవం పిచ్చికుక్కగాను, సుబ్బయ్య రాణీగారి ఆంతరంగిక కార్యదర్శిగానూ మారిపోయేరు. అంటే రంగయ్య రొట్టెలదుకాణం దగ్గరనుంచిపట్నం నాలుగుమూలల ప్రాకిపోయిన ఆవార్త స్వరూపంయిది:- ఊళ్లో పిచ్చికుక్కల ప్రమాదం చాలా తీవ్రంగావుంది. మహారాణీ గారి ఆంతరంగిక కార్యదర్శి పిచ్చికుక్కచే కరువబడిన కారణంగా చాలాప్రమాదస్థితిలో వున్నారు. ప్రజలందరూ 'ఆత్మరక్షణకి' తగు ఏర్పాట్లు చేసుకోవాలని కోటఅధికార్లు హెచ్చరిస్తున్నారు".

ఇకచూడండి తమాషా: యువకులంతా ముఠాలుగాచేరి పట్నవాసులను హెచ్చరించడం ఆరంభించారు. స్కూళ్లు, ఆఫీసులన్నీ వాటంతట అవే శలవలు ప్రకటించుకున్నాయి. బజారులన్నీ సుమారుగా నిర్మానుష్యమైనాయి. ప్రతిడాక్టరు యింటిముందు "పిచ్చి కుక్కల స్పెషలిస్టు" అని కొత్తబోర్డులు వెలిసేయి. ప్రతిగోడమీద "పిచ్చికుక్కలకాటుకి రామబాణం లటి మందు" లపేర్లు రంగు రంగుల అక్షరాల్లో కనిపిస్తున్నాయి. ఒక్కమాటలో చెప్పాలంటే ఆనాటి మాగ్రామవాసుల్లో ప్రతిఒక్కడి మెదడులోనూ కనీసం ఓ వందపిచ్చికుక్కలైనా పరుగెడుతుండే వేమోననిపించిందంటే నమ్మండి! పరిస్థితులు విషమించక ముందే ధైర్యశాలురైన యువకులంతా కలసి 'ఆత్మరక్షణ' కై దళాలుగా ఏర్పడ్డారు. ప్రతినాలుగు రోడ్లుల కూడలికి ఒకొక్క దళంవారు సిద్ధమయేరు, కాళ్లకి ఇనుపమేజోళ్లు, చేతుల్లో బడితెలు, జేబుల్లో రాళ్లు, ఇవి యీపిచ్చికుక్కల పోరాటవీరుల "హంగులు!" వీరంతా నాలుగు పక్కలా కాచినసమయంలో ఎవరో ఒక "శూరాగ్రేసర చక్రవర్తి" అతిధైర్యంతో ముందుకిపోయి వెతికి వెతికి ఎక్కడనుంచైనా ఒకకుక్కని తరుముకొని వచ్చేవాడు. అదిగాని ముక్కుకి సూటిగాపోతే తప్పకుండా పిచ్చికుక్కే! లేక ఇటూ అటూ కలబడ్డదంటేకుక్కలపిచ్చికి ఇదిప్రధాన లక్షణం. ఎలాగైనా బడితెపూజతప్పదు. అంటే ఆరోజుతో 'కాకిగీట న్యాయంగా' ఆకుక్క యమపురి దర్శనభాగ్యం పొందితీరాల్సిందే...

కొన్నాళ్ల కీవిషయం మహారాణీగారి చెవినిపడింది. వెంటనే కోటలో ఒక గొప్పసభ ఏర్పాటు చెయ్యబడింది. పురప్రముఖులు,

(48-వ పేజీ చూడండి)


పంచతంత్రం
సంధి-విగ్రహం
కర్త... విశ్వాత్ముల నరసింహమూర్తి
(చిత్రవర్ణుడు:- మేఘవర్ణునితో.)
"నిమిషమైననూ శత్రుగణములో నిలచియుండుటే ప్రాణాంతకము: ఇంతకాలమూ వీరదుర్గగర్భుని కొలువులోన ఎట్లుండ గలిగితివి?"
"స్వామీ! కార్యవాదులగు వారెవరైనా ఎన్ని బాధలకు గురిచేసినను ఓరిమియే ప్రధాన గుణముగ, వెనుకటికి మందవిషునివలె శత్రువునే తమ భుజస్కంధముల మోసుకునైనను తిరిగెదరు!"
"ఎవరా మందవిషుడు? ఏమా కథ?"
కాంచీపుర ప్రాంతంలో ఉండేదొక జీర్ణోద్యానం; మందవిషుడను సర్పరాజము చిరకాలముగా కాపురముండెను.
ఒక రోజున ఆ సర్పము - ఆహారాన్వేషణకై - బయలుదేరి తిరిగినది. - తిరిగి తిరిగి చెరువులోన - కొల్లలుగా ఆడుచున్న - కప్పలను చూచినది
(మందవిషుడు - తనలో)
"ఆహా! అదృష్టము - ఎన్ని కప్పలున్నాయో! - తనివి తీర తినవలెను. - చెరువులోన దిగుటయెట్లా? ఏదో ఒక ఉపాయముతో మాయచేసి తినవలెను"
అని సర్పము యోచించి వ్యాధి చేత బాధపడే విధముగాను పడగవాల్చి నేలమీద పడియుండెను.
జలపాదుండను కప్పలరాజూ - ఇది గమనించి, 'పాపం! ఎవరో - ఏమివచ్చెనో, చూచెదమను కొని - పాము దగ్గరకు వచ్చి నిలచెను
"ఓహోహో! సర్పరాజమా! తెలుసుకొన్నచో ఎవ్వరినైనా మట్టుబెట్టగల నీవు ఏ విధముగ ఇన్ని కప్పలను చూచుచు యిట్లు కదలక మెదలక పడివున్నావేం?"
"నా దురదశ నీకేమని చెప్పుదు! - నేనిదివరలో ఎవరినైనను - 'దేహీ' అని యాచించి యెరుగను - ఒక బ్రాహ్మణోత్తముని శాపము చేతను నాకీ దుర్గతి ప్రాప్తించినది. - మిమ్ముందరినీ ఆశ్రయించుకుని - బ్రతుక వలసినా గతి కలిగినది."
"ఎవరా బ్రాహ్మణుడు? ఏమా శాపము?"
మందవిషుడు ఒక చక్కని కథను అప్పటికప్పుడు అల్లి చెప్పెను. -
నిన్నటి దినము అర్థరాత్రమున ఆహారమునకు తిరుగుచుంటిని.
వెలికి వచ్చినా విప్రకుమారుడు చూడక తెలపై అడుగిడెను కోపోద్దీపితమానసుండనై పాదముపైనే కాటువేసితిని
బాలకుడంతట పరుగిడిపోయి జనకుని కంతయు చెప్పియేడ్చెను. విషప్రభావము తలకెక్కుటచే నురుగులు గ్రక్కుచు మూర్ఛపోయెను



పంచతంత్రం
సంధి-విగ్రహం
కర్త... విశ్వాత్ముల నరసింహమూర్తి
కడుపు శోకము భరించలేక విప్రుడు బిట్టుగ ఏడ్వదొడగెను. వార్త తెలిసినా బంధువులందరు బ్రాహ్మణునింటికి వచ్చిచేరిరి.
వైద్యుని పిలిచి బాలుని చూపి ప్రాణదానమును చేయుమని బ్రాహ్మణోత్తముడు కడు విలపించెను.
వైద్యుడు దయతో ఔషధ మీయగ విప్రకుమారుని ప్రాణము వచ్చెను.
పుత్రుని ప్రాణము వచ్చినసూ- కసి తీరక ఆ బ్రాహ్మణుడూ- నన్ను శపించెను ఘోరముగా!-
"నిష్కారణముగా విప్రకుమారుని కరచిన పాపము నిన్ను విడువదు. నీకాహారమగు మండూకములనే నీవు సదా సేవింతువు గాక! అవి యిచ్చిన ఆహారమునే నీవు సదా భుజించవలయును!"
(మందవిషుడు: జలపాదునితో)
"శాప వశమ్మున ఈగతికలిగె మిమ్మందరిన్ అన్వేషించుచు యిటు యిడుకూ చేరితినండీ. పాదదాసుడన్ను. కరుణించండీ. వాహన మెక్కు విహరించండీ; తోచిన దేదో పెట్టండీ!"
పాము చెప్పినా మాటలు నమ్మి- జలపాదుండూ సంతోషించి- పాము మూపుపై కెక్కి కూర్చునే- హాయిలుగ షికారు బయలు దేరెను.-
కొంతదూరమేగు సరికి- మందవిషుడు నెమ్మదిగా- జలపాదున కిట్లనియెను:
"ఆహారము లేక నాకు- ప్రాణము కడబట్టు చుండె.- దయతో నా కేదైనా- ఆహారము పెట్టినచో- తిరిగి నేను నడువగలను."
"మందవిషుడా! చెప్పెద విను; ఎవరి యాజ్ఞ నడుగకయె కొలని దరికి నీవు పోయి కప్పలన్ని తినవచ్చును."
మందవిషుడు సంతసించి వడివడిగా కొలను చేరి కొన్ని కప్పలను భుజించె.
దినదినమూ కొలను చేరి- ఒక్కటైన మిగులకుండ- అన్నిటినీ తినివేసెను.
చివరికొక శుభముహూర్తాన జలపాదుని కూడ మింగి తన దారిని తా బోయెను.
(మేఘవర్ణుడు: చిత్రవర్ణునితో)
"ఓ రాజా! నేను కూడ- మందవిషుని చందమునే- అవమానము భరించాను- కార్యార్థులమైన మనము- అవమానము సహించవలెను,- కార్యము సాధింపవలెను."

పట్టణంలో మామయ్య

జూలోకి ఖడ్గమృగం కొత్తగా వచ్చింది. పట్నవాసానికి మా మామయ్య కూడా కొత్తగా అడుగెట్టాడు జూలో ఖడ్గమృగానికన్నీ కొత్తే. పట్టణంలో మా మామయ్యకీ అంతే. జూలో ఖడ్గమృగానికి చుట్టూ కంచ కట్టారు. మా మామయ్య కది లేదు. ఎప్పుడో చిన్నప్పుడు పట్నవాసం నుంచి వాళ్ళ నాన్న తెచ్చిన కోటూ చొక్కా తొడుక్కుని మంచి టిప్ టాప్ గా తయారయాడు పట్నం వచ్చిన మామయ్య.

అమ్మ చెప్తూనేవుంది, 'అలాంటి సరిపోని గుడ్డలు వేసుకు బయలుదేరకురా, అందరూ నవ్వుతారు'

రచన:
కె. రామలక్ష్మి
బొమ్మలు:
మంత్రవాది ఉమాశంకర్

అని. కాని మామయ్య మొండి శిఖండి.

"ఏంటక్కాయ్? కొత్తకొత్తగా మాట్లాడుతున్నావు? నేనేం అంత గబ్బిలాయినా యేం? రామంగాడు రాగానే జూకి పోతాం" అని ఓసారి కోటు సవరించుకున్నాడు మామయ్య.

"ఒరే జూలోకి ఖడ్గమృగం కొత్తగా వచ్చింది. దాని ముక్కు మీద కొమ్ముందిరా. దాంతో కుమ్మిందంటే యింకేమేనావుందా" అంది అమ్మ. అమ్మా మేమూ అంతా, ఖడ్గమృగాన్ని చూసి వచ్చాం. అంత శరీరాన్ని శాఖాహారంతో ఎలా పోషించుకొంటుందో అని ఆశ్చర్యపోయాం కూడా.

సాయంత్రం, స్కూలునుంచి





వచ్చాను మావయ్య వేషం చూసి నవ్వు ఆగిందికాదు. 'ఏరా వెధవా జానెడున్నావ్ నవ్వేమిటి?' అని కసిరాడు.

ఎలాగైతేనేం, నేనూ మావయ్య జూకి, ముఖ్యంగా ఖడ్గమృగాన్ని చూడ్డానికి బయలుదేరాం. దారిలో అందరూ మావయ్యని వింతగా చూడ్డమే; లోపల్లోపల నవ్వుకోడమే.

జూలో ఖడ్గమృగం వున్న పక్కకే ముందు వెళ్ళాం. నే ఎంత వద్దంటూన్నా మావయ్య అందరి కళ్ళు కప్పి, కంచె దాటి లోపలికి వెళ్ళాడు. నాకు కాళ్ళు దడ పుట్టాయి. కాని ఏం చెయ్యడం? చెట్లమధ్య గంభీరంగా నుంచుంది ఖడ్గమృగం. మావయ్య కొంచం దగ్గరగానే వెళ్ళి హీరోపోజు పెట్టాడు. కాస్సేపు యిటూ అటూ చూసి ఖడ్గమృగం ఓ అడుగు ముందుకేసింది. అంతే. మావయ్య దౌడందుకొని, బైటపడ్డాడు. ఆ కొమ్ముతో పొడిచేస్తే, పాపం మావయ్య ఏమైపోనోకదా? ప్రాణాలు గుప్పిటపట్టుకుని బైటపడ్డాడు మావయ్య.

దారిలో అంతా తన ధైర్యం గురించి కోతలే. తనుకనక అలా ఖడ్గమృగం దగ్గరగా వెళ్ళగలిగాడట! తననికనకనే ఖడ్గమృగం ఏంచెయ్యలేదుట! అతని హడలూ, పరుగూ చూసిన నాకు యిదంతా వింటే నవ్వువచ్చింది. అందరూ చూస్తారేమో అని ఓ పక్కన సిగ్గు. ఎలాగో యింటికొచ్చేశాం. అమ్మకీ నాన్నకీ యీ సంగతి చెప్తే, ఒకటే నవ్వు. చివరికి నాన్న అన్నారు. "మీ మావయ్య కోటూ బూటూ [illegible] దగ్గరగా రాబోతుందిరా ఖడ్గమృగం. అంతేకాని, పాపం! ఖూ మావయ్యకి ఏం తెలుసు?" అని నవ్వేరు. ★

సబ్-ఇనస్పెక్టర్ : (ఖంగారుతో) ఏయ్ 304!...అలమారులోనించి 12 వ నెంబర్ ఫైల్ ఇలా తీసుకురా.

304 : ఈవేళ రైటర్ గారు రాలేదుసార్ ... బీగాలు వారి వద్దనే వున్నాయండీ!

సబ్-ఇనస్పెక్టర్ : (కోపంతో) ఆ చావు కబురు చెప్పకపోతే, 3 వ గదిలో వుండే ఆ కొత్త దొంగను తెచ్చి అలమారు తాళాలు తీయించకూడదూ?

—జి. వి. జి. కృష్ణ, మద్రాస్.

పందెం గెలిచిన విధం


యమ్. నాగభూషణం

మామయ్య ప్రతి సెలవులకు బందరు రమ్మని వుత్తరాలు రాయడం నేను యేదో ఒకవంకని తప్పించుకోవడం, మా కిద్దరికీ అలవాటైపోయింది. ఈసారి వుత్తరం రాగానే బయలుదేరాలని నిశ్చయించుకున్నాను. వుత్తరం రానే వచ్చింది. నేను బందరు వెళ్లాను.

మా మామయ్య మాటలు కోటలు దాటుతాయి. నేను వెళ్లేనరికి మా మామయ్య కూతురు దుర్గ అక్కడ లేదు. వాళ్ల కాలేజీ పిల్లలతో పాటు వాళ్లవూరు వెళ్లిందట! మరో పదిహేను, యిరవై రోజులదాకా వచ్చే సూచనేమీ లేదు. ఆ మాట వినగానే కొంత దిగాలుపడ్డాను. మామయ్య యేదో కొత్తవిషయం కనిపెట్టిన వాడిలా షెర్లాక్ హోమ్సు మొహంవేసి మొదలుపెట్టాడు.

"ఇన్నాళ్టికి వచ్చావురా, ఎలాగైతేనేం. కాళ్లు కడుక్కోవడానికి కూడా అల్లుడి బెట్టుచేస్తున్నావ్! చివరకు మీ వూరు వెళ్ళేటప్పుడు వాచీ, మోటారుబైక్‌లాంటివి యిస్తాననుకున్నావేమో, యిదుగో బంగారంలాంటి యీ యిసక కాస్త తీసుకొని పో. మట్టిలో కూడా రత్నాలు వుండవచ్చు మరి!... ఏమంటావ్?" అన్నాడు.

మామయ్య మాటలంటే అత్తయ్యకు మంట. ఆయన మొదలుపెట్టటమేమిటి, యీ విడ సినిమా డైరక్టరులాగా 'కట్' అనడం, రెండూ యించుమించుగా ఒకేసారి జరుగుతయ్.



"అవుట్‌లైన్సు అన్నీ అర్థం అయినయి మామయ్యా! అసలు సంగతేమిటి?

"పదవోయ్, నీకు ఆయనతో యేమిటి? లేచి, కాళ్లు కడుక్కో..."

కాళ్లు కడుక్కున్నాను. మరో గంటలో స్నానంచేసి, భోజనంచేసి, నిద్రపోయాను. లేచి రేడియో పెట్టుకొని పేపరు చదివి, టిఫెన్ తిని కాఫీతాగినా, యింకా నాలుగు న్నరకాలేదు. ఈ వేసవికాలం యింతే! కాఫీకొట్టేటప్పుడు దగ్గరకు వచ్చి నిలబడ్డ మాస్టారిలా కదలనే కదలదు!

కాఫీతాగి, బజారుకు పోయినాను. తరవాత పార్కుకి వెళ్లాను. కొంతసేపు పార్కులో గడిపి ఏమీ తోచక విసుగెత్తి ఇంటికి దారి తీశాను.

ఇంటికి వెళ్లేసరికి మామయ్య ఎవరినో కేకలువేస్తున్నాడు. అరవడంచేతనయిన వాళ్లు కరవడం మొదలు పెడితే తమాషాగానే వుంటుంది!

"వెధవ! పిసినిగొట్టు వెధవ! ఎట్లాగయితేం, సంపాదించాడు..."

ఇది పుంలింగంలో వున్నది కాబట్టి అత్తయ్యని కాదని స్పష్టం అయింది. మామయ్య హుషారుకోసం తనని తానే తిట్టుకుంటున్నాడా?

అదీకాదు; వుత్తమ పురుష కాదుగా!! మరి ఎవరిని తిడుతున్నట్లు మామయ్య?

"ఏం చూసుకొని అంతపొగరు? వాడికేవుందా? ఇటువంటివి లక్ష పనులు చేయిస్తాను, తలుచుకుంటే" 'తలుచుకుంటే గదా!' అనేది అత్తయ్య, మామయ్య "మూడ్స్"లో వుంటే.

కాని అవతలవాళ్లు ఏమీ మాట్లాడకుండా ఒకరే మాట్లాడితే నాటకంలో స్వగతంలాగా రెండు పేజీలు గడుస్తుంది.

'ఎవరిమీద మామయ్యా, అంత విరుచుకు పడుతున్నావ్?'

మామయ్య నన్ను చూసి మరీ లేచాడు.

"నువ్వు చెప్పరా, నేను తలుచుకుంటే, వాడెంత? నా అంతట నేను స్వయంగా వెళ్లి అడిగితే కాదంటాడా? రేపే పనివాళ్లని పిలిపిస్తాను; ఏంచేస్తాడో యీాయన?"

మూగవాడిదగ్గరకు వెళ్లి ముక్కుగోకితే వాడికి పౌరుషంరాదూ?

"అవుట్ లైన్స్ అన్నీ అర్థం అయినయ్ మామయ్యా! అసలు సంగతేమిటి?"

"ఆయనకేమీ తెలియదులే" అంటూ మొదలు పెట్టిందత్తయ్య, తనా నిశ్చయానికే నాడో వచ్చినట్లు- "మనదొడ్లో వున్న షావుకారుగారి చెట్టులేదూ?"

ఆఁ!" అన్నాను, తరువాత విషయంకోసం.

"వాడెక్కడ కొట్టిస్తాడురా. కావలసినఖర్చులుకూడా నేనే భరిస్తానన్నాను; చాల్లా వెధవకి."

"పోనివ్వండి. వాడితో యేమిటి?" అన్నది అత్తయ్య; ఇండియాలాగా అత్తయ్యకూడా శాంతినే వాంఛిస్తోంది కాబోలు! అసలు సంగతి యిది!—

ఇంటిప్రక్కన వున్న షావుకార్ని మామయ్య 'ఐరన్ సేఫ్' అనేవాడు. ఆయనకు పిల్లలులేరు! పిల్లలమీద ఉండవలసిన మక్కువంతా ఆయన యీావేపచెట్టుమీద చూపించేవాడు. దానిక్రింద పడుకుంటే ఫాన్లు వేసుకున్నంత హాయిగా వుంటుందంటాడాయన.

అసలు చిక్కెక్కడవచ్చిందంటే, అది పుట్టటమయితే షావుకారు గారింట్లోనే పుట్టింది కాని; పెంపుడు కూతురులా మామయ్యగారింటికి వచ్చింది. ఆయనకూడా ఒక పాతికభాగమే తన కుంచుకొని, మిగిలిన దాన్ని మామయ్య గారింటికి పంపి తన స్వార్థత్యాగాన్ని ప్రదర్శించాడు.

కాని యీా పెంపుడుకూతురు అత్తయ్యకు కానీ, మామయ్యకు కాని సుతరామూ యిష్టంలేదు. అంతెందుకు? చివరకు ఏమీ తోచని యింట్లో ఆడుకోవడానికి గాని పోట్లాడుకోవడానికిగాని ఒక్క చెల్లెలైనా లేని దుర్గకే యీాపెంపుడు యిష్టంలేదు!

ఈచెట్టు కావడానికి చిన్నదే! కాని, చేసేపనులు! మొదట కాకులకు, వాటిస్నేహితులకు విశ్రాంతినిచ్చేది. తరువాత వాటికి యిళ్లు కట్టుకోవడానికి స్థలాన్ని యిచ్చింది. ఇళ్లు కట్టుకోవడానికి కావలసిన సరంజామా యిచ్చేది.

ఇకపోతే దీనివల్ల మామయ్యగారిదొడ్డికి లాభమేమిటంటే, ఆ పక్షుల ఆహారపదార్థాల తాలూకు శేషించిన వాటి నిచ్చేది. పొరపాటున దానికింద పడకొంటిమా, ఆప్యాయత కొద్దీ తిని పారవేసిన గింజల్తో మనకి పూజచేస్తుంది.

ఇవ్వాళకూడా అటువంటి బెడదే వచ్చింది. పెళ్ళికివచ్చిన బహుమతుల్లాగా వేపచెట్టుయిచ్చే సర్వాభరణాలను ధరించిన పెళ్లికూతురు లాతయారయింది దొడ్డి. వీటిల్లో

★ పందెంగెలిచిన విధం ★


చాలావాటిని ఎప్పుడగా చూసేదే అత్తయ్య. కాని యివ్వాళ కొత్త రకం ఆభరణాలు, నగంతిన్న మాంసంముక్క, అన్నం కరుడు లాంటివి కనపడ్డాయి.

ఆడవాళ్లకు కోపంవస్తే, మగ వాడు చేతకాని వాడిలాచూస్తూ వూరుకోగలడా? అత్తయ్య తరఫున మాట్లాడడానికి షావుకారుగారింటికి వెళ్లాడు. కాని ఫలితం?

తన్నుచూస్తే ఆయనకి గౌరవం అనుకొని తానుకూడా గౌరవించే వాడు పూర్వం మామయ్య. కాని, వాడికింత పొగరా? అప్పటికీ అత్తయ్యకు తెలియకుండా చెట్టు కొట్టించడానికి అయ్యే ఖర్చు తానే భరిస్తానన్నాడాయె! వల్లకాదన్నాడు షావుకారు.

ఏమాట కామాటే చెప్పుకోవాలి— షావుకారు వల్లకాదన్నాడు కాబట్టి మామయ్య యీ సంగతి వెల్లడిచేశాడు కాని— లేకపోతేనా?—

ఎందుకూ ఒప్పుకోలేదు షావుకారు? అనీ మామయ్యను వేధించుకు తింటున్న ప్రశ్న. ఇంతకు పూర్వం ఆయనా, తనూ, ఏ విషయంలోనూ పోట్లాడుకోలేదే!



చివరకు మామకుతోచింది ఒక్కటే కారణం. షావుకారుగారికి కావలసిన మొహంపుల్లల్ని సప్లై చేస్తున్న ఆ చెట్టు రోజుకాయనకు ఒకపైసా ఆదాచేస్తున్నది. అందువల్లనే దాన్ని వదులుకోలేక పోతున్నాడు; పిసినిగొట్టు—అనుకొన్నాం.

మామయ్యకు తనుచేసే పనులమీద చాలా నమ్మకం. ఒకపని తాను చెయ్యలేకపోతే మరెవ్వరూ చెయ్యలేరని మామయ్యపంతం.

"ఆ పిసినిగొట్టు యింక ఎవరు వచ్చిచెప్పినా ఒప్పుకోడు."

"మామయ్యా! నీ మాట కొంతసేపు వుపసంహరించుకో! నేనుకూడా ఓడిపోతే అప్పుడు అను."

"ఏడిశావ్"

"ఆపని చెయ్యలేకపోతే అప్పుడు యేడుస్తాను. నే సాయన్ని ఒప్పిస్తే ఎంత యిస్తావ్?"

"50 రూపాయలు."

"నిజమేనా? లేక వెళ్ళేటప్పుడు యిస్తానన్న యిసుక యింకా కొంచెం యిస్తావా?"

"నువ్వు చెయ్యాలే కాని, నేను యివ్వడం ఎంతసేపు?... కావా లంటే యిప్పుడే యిస్తాను."

వద్దంటూవున్నా మామయ్య డబ్బు తీసుకువచ్చి అత్తయ్య కిచ్చాడు.

అత్తయ్య మా పందానికి మధ్యవర్తి. "ఇక నా పని పూర్తయింది; నువ్వు పూర్తిచెయ్యాలి నీ పని" అన్నాడు మామయ్య, నే నెలాగూ ఆ పనిచెయ్యలేనన్నంత ధీమాతో.

'నేనూ రేపీ పాటికల్లా పూర్తి చెయ్యనూ.'

వీడెట్లా చెస్తాడో చూస్తా నని మామయ్య, చెయ్యవచ్చుననే ఆశతో అత్తయ్య, ఎట్లాచెయ్యాడ మనే ఆలోచనతో నేనూ ఆ రాత్రి సరిగా నిద్రపోనేలేదు.

మరునాడుదయం స్నానం, కాఫీ ఇత్యాదుల అనంతరం షావుకారు గారి దర్శనార్థం బయలుదేరాను. ఆ ఆఖరుక్షణంలో కూడా మామయ్య 'నువ్వేం చేస్తావులే' అన్నాడు ఎగతాళిగా. అత్తయ్య మాత్రం 'ఏ పుట్టలో ఏ పాముందో ఎవరికి తెలుసు? వాడు పెడితే చేస్తా నంటాడేమో' నంది ఆశగా.

నేను వెళ్ళేసరికి ఆయన చుట్ట కాలుస్తూ బూజుపట్టిన యింటి వాసాలు లెక్కపెడుతున్నాడు. ఫాక్టరీ పొగగొట్టంలా ఆయన నోరుమాత్రం దానిపని అది చేసుకు పోతున్నది.

నేను వెళ్ళి ఒక నమస్కారం పారేశాను. ఆయన నవ్వుతూ ఆహ్వానించాడు. ఈ శరీరాన్ని ఒక కుర్చీలో పారవేసి, ఎలా సంభాషణ ప్రారంభిద్దామా అని ఆలోచిస్తున్నంతలో ఆయనే మొదలు పెట్టాడు.

"ఏమండోయ్! ఎప్పుడు వచ్చారు? ఈ మధ్య రావటం లేదే!—" అన్నాడు.

నేను సమాధానం చెప్పబోతున్నంతలో ఆయనే "ప్రొద్దునవచ్చారటగా! ఏదీ, చదువుకుంటున్నారు కాబోలు, తీరిక ఏదీ?" అంటూ ఆయనే ప్రశ్నలువేసుకొని, ఆయనే సమాధానాలు చెప్పుకొని, ఒక వికృతమైన నవ్వు నవ్వాడు. ఎదుటి మనుష్యుల అవసరం లేకుండా, అన్ని పనులూ ఒకరే చేస్తే బాగానే వుంటుందనిపించింది. ముఖ్యంగా నాబోటి వాడికి, అందులో యిటువంటి పరిస్థితుల్లో!

కొంచెం సేపు కూర్చున్న తరువాత ఆయనే మొదలుపెట్టాడు.

"నిన్న మీ మామయ్య వచ్చాడు...ఆయనకు కోపంవచ్చి నట్లుంది."

నేను సమాధానం చెప్పలేదు.

"అయినా మీరు చెప్పండి; ఆ చెట్టు మా నాయన పాతాడట, నేను పుట్టినప్పుడు."

నాకర్థమయింది ఆయన ఎందుకు వప్పుకోలేదో.

"నిజమే ననుకోండి... అయినా ఆ చెట్టు చాలా యిబ్బందిగా వుందండి. దాని కొమ్మలు మీ దొడ్లో లేవు కనుక మీకు తెలియదుకాని; అది ఒక్కటే వుంటే నిక్షేపంగా వుండును, రోజుకో చుట్టాన్ని తెస్తుంది—"

ఒకలోభి తనయిల్లు శిథిలమై పోయినా, బాగుచేయిస్తే ధనవ్యయ మౌతుం దని ఆ పాత యింటిలోనే ఉంటున్నాడు. ఒక నాడు పెద్ద వాన కురిసింది. ఇంటిలో నిలవడానికి వీలులేక తల తడవకుండా కిటికీలో కూర్చున్నాడు. దారినిపోయే మిత్రు డొకడు అతన్ని చూసి "ఇలా ఇబ్బందిపడేకంటే ఇల్లు బాగు చేయించుకో కూడదా" అని అడిగాడు.

"ఇంతవానలో ఇప్పు డిల్లు బాగుచేయించడం ఎల్లాగోయ్"

"వాన వెలిసినతరవాతే"

"ఆతరవాత అవసరమే ముంది?"

దాసరి రమేశబాబు, పచ్చలతాడిపర్రు.

ఆయనకు అర్థం అయినట్లు నవ్వాడు.

"నాకూ తెలుసుననుకోండి. అయినా అంత లాభంగా వుండే దాన్ని ఖర్చిచ్చి కొట్టిస్తే నాకు లాభం ఏమిటి చెప్పండి?"

వ్యాపారం మొదలుపెట్టాడు. డబ్బుకోసం మనుషులు నీతీ నిజా



"హరిదాసు రామయ్య"

ఫొటో: నండూరి సుబ్బారావు, (ఆరుగొలను)

★ పందెంగెలిచిన విధం ★

యితీకూడా వదులుతారు కాబోలు! అదయినా వేలూ, లక్షలూ కాదు; నే నిచ్చే ఏ పాతిక రూపాయలకో!

ఎలాగైతేనేం బేరం ఫైసలు చేసుకున్నాం. వ్యాపారదృష్ట్యా లాభంవచ్చేసరికి షావుకారు వప్పుకున్నాడు. ఇంటికి వుత్సాహంతో తిరిగివచ్చేసరికి అత్తయ్య, మామయ్య యిద్దరూ ఒక్కసారే అడిగారు:

"ఏమయింది?"

గెలిచానన్నట్లు నవ్వాను.

"నే 'నెప్పుడో అనుకొన్నాను, వాడు సాధించుకువస్తాడని." అన్నదత్తయ్య.

నేను ఓడిపోయివుంటే, ఆవిడే అనేది "పెద్దవాడు మీ మామయ్య ఓడితే అతిగతీ లేదు కాని, యిక నీకా?"—

"ఎట్లా సాధించావురా? వాడెవ్వరివలలో పడేవాడు కాదే!"

మామయ్యకు యీ పని ఎల్లా సాధించానో కావాలి... కాని ఎట్లా చెప్తాను?

సాయంకాలం మూడుగంటలకు చెట్టుకొట్టడం పూర్తయింది. దాన్ని కొడుతున్నంతసేపూ అత్తయ్య నా వంక తృప్తిగాను, మామయ్య అప్పుడప్పుడు ఈర్ష్యతోనూ చూసేవాడు.

ఎలాగైతేనేం పందెం గెల్చాను. ఆ రాత్రి షావుకారు గారింటికి వెళ్లి వారికి కృతజ్ఞత తెలిపివచ్చాను.

ఆ మర్నాడు యింటిదగ్గరనుంచి వుత్తరం వచ్చింది త్వరగా యింటికి రమ్మని, అమ్మా, నాన్నా వాళ్లు వూరికి వెళ్లవలసివచ్చిందని— నాకుకూడా వెళ్లాలనిపించింది.

దుర్గ వచ్చిం తరువాత మళ్లీరమ్మన్నారు. అట్లాగే నన్నాను. బయలుదేరుతూ దుర్గకు వుత్తరం వ్రాశాను.

'మీ నాన్న పందెంలో 50 రూపాయలు ఓడిపోయినందుకు ఆయనకు, ఆయన కుమార్తెవైన నీకూ నా హృదయపూర్వక సానుభూతి...... అమ్మా, నాన్నా ఎవ్వరూ లేరు. నీవువస్తే పదిరోజులుండి వెళ్ళవచ్చు. పి. యస్:— నేను పందెం ఎలా గెల్చానో చెప్పగలవా?

—శర్మ.,

పిచ్చి కుక్కలు

(33-వ పేజీ తరువాయి)

ఉద్యోగస్తులు, డాక్టర్లు, యువకులు అందరూ హాజరయేరు. అంతవరకు పిచ్చికుక్క కాటుతిని చచ్చిపోయినట్లు, చికిత్స పొందుతున్నట్లు చెప్పబడ్డ వారందరూ తెల్లబోయి ఒకరిముఖం ఒకరు చూసుకుంటున్నారు.

ఇంతలో రాణీ గారు విషయం ఆమూలాగ్రం పరిశీలించి ఛలోక్తిగా:

"మంత్రీ! వీరిలో అమాయకమైన మూగ జంతువుల్ని అనవసరంగా చంపి పాపం చేసుకున్నవారు పాపవిమోచనార్థం వెంటనే తమ ఇంటిపేర్లు "పిచ్చికుక్కలు" అని మార్చుకోవాలనీ;

"అటుపైని కుక్క పేరువిని భయపడిపోయి యిళ్లల్లో దాగొన్న భీరువులందరికి పేరుచివర "పిచ్చికుక్కలు" అనేబిరుదు చేర్చుకోవాలనీ...... ఆజ్ఞాపించండి" అని చెప్పి సభ చాలించేరు. నాటికీ నేటికీ 'పిచ్చికుక్కలు' కథ మా వూళ్లో ఒకసామెతగానే వుంటూంది ★

★ ఘంటారావం ★

(25-వ పేజీ తరువాయి)

ఆనందం వెల్లివిరిసింది. ఆమె తన గదివైపు కతన్ని లాక్కురాబోయింది. కాని అతడు వినలేదు. "వొద్దు వొద్దు" అన్నాడు. "కోకిల గూటిలోకి గుడ్లగూబ రావచ్చునా?" అన్నాడు. ఆమె బలవంతపరిచింది. గది గుమ్మంవరకూ వెళ్లి అక్కడే నిలబడిపోయాడు. లోపలికి అడుగుపెట్టలేదు. ఆమె వెళ్ళి చాపపైన కూర్చుంది.

ఇద్దరూ కొంతసేపు మౌనంగా ఉండిపోయారు. అతడా అపార సౌందర్యాన్ని, ఆమె ఆ ఘోర వికృతాకారాన్ని పరిశీలిస్తూ ఉండిపోయారు. క్షణక్షణానికీ ఆమె కతనిలో కొత్తకొత్త అంగవైకల్యాలు కనపడుతున్నాయి. ముడి మోకాళ్ళనుంచి గూనివరకూ, గూనివద్దనుంచి ఒంటికన్ను ముఖంవరకూ దృష్టి సారించి చూసింది. మనిషి ఇంత వికృతంగా ఎలా ఉండగలడని ఆశ్చర్యపడింది. అతని ముఖంలో అంతకంతకి విషాదభావం, నిస్సహాయత, దైన్యం ప్రస్ఫుటమౌతున్నాయి. చివరి కామె ఆముఖం చూడ్డాని కలవాటు పడింది.

"మీరు నన్ను దేనక్కి పిలిచారా?" అని అడిగాడు క్వాసిమోడో.

అవునన్నట్లామె తలూపింది. అది అర్థం చేసుకున్నాడు.

చెప్పలేక చెప్పలేక చెప్పాడు: "మీకు తెలియదేమో! నాకు చెవుడు."

"పాపం!" అన్నదామె జాలితో.

జాలిగా చిరునవ్వు నవ్వాడు. "నాకింక లేని వైకల్యాలే మున్నవనుకుంటున్నారు కాదూ!అవును. నేను చెవిటివాణ్ని. ఎంత అన్యాయమో చూడండి. మరి మీరెంత చక్కగా ఉన్నారు!"

ఆమె హృదయం ద్రవించింది. కాని మాట్లాడలేదు. మాట్లాడినా అతనికి వినపడదు.

క్వాసిమోడో నిట్టూర్పువిడిచి అన్నాడు: "ఈనాటివరకూ నే నెంత వికృతంగా ఉన్నానో నాకే తెలియలేదు. మీతో నన్ను పోల్చుకుంటే నా కెంతో బాధ కలుగుతోంది. మీకళ్ళకి నేనొక మృగంలా కనపడుతున్నా ననుకుంటాను. మీరో నా కళ్ళకి సూర్యకాంతిలా, తుషార బిందువులా, కోకిల పాటలా కనపడుతున్నారు. నేను మనిషినీకాను, మృగాన్నీ కాను. నాది ఒక ఆకారమని చెప్పలేను. దేవుడు నన్ను ముద్దగాపిండి కుమ్మి ఈ విధంగా చేశాడు."

అతనికి నవ్వు వచ్చింది. నవ్వు ఇంత హృదయవిదారకంగా ఉంటుందని చూసి ఆమె చకితురాలైంది.

తరవాత ఇలా చెప్పాడు. "నాకు చెవుడు. కాని మీరు సంజ్ఞలతో నాకు చెప్పండి. నాతో అలా మాట్లాడే యజమాని ఒకరున్నారు. మీ సంజ్ఞలవల్ల, పెదవుల కదలికవల్ల, మీ చూపువల్ల నేను మీ అభిప్రాయం గ్రహించగలను."

"అయితే ఇది చెప్పు" అందామె. "నువ్వు నన్నెందుకు రక్షించావు?"

ఆమె మాట్లాడుతున్నప్పుడు ఆమె ముఖంలోకి అతి జాగ్రత్తగా చూశాడు.

"తెలిసింది. మిమ్మల్ని ఎందుకు రక్షించానని అడుగుతున్నారు. ఒకనాటి రాత్రి మిమ్మల్ని ఎత్తుకుపోవాలని ప్రయత్నించిన వాణ్ని మీరు మరిచిపోయారు. ఆ మరునాడే వాడు కొరత మీదుండగా దాహంతీర్చి ఉపకారం చేశారు. ఆ సమయంలో లభించిన ఒక్క నీటిచుక్క, ఒక్క జాలిచూపు—వానికోసం నా జీవితాన్ని త్యాగంచేసినా ఋణం తీర్చుకోలేను. వాడి అపకారాన్ని మీరు మరిచిపోయారు. కాని వాడు మీ ఉపకారాన్ని ఆజన్మాంతం మరిచిపోడు."


ఆ మాటలు వినేసరికి ఆమె కనుకొలకులలో నీరు నిలిచింది. అతని ఒక కంటిలో చివర—ఒక నీటిబిందువు నిలిచింది. కాని అది జారిపడలేదు. హృదయసంతాపాన్ని అతడు అణుచుకున్నాడు.

"ఇటువినండి. ఇక్కడ చాల ఎత్తైన గోపురాలున్నాయి. అక్కడనుంచి కిందికి పడ్డవాడెవడూ బతకడు. వెంటనే ఒళ్లు ముద్దయి చచ్చిపోతాడు. నన్ను తొలిగించుకోవాలని మీకు తోచినప్పుడు, నాతో చెప్పండి ఆమాట. అక్కడనుంచి కింద కురికేస్తాను. మీ నోటిమాట ఒక్కటి చాలు; ఒక్కచూపైనా చాలు, మీ ఆజ్ఞ వెంటనే పాలిస్తాను."


క్వాసిమోడో వెళ్ళిపోడాని కుద్యుక్తుడయ్యాడు. అతడిపట్ల ఆమెకి అపారమైన కరుణ కలిగింది. అక్కడే ఉండమని సంజ్ఞ చేసింది.

"కాదు కాదు" అన్నాడు క్వాసిమోడో. "నే నాట్టే సేపుండకూడదు. నే నుండలేను. నామీద జాలివల్లనే మీరు ముఖం పక్కకి తిప్పుకోడంలేదని నాకు తెలుసు. మీ కంటపడకుండా నేను మిమ్మల్ని నిత్యం చూస్తూ ఉండగలచోటు చూసుకుంటాను. అదే మంచిది" అంటూ జేబులోనుంచి ఒక ఈలతీసి గుమ్మంలో ఉంచాడు. "ఇది తీసుకోండి. నన్ను పిలవాలనుకున్నప్పుడు ఇది ఊదండి. ఈ ఈల నాకు వినపడుతుంది" అని చెప్పి వెళ్ళిపోయాడు.

(యింకా వుంది)



శోభనావారి 'రాజీ—నా ప్రాణం'లో టి. ఆర్. రామచంద్రన్.



'మా అమ్మ చచ్చిపోవాలా' అని వైకుంఠం పీకపట్టుకున్నాడు సత్యం:
సారథీవారి 'అంతా మనవాళ్ళే' చిత్రంలో.

"అంతా మనవాళ్ళే!!"

'సారథీ ఫిలిమ్సు'వారు విడుదలచేసిన ఈ చిత్రం, తెలుగు చలనచిత్ర పరిశ్రమలో ఒక నూతనాధ్యాయానికి నాంది 1954 ఆరంభంలోనే ఈచిత్రం బయటికి రావటం శుభసూచకం

బాక్సాఫీసు సిద్ధాంతాలంటూ మన చలన చిత్రపరిశ్రమరంగంలో వ్యాపించి, కళారంగాన్నే గాక, అనేక లక్షుల సర్వనాశనంతో ఆర్థికరంగాన్ని కూడా కూకటివేళ్లతో కూలదీసిన మూఢ విశ్వాసాలన్నిటినీ ఈ చిత్రం ఛిన్నాభిన్నం చేసివేసి, మన పురోగమనానికి రాజబాటను సూచిం చుతున్నది.

మున్ముందు బాక్సాఫీసు సిద్ధాంతాలనే ఆ మూఢవిశ్వాసాలేమిటో తెలుసుకుంటే గాని ఈ చిత్రం సాధించిన పరమప్రయోజన మేమిటో మనకు బోధపడదు ఆ మూఢ విశ్వాసాలు

(1) లక్షలాది ధనం తగలబెడితే గాని డబ్బు రాదు.

(2) విజ్ఞానంతో సంబంధం లేని వినోద మనేది ఒకటుంది ప్రజలకు వినోదాన్ని అందజేయాలే గాని విజ్ఞానాన్ని అందజేయటానికి పూనుకుంటే డబ్బురాదు.

(3), వాస్తవిక జీవితాన్ని చిత్రించితే కళ రక్తిగట్టదు స్వర్గ మర్త్య పాతాళ

లోకాలకు భరాట్లు తిరిగే ఏ అభూతకల్పనో వుంటేనేగాని డబ్బురాదు.

(4) అసలు కథ అంతప్రధానం గాదు; పది డాన్సులూ, పది పాటలూ, మీదు మిక్కిలి సర్కసు ఫీట్సూ వుండాలి. వీటి కోసమే జనం మొగబడతారు.

(5) అన్నిటికంటె ప్రధానం సెక్సు ఫీలు. ఆడపాత్రలను ఎంత నగ్నంగా ప్రదర్శించగలిగితే అంత డబ్బు వస్తుంది. కామోన్మాదంతో మదించి కొట్టుకుంటున్న నాయికా నాయకుల ప్రేమ గాథ లేంది డబ్బు రాదు.

(6) స్త్రీపాత్రలకు, సహజమైనవి గాని, పెట్టుడువి గాని స్థూలమైన స్తన జఘనా లుండాలి; వీలైనంత నగ్న స్థితిలో క్లోజప్‌లు తీసి వాటిని తెరమీద పారేస్తూవుంటేగాని జనం ఉవ్విళ్లూర మెచ్చుకోరు.

(7) ప్రతిభవున్నా లేకపోయినా, పూర్వం యేదైనా ఒక [illegible]త్తచిత్రంలో నటించి వేలుగుమ్మరించితేగాని రానని చెట్టెక్కి కూర్చున్న నాటుతారను ఒకామెను లంకించుకుంటేగాని డబ్బురాదు.

(8) కొత్త నటీనటులవల్ల డబ్బురాదు.

(9) ప్రపంచ జ్ఞానము కళా నిర్మాణ దక్షతా వున్న రచయిత యెవడేనా పైన వివరించిన సూత్రాలను అంగీకరించడు గనక అలాంటివాణ్ణి చేరనివ్వగూడదు.

(10) అవసరమున్నా లేకపోయినా పెద్ద పెద్ద సెట్టింగులు ఒక డజనైనా తయారుచేసి జనాన్ని హడలగొట్టాలి

(11) డబ్బు తక్కువ ఖర్చయితే గొప్ప చిత్రం కాదనుకుంటారేమో గనుక ఎక్కువ డబ్బు తగలేసి, తగలేశామని ప్రచారం చెయ్యాలి.

(12) రెండు మూడు కాపీలు మాత్రమే తీసి ఒక థియేటరు తరువాత ఒక థియేటరులో ప్రదర్శించ బూనుకుంటే ఈలోగా యేమి మునుగుతుందో గనుక చిత్రం బాగున్నా బాగుండకపోయినా డబ్బు తగలేసి వందలాది కాపీలు తయారుచేసి అన్నిచోట్లా ఒకేసారి ప్రదర్శించి అయోమయ స్థితి కల్పించాలి.

ఈ ద్వాదశ సూత్ర ప్రణాళికను పురస్కరించుకుని గత మూడు నాలుగు సంవత్సరాల లోనూ అనేక చిత్రాలు తయారుకావటమూ, వాటిలో చాలకి కొంతదినాలు చిత్రాలు పేర్లు గుర్తావస్తాయి ఒకదాని తరువాత ఒకటి నాశనమై అనేకమంది నిర్మాతలు బోర్డులు ఫిరాయించేయ్యటమూ తెలుగువారి చేతుల్లో వున్న పరిమితమైన పెట్టుబడి ఈరకంగా కర్పూరావుడి అయిపోయి అధ్వాన్న స్థితి యేర్పడటమూ పాఠకులకు విదితమైన సంగతే. ప్రజలంతా మూర్ఖులనే మూఢవిశ్వాసంతో, ప్రజల్ని అగౌరవపర్చటానికి పూనుకోవటమే ఆయా నిర్మాతలు చేసిన పొరపాటు. అందుకు తగిన ఫలితాలను అందుకోక తప్పిందిగాదు.

మూడు వారాల పైచిలుకుగా విడుదలై ప్రజల మన్నన లందుకుంటూ నిర్మాతలకు



“ఆగ్ కా దర్యా”లో కరణ్ దివాన్, మీనా.

ఇతోధికంగా డబ్బు నార్జించి పెడుతున్న "అంతా మనవాళ్ళే" అనే యీ చిత్రం పైన వివరింపబడిన బాక్సాఫీసు సిద్ధాంతాలన్నీ వట్టి విభ్రాంతులనే విషయాన్ని విస్పష్టం చేసింది. మన ఫిలింపరిశ్రమ పురోగమనానికి వెలుగుబాటను సూచించుతోంది.

(1) ఇది చాలా పరిమితమైన పెట్టుబడితో నిర్మించబడిన చిత్రం.

(2) విజ్ఞాన ప్రబోధమే పరమాశయంగా నిర్మించబడినహర్షదాయకమైన కళాఖండం.

(3) వాస్తవిక ప్రజాజీవిత చిత్రణ.

(4) బలవత్తరమైన కథా సంవిధానం. అందుకు అనుగుణమైన పాటలు. పాతవాసన వదలక రెండు వెర్రిడాన్సులు వీరుకూడా యిరికించారు. ఆరెంటిలో ఒక బలమైన కళగాని సౌందర్యంగాని లేదు. వాటిని చిత్రానికి గల గుణబాహుళ్యంలో వీటిని ఉపేక్షించుతున్నారు అంతే. సర్కసు ఫీట్సు లేవు.

(5) సెక్సప్పీలు ప్రయత్నం లేదు. అర్ధనగ్నంగా ఆడపాత్రలను ప్రదర్శించలేదు. కామోన్మాదంతో కొట్టుకుంటున్న నాయికా నాయకుల ప్రేమగాథ కానే కాదు.

(6) ఆడపాత్రల స్తన జఘనాల క్లోజప్‌లు లేవు.

(7) వేలుగుమ్మరించి, చెట్టుమీదినుంచి దించుకొచ్చిన పాతతార లెవరూ లేరు. సి. యస్. ఆర్., ఎస్. వి. రంగారావులను మినహాయించితే ప్రధాన పాత్రలను నిర్వహించిన నటీనటులంతా యించుమించు క్రొత్తవారే.

(8) ఈ క్రొత్త నటీనటులవల్ల డబ్బు వస్తోంది.

(9) కథను నిర్మించినవారెవరో, పలువురో ఒకరో మనకు తెలియదుగాని; ప్రజాజీవితాన్ని నిశితంగా అవగతం చేసుకున్న పరిజ్ఞానం పుష్కలంగా దీన్లో ద్యోతమానమౌతోంది.

(10) పెద్ద సెట్టింగులు లేనేలేవు.

(11) ఆటోపంకోసం డబ్బు తగలవేసిన చిత్రం కాదు.

(12) ఎన్ని కాపీలు తయారుచేశారో మనకు తెలీదుగాని, ఈ చిత్రానికి ప్రజలు ఎప్పుడైనా డబ్బు ఇచ్చేదే గనుక, ఎక్కువ

"అంతా మనవాళ్లే!!"

కాపీలు తీసి కొంత డబ్బు తగలవేసివుంటే, పాతవాసన వదిలించుకోలేని అవ్యక్తమే.

ఇంతకూ చెప్పవచ్చింది యేమిటంటే శాస్త్రాఫీసు సిద్ధాంతాలు అని చెప్పబడే వాటిలో ఏ వొక్క సూత్రాన్నీ వీరు ఈ చిత్రంలో పాటించలేదు. అయినా ఉత్తమ చిత్రంగా పేర్కొనదగిన ఒక సర్వాంగసుందరమైన కళాఖండాన్ని నిర్మించి ప్రజల మన్ననలతోపాటు డబ్బును కూడా గడించుకోగలుగుతున్నారు. అందుచేత, చలనచిత్రరంగంలో మన్ని పట్టుకు వేధించుతున్న దౌర్భాగ్యస్థితి తొలగిపోయి ఒక క్రొత్తమార్గం తొక్కే అవకాశం యేర్పడ్డదని అనుకోవలసివస్తోంది. ఇవి పరిశ్రమ పురోగమనానికి సంబంధించిన విషయాలు.

ఇక కళావిన్యాస విషయాల పరిశీలనకు అనువుగా కథాసంవిధానాన్ని టూకీగా చెప్పుకుందాం.

కథాసంగ్రహం

మనవాళ్లు మనవాళ్ళంటూనే కొంప కార్చేస్తారు కొందరు. అలాంటి రాకయే జగన్నాధం; పెద్దమనుషుల జాపితాలో వాడు; భవానీపురంజిల్లా కోపరేటివు స్టోర్సు ప్రెసిడెంటు. అతనికంటె ఘనుడు ఆచంట మల్లన్న - వాడిమామ. చిదంబరం యింకొ రెండాకులు ఎక్కువ చదివినవాడు. 'రామచంద్రప్రభూ!' అంటూ కుటుంబాలకు కుటుంబాలనుకూల్చి పారేస్తాడు. వీళ్ళిద్దరికీ తగినవాళ్లు హరిజనహాస్టలు మేనేజరు పూర్ణయ్యా, మెడికల్ షాపు ప్రొప్రైటరు వైకుంఠం మార్వాడీసేటు - వీళ్ళంతా ఒక బృందం: జిల్లా కోఆపరేటివ్ స్టోర్సుకు డైరెక్టర్లు - పెద్దమనుషులు!

చిదంబరం తన కూతురు వరలక్ష్మి అంటే పడి చస్తాడు. ఈ మమకారాన్ని అవకాశంగా తీసుకుని అల్లుడు జగన్నాధం ఆయన ద్వారా లోకుల సొమ్మును అనేకవిధాల రాబట్టి దాంతో ఒక పెద్దమేడ కట్టడానికి పూనుకుంటాడు.

చిదంబరం అన్నకొడుకు సత్యం, పినతండ్రితోపాటు జగన్నాధం యింట్లోనే వుండి యింటరు చదువుతూ వుంటాడు. సత్యంతోపాటు జగన్నాధం కూతురు గిరిజ కూడా చదువుతూవుంటుంది వట్టి రిజాలా మనిషి; ఐశ్వర్యమదంతో అదిరిపడుతూ వుంటుంది; 'నను కాదని ఎవరనగలరు?— పలుగాకులు కూసిన బెదురా?' ఇదీ దాని తత్వం; తాతదగ్గిర డబ్బుకొట్టుకుపోయి పూర్ణయ్య కొడుకు గౌరీపతితో జల్సా చేస్తూవుంటుంది. ఇలాంటివన్ని సత్యానికి నచ్చని కారణం చేత ఒకే యింట్లో వుంటున్నా, యిద్దరికీ పొత్తు కుదిరిందిగాదు.

సత్యం తండ్రి చనిపోయాడు; తల్లి రత్తమ్మ అమాయకురాలు; ఎనిమిదేళ్ళ ఆడపిల్ల శారదను పెట్టుకుని స్వగ్రామంలోనే వుంటుంది. సత్యానికి కుర్రతనం, చదువూ, పరీక్షలూ, యీ గొడవలు తప్ప యింటి వ్యవహారాలు పట్టించుకునేవాడు గాదు. రత్తమ్మ అసలు యేమీ తెలియని అమాయకురాలు. అందుచేత సర్వ వ్యవహారాలనూ మరిది చిదంబరానికి వప్పగింత చేసేసి నమ్మి వూరుకుంది. చివరికి పవర్నామాపట్టా కూడా వ్రాసి యిచ్చేస్తుంది. చిదంబరం, రత్తమ్మకు రావలసిన బాకీలు వేలకు వేలు వసూలు చేసి, కూతురు పేర కట్టిస్తున్న మేడకు పెట్టేస్తూ వుంటాడు. చివరికి పవర్నామా పట్టా వినియోగించి రత్తమ్మ యిల్లు కూడా తాకట్టు పెట్టేసి పెద్ద మొత్తం అప్పు తీసి కూతురు మేడ పూర్తి చేసేస్తాడు.

కొత్త మేడలో కూతురూ అల్లుడూ గృహప్రవేశం కావటంతో జనంలో అనుమానాలు బయలుదేరతాయి. చిదంబరం పెట్టిన పసుపుకంపెనీ వాటాదార్లూ, అప్పలిచ్చిన యితర బాకీదారులూ చిదంబరాన్ని వత్తిడు చేస్తారు. జగన్నాధం సలహాతో, అప్పలవాళ్లకళ్ళల్లో దుమ్ముకొట్టి చిదంబరం తెల్లవారేసరికి పరారీ చిత్తగిస్తాడు. భవానీపురం అంతా గగ్గోలయి పోతుంది.

మార్వాడీసేటు రత్తమ్మ వూరువెళ్ళి తనఖాబాకీ చెల్లించమంటాడు. సెలవులకు యింటికివచ్చిన సత్యం, రత్తమ్మ, రత్తమ్మ సోదరుడు భద్రాచలం యీ బాకీ యేమిటని విస్తుపోతారు. సంగతంతా తెలుసుకుని నెత్తీ నోరూ మోదుకుంటారు. ఏమి చెయ్యటానికీ దోవలేక ఉన్నదీ మన్నదీ మార్వాడికి వప్పగింత చేస్తారు.

సత్యం చదువుమానేసి జగన్నాధం అధ్యక్షుడుగావున్న కోపరేటివుస్టోర్సులో గుమాస్తాగా చేరవలసివస్తుంది. అక్కడచేరిన దగ్గిర నుంచీ, అక్కడజరిగే మోసమంతా చూసి సత్యానికి విభ్రాంతి కలుగుతూ వుంటుంది.

రత్తమ్మనూ శారదనూ చూస్తూ వుంటానని చెప్పి సత్యం మేనమామ భద్రాచలం వాళ్ళిద్దర్నీ గ్రామానికి తీసుకువెడతాడు— అయినవాడుగా.

భవానీపురంలో 'కాగడా' అనే పత్రిక వుంటుంది; ఆ పత్రిక జగన్నాధం ముఠా చేసే అక్రమాలన్నిటినీ బయటపెడుతూ వుంటుంది. ఆ పత్రిక సంపాదకుడు రావుగారి కుమార్తె విమలకూ సత్యానికీ కాశీలో స్నేహం యేర్పడ్డది.

తమ రహస్యాలనన్నిటిని 'కాగడా' బయటపెడుతూవుండటంతో; జగన్నాధం ముఠా సత్యమే దీనికంతకూ కారకుడను కుంటారు. అతనికి ఉద్వాసన చెప్పించటానికి చూస్తూవుంటాడు.

అక్కడ గ్రామంలో, రత్తమ్మ నిస్సహాయస్థితిని అవకాశంగా తీసుకుని భద్రాచలం, తన వెర్రికొడుకు అంజికి, శారదను రహస్యంగా గ్రామఫోను పెట్టి మేళంతో పెళ్ళిచేస్తాడు. ఈ సంగతి తెలిసి రత్తమ్మ గగ్గోలుపడి యేడుస్తుంది. దిక్కుతోచక సత్యానికి కబురుచేస్తుంది. సత్యం వెళ్ళి శారద మెళ్ళోవున్న మంగళసూత్రం తెంచి అవతల పారేసి శారదనూ, తల్లినీ భవానీపురం తీసుకువచ్చేస్తాడు.

సత్యాన్ని వదిలించుకోటానికి ప్రయత్నించుతున్న జగన్నాధానికి ఒకనాడు ఒకసాకు దొరుకుతుంది. గిరిజ గౌరీపతిని వెంటేసుకుని స్టోర్సుకు వెడుతుంది. తనకు ఒక యాభై రూపాయలు యిమ్మంటుంది. ప్రజలసొమ్ము గనుక అలా యివ్వటానికి వీల్లేదంటాడు సత్యం ఆ సంగతి విని జగన్నాధం మండిపడతాడు. సత్యాన్నీ, రత్తమ్మనీ, శారదనీ యింట్లోనుంచి వెళ్లగొట్టేస్తాడు.

ఈ దిగుళ్ళతో రత్తమ్మ మనాదిబడి మంచమెక్కింది మరణావస్థలోవుంటుంది సత్యం మందు కొనటానికి వైకుంఠం మందులషాపుకు వెడతాడు. అతను మందు ఇవ్వకపోగా 'కాగడా' వారి నడకమని పరిహాసం చేస్తాడు. 'మీ అమ్మ చస్తే చావనీ' అంటడు. దాంతో సత్యానికి వళ్లు మండిపోయి దెబ్బలాడతాడు. వైకుంఠం సత్యాన్ని పోలీసులచేత పట్టిస్తాడు.

సత్రంలో తల్లి చచ్చిపోతుంది. శారద కంగారై సత్యాన్ని వెతుక్కుంటూ ఊరివెంట కాలుగాలిన పిల్లిలా తిరిగి గాలిస్తూ వుంటుంది.

పోలీసులు వదిలిపెట్టినతరువాత సత్యం సత్రానికి తిరిగివచ్చి సంగతంతా తెలుసుకుని చెల్లెల్ని వెదకటానికి బయలుదేరతాడు యిద్దరూ చెరోదారీ అవుతారు.

ఊరివెంట తిరుగుతూ శారద కారుక్రింద పడుతూవుండగా ఒక బిచ్చగత్తె రక్షించుతుంది. అప్పటినుంచీ శారద ఆ బిచ్చగత్తెతోనే వుంటుంది.

కాగడా పత్రిక జగన్నాధం ముఠా రహస్యాలను బయటపెట్టడంచేతనే; తనకిన్ని యిబ్బందులు కలిగాయని సత్యానికి ఒక వెర్రి ఆలోచన కలుగుతుంది. ఆఫీసుమీదకు దెబ్బలాటకు పోతాడు. రావుగారూ విమలా

(55-వ పేజీ చూడండి)

★ 'రాజీ నా ప్రాణం'

(తెలుగు)

నిర్మాతలు: జెమిని.
డైరెక్షన్, సినేరియో: కె. జె. మహాదేవన్.
మాటలు, పాటలు: దేవులపల్లి కృష్ణ శాస్త్రి.

నటీనటులు: శ్రీరంజని, టి.ఆర్. రామచంద్రన్, శ్రీరామ్, యస్. వి. రంగారావు మొదలైనవారు.

ఇల్లూ వాకిలీ లేక, జీవనాధారం లేక తిరిగే ఒక యువకుడు అంధురాలైన ఒక పేద యువతిని ప్రాణంగా ప్రేమించి ఉద్ధరించాలని పాట్లు పడితే మంచిచెడ్డలు కానలేని ధనికుల అకృత్యాలవల్ల అతడి కెటువంటి తిప్పలు వచ్చినదీ హాస్యకరుణరసాలు ఉట్టిపడేలా చిత్రించబడింది. ప్రఖ్యాతమైన ఇతివృత్తాన్ని తీసుకుని, బస్తీలలో పేదల జీవితాన్ని కరుణరసాత్మకంగా చిత్రిస్తూ, హాస్య సన్నివేశాలను కథతో సమన్వయించి, పాత్ర నిరూపణలో చక్కని నేర్పుచూపి, ఉన్నతాదర్శాలతో ఈచిత్రాన్ని నిర్మించిన జెమినీ అధిపతులు అభివందనీయులు. జనవరి 29 వ తేదీని విడుదలైన ఈ చిత్రాన్ని 27 వ తేదీని జెమినీ స్టూడియోలో పత్రికాప్రతినిధులకు చూపారు.

కథాంశం ఇది:

జీవనాధారంలేని పేద యువకుడు రాము (టి.ఆర్. రామచంద్రన్) ఒకనాడు కారు కింద పడబోయిన రాజీ అనే అంధ యువతిని రక్షిస్తాడు. పువ్వులమ్ముకుంటూ మేనత్త(సురభి కమలాబాయి)పైన ఆధారపడే ఈ అంధురాలిపైన రాముకు అపారమైన కరుణ అనురాగం జనిస్తాయి. వెయ్యి రూపాయలు ఖర్చుచేసి ఆపరేషన్ చేయిస్తే రాజీకి తిరిగి చూపు వస్తుందని డాక్టర్ రఘు (శ్రీరామ్)వల్ల తెలుసుకుని రాము ధనార్జనకోసం కృషిచేస్తాడు. పందెముష్టియుద్ధంలో గెలిచిన వెయ్యి రూపాయిలూ దొంగలపాలౌతుంది. తాగి ఒళ్ళు మరిచిన ఒక ధనవంతుని సహాయంవల్ల వెయ్యి రూపాయిలూ సంపాదించి డాక్టరుకిచ్చి రాజీకి ఆపరేషన్ చేయిస్తాడు. కాని ఒళ్లు తెలుసుకున్న తరవాత ధనవంతుడు తన ధనం అపహరించాడని రామును ఖైదులో పెట్టిస్తాడు. ఆపరేషన్ చేశాక రాజీకి చూపు వస్తుంది. రాముకోసం ఎంత వెతికినా ఫలితముండదు. మేనత్త జబ్బుతో తీసుకుని చనిపోతుంది. ఉన్న పూరిల్లుగల యజమాని వర్తన మంచిది కానందువల్ల అతని భార్య రాజీని ఇంటిలోనుంచి తరిమివేస్తుంది. రాజీ సముద్రంలో పడి ఆత్మహత్య చేసుకోవాలని ప్రయత్నించగా డాక్టర్ రఘు తల్లీ చెల్లెలూ రక్షించి ఆమెను ఇంటికి తీసుకుపోతారు. అక్కడ డిస్పెన్సరీలో నర్సుగా చేరుతుంది రాజీ. రాముని మరిచిపోకపోయినా, ఇంక అతను తిరిగి కనిపిస్తాడనే ఆశ పూర్తిగా పోయినతరవాత డాక్టర్ తల్లి ప్రబిమాలగా రాజీ డాక్టర్ రఘును పెళ్ళిచేసుకుంటుంది. దొంగతనానికి రెండేళ్లు, తరవాత తప్పించుకుపారిపోడానికి ప్రయత్నించినందుకు మరి మూడేళ్లు కఠినదరకం అనుభవించి, తప్పించుకోచూసినప్పుడు తుపాకిదెబ్బవల్ల కాలు కుంటిపడగా ఊతకర్రలపైన ఆనుకుని రాజీని చూడ్డానికి వస్తాడు రాము. రాజీ సుఖంగా పెళ్ళిచేసుకుని హాయిగా బ్రతుకుతున్నదని కళ్ళారా చూసి తృప్తితో వెళ్ళిపోతాడు.

ఈ చిత్రంలో అనేక సన్నివేశాలలో పేదలను సామాజిక పరిస్థితు లెలా బాధిస్తాయో చక్కగా నిరూపించబడింది. ధనికుల చలచిత్తమూ అనాలోచిత కృత్యాలూ, వానివల్ల ఇతరులకు కలిగేబాధలూ బాగా చిత్రించబడినాయి. కథానాయకుడుగా టి. ఆర్. రామచంద్రన్ హాస్యరసాన్ని చక్కగా పోషించాడు. శ్రీరంజని, రంగారావు మొదలైనవారు ఆ యా పాత్రల్ని సమర్థతతో నిర్వహించారు.

ఆఖరు ఘట్టంలో క్లిష్టమైన సమస్యాపరిష్కారంలో ప్రధానపాత్రలను ఉన్నతస్థాయిలోకి తేగలిగిన కథకుని కల్పన ప్రశంసనీయం. పేదవారిపాట్లు ఇతివృత్తంగా, వినోదం ప్రధానంగా నిర్మించబడిన ఈ చిత్రం తప్పకుండా సర్వజనాదరణీయం కాగలదు. ★

గేవాకలర్ చిత్రం

'మయూర్ పంఖ్' (హిందీ)


నిర్మాతలు: సాహు ఫిల్మ్స్.
డైరెక్షన్, కథ, మాటలు: కిశోర్ సాహు.
గేవాకలర్ ఫోటోగ్రఫీ: ఆంద్రీ థామస్.
పాటలు: హస్రత్ జైపురి, శైలేంద్ర.
సంగీతం: శంకర్, జైకిషన్.
ప్లేబాక్: లతామంగేష్కర్, ఆశాభోస్లే.

నటీనటులు: కిశోర్ సాహు, సుమిత్రాదేవి, ఆడెట్ ఫెర్గుసన్ మొదలైనవారు.


నెమలికన్నులోని రంగులవలె మెరిసే గేవాకలర్లో భారతదేశంలోని కొన్ని రామణీయకదృశ్యాల్ని చూపుతూ నిర్మించిన కథాచిత్రం మయూర్ పంఖ్. అయితే కథకు నెమలికన్నులతో నిమిత్తం లేకపోలేదు. నెమలియీకలతో చేసిన విసనకర్రనొకదాన్ని కథానాయకుడు రంజిత్ (కిశోర్ సాహూ) తాను ప్రేమించిన పాశ్చాత్య యువతి జోన్ డేవిస్ కి బహుమతి ఇస్తాడు. నెమలియీకలు అదృష్టం లభింపచేస్తాయని అత డామెతో చెప్తాడు.

భారతదేశాన్ని చూడవచ్చిన మిస్ జోన్, (ఆడిట్ ఫెర్గుసన్) నవలారచయిత, సంచారం చేస్తూ దారిలో ఒకరాత్రి ఒక అడవిలో చిక్కుపడగా సహాయం చేస్తాడు రంజిత్. ఆమెను చూడగానే ప్రేమిస్తాడు. తరవాత కాశీలో ఆమెను కలుసుకుని అక్కడి స్నానఘట్టాలు, దేవాలయాలు, వినోదాలు చూపుతాడు. అక్కడి బజార్లలోనే నెమలియీకల విసనకర్రకొని ఆమెకు బహుమతియిస్తాడు. ఆపైన తిరిగి ఆగ్రాలో తాజ్ మహల్ వద్ద కలుసుకుని ఆమెకు తన ప్రేమను వెల్లడిస్తాడు. ఆమె అంగీకరిస్తుంది. తరువాత ఆమెను పులివేటకు తీసుకు వెడతాడు. అడవిలో ఏనుగుపైహౌదాలోనుంచి ఆమె పడిపోగా రంజిత్ దూకి ఆమెను రక్షిస్తాడు. వేట సమయంలోనే వీరిద్దరినీ గమనించిన ఒక డాక్టర్ రంజిత్ వివాహితుడని మిస్ జోన్ కి తెలియపరచగా ఆమె భంగపడి రంజిత్ తో చెప్పకుండా వెళ్ళిపోతుంది. తిరిగి దైవవశాత్తు జైపూర్ లో రంజిత్ చెల్లెలి వివాహసందర్భంలో కలుసుకుంటారు. అక్కడ రంజిత్ కు అనుకూలవతియైన భార్య శాంతను (సుమిత్రాదేవి) చూసి మిస్ జోన్ ఆమెపట్ల సానుభూతితో తన ప్రేమను విడనాడుకుని వెళ్ళిపోతుంది. రంజిత్ ఆమెను మరువకపోయినా భార్యకు అనుకూలుడై మనసు మార్చుకుంటాడు. ఇది కథాంశం. ఒకపాశ్చాత్యవనితకీ, జైపూర్ కి చెందిన ఒక ధనవంతునికీ మధ్య ప్రేమ ఆధారంగా కిశోర్ సాహూ స్వయంగా రచించిన ఈ కథలో పసలేకపోయినా గేవాకలర్ లో చూపిన ప్రసిద్ధనిర్మాణాలు, కథాంశానికి సంబంధించిన వివిధదృశ్యాలు కన్నుల పండువుగా ఉంటాయి. ఈ చిత్రంలో తాజ్ మహల్, కుతుబ్ మినార్, హవామహల్ (జైపూర్), ఫతేపూర్ సిక్రీ, బొంబాయి మెరైన్ డ్రైవ్ మొదలైన దృశ్యాలు, పులివేట, ఏనుగుల హౌదాలలో సవారీ రమ్యంగా ఉన్నాయి. నాలుగు నృత్యఘట్టాలు ఆరు చక్కని పాటలు ఉన్నాయి.

ఇంగ్లీషు, హిందీ భాషలలో తీయబడిన ఈ చిత్రానికి పాశ్చాత్య దేశాలలో విశేషాదరణ లభించగలదు. ★



ధ్యానావస్థ: రేచక (ముక్కుచివర చూపు)



ధ్యానావస్థ: పూరక (ముక్కుచివర చూపు)

యోగాసనములు-దేహారోగ్యము

2

వయస్సుకు తగిన యోగాసనములు

మొదటి వ్యాసములో యోగాసనములకూ, దేహారోగ్యమునకూ గల నికట సంబంధమునుగురించి చెప్పుతూ, వాటి నభ్యసించు అధికారము అందరికీ అనాదినుండియే ఉంటున్నది అనీ, ఉదాహరణకై ప్రతిక్రియాసనముతో చేర్చి పశ్చిమ తానాసనము చేయు క్రమమునూ, తత్ఫలమునూ వర్ణించితిని.

ఇప్పుడు స్త్రీపురుషుల వయస్సుకు అనుగుణమైన యోగాసనములను, ఆవయస్సులో సర్వసాధారణమగు రోగములను పోగొట్టుటకు యోగ్యమైన మరికొన్ని యోగాంగ సాధనలనూ వివరించెదను.


మానవుల ఆయుస్సు పురాతనకాలములో ఎంత ఉండేది? ఇపుడంత లేదా? తగ్గిపోవుటకు కారణమేమి? హెచ్చించుట సాధ్యమా? వీటికి సమాధానము నిచ్చుచూ స్త్రీపురుషుల పరిపూర్ణాయుస్సును చర్చించి యోగాంగ సాధనలను ఏలాగు ఉపయోగించవలెను మొదలగు విషయము లిక్కడ వివరించుట అసందర్భము గాదని తలచుచున్నాను.

శ్రీ టి. కృష్ణమాచారి


మరియు యోగశాస్త్ర సంప్రదాయమునకు అనుగుణముగా పై అంశములు చెప్పకపోతే, ఆయా వయోధర్మాలకు లోబడిన పామరులే గాక పండితులకూ అనేక సందేహాలు కలిగి, యోగాంగసాధన, తత్ప్రచారములు కుంఠితములు కాగలవు.

మానవుని ఆయుఃపరిమితిని వర్ణించుచూ జ్యోతిష్కులు 100-120 అంటూ, వారివారి ప్రాచీనకర్మానుసారమైన గ్రహగతుల సమవిషమభావములనుబట్టి స్త్రీలు పురుషులు అను వ్యత్యాసము లేక, అందరినీ అల్పాయు, మధ్యాయు, దీర్ఘాయు అని విభజించిరి. ఆయుర్వేద రహస్యములను ఆమూలాగ్రము తెలుసుకొన్న వైద్య విద్వన్మణులూ ఈ పాటనే పాడిరి. వైదిక ధర్మానుయాయులుకూడ ఈ శ్రుతినే సరిజేసి పెట్టుకొని "శతమానం భవతి శతాయుః పురుషః శతేంద్రియః ఆయుష్యేవేంద్రియే ప్రతితిష్ఠతి" అని తాళాలు కొట్టుతూ ఘనపాఠులైరి.

వేదాంతులు విరక్తిమార్గాన్ని బోధించుతూ "మన కెందుకు ఈగొడవ! ఎన్నాళ్లు బ్రతికినా చావు తప్పదుగదా? మరి, ఏదో బ్రతికినన్నాళ్లూ రోగము లేక ఋణాలు



సాలంబ సర్వాంగాసనం.



యోగాసనములు - ఆరోగ్యము

చేయక శత్రువుల చేతికి చిక్కక దేవుణ్ణి భజిత్తాం" అని పలుకుతూ సరియైననిష్కర్ష చేయబూనలేదు. వీరు నిరాశా వాదులని చెప్పవచ్చు.

ఇంక యోగులు "మానవుని ఆయుఃపరిమితి ఇంతకే" అని నిష్కర్షగా చెప్పుట మిక్కిలి సాహసము; అపచారము కూడ. చావునే చంపి బ్రతుకును హెచ్చించుటకు దారిలేకపోలేగదా? పై చెప్పిన అవస్థలు "యావత్ బద్ధో మరుత్ దేహే యావత్ చిత్తం నిరాకులమ్। యావత్ దృష్టిః భ్రువోర్మధ్యే తావత్ కాలభయం కుతః (హ. యో. ప్ర. ఉ. 2. శ్లో. 40) అనగా మనము మన ప్రాణవాయువు నెన్నాళ్ళు హృదయకోశములో నిలుపగలమో, ఎంతమట్టుకు మనస్సును వ్యాకులతకు లోబడకుండ స్థిరపరచుకొనగలమో, ఎంతవరకు రెండు కండ్ల చూపులనూ ఒకటిగా చేర్చి కనుబొమ్మల మధ్య పెట్టి చూడగలమో, అంతవరకు మనకు మృత్యుభయ మెక్కడిది? లేనే లేదు. అది సాధకుని ఆజ్ఞాధీనమనుచూ వారు మృత్యువును జయించిరి. శ్వేతాశ్వతరోపనిషత్ 2 వ అధ్యాయములో వేదాంతులుగూడ "న తస్య రోగా నజరా నమృత్యుః ప్రాప్తస్య యోగాగ్నిమయం శరీరం। లఘుత్వ మారోగ్య మలోలుపత్వం వర్ణప్రసాదం స్వరసౌష్ఠవం చ। గంధః శుభః మూత్రపురీష మల్పం యోగప్రవృత్తిం ప్రథమాం వదంతి" ఈ మొదలైన మంత్రములద్వారా ఘోషించిరి. గనుక మానవులెవరైననూసరే ఆశావాదులై మృత్యువును జయించు యోగసాధనల నభ్యసించవచ్చు. ఈ మంత్రార్థమును ప్రథమ వ్యాసములోనే వివరించియున్నాను గాన ఇంక వ్రాయుటనవసరము.

1. హృదయకుహరములో ప్రాణవాయువును స్థిరముగా నిలుపుటకు సాధనలు ప్రాణాయామములు.

2. మనస్సును వ్యాకులతకు గురికాకుండునట్లు చేయు సాధనలు సంయమములు, సవికల్పసమాధులు.

3. రెండు కండ్లచూపులనూ ఒకటిగా చేర్చి కనుబొమ్మల నడుమ పెట్టి చూచుటకు ఉపాయము త్రాటకము.

వీటి వివరణ మున్ముందు వ్రాయగలను.

యోగశాస్త్రములను చక్కగా చదివి ఆచరణద్వారా వాటి ఫలములను అనుభవించితే, మానవుల ఆయుస్సుకు ఒక మితి లేదని నిశ్చయమగును.

యోగాంగాభ్యాస బలముచేత సంపాదింపదగు ఆ అపరిమితమైన ఆయుస్సును మన ప్రాచీనపురుషులు లోకోపకారమునకై ఉపయోగించుచుండిరి. వారు యోగాంగములలో వివరింపబడిన "సంయమము" అనే అంతరంగ సాధనచేత పంచభూతములను, వాని వికారకరాళ ఘోరరూపములను జయించి, తేజోమయదేహులై అపరిమితాయుస్సును బొంది, అణిమాద్యష్టసిద్ధులను తమ అధీనములో నుంచుకొని అనాథ దీనదరిద్ర రోగులను రక్షించగలరను నీసంగతిని విశాలదృష్టితో పాతంజల-దర్శనములో మూడవ విభూతిపాదమును చూచిన వారికి మాత్రము వ్యక్తమగును. గాని అచట చెప్పియుండు విషయములను "ఉత్ప్రేక్ష" అని గాని, కాదని గాని అంటే వివాదాలు పెరుగగలవు. సాధకులు ఐతేగాని సాధనలోని శాంతిసంతోష సుఖములు అనుభవానికి రావు.

అట్టి సిద్ధయోగుల దృష్టాంతమునకై పురుషులలో వసిష్ఠ విశ్వామిత్ర అగస్త్య మార్కండేయ భీష్మాదులు,—

స్త్రీలలో అనసూయా, లోపాముద్రా, గార్గి, కాత్యాయనీ, మైత్రేయీ, బ్రహ్మవాదినీ మొదలగువారిని చూపవచ్చును.

ఇప్పటికీ మనలో నట్టివారు అపరిమితాయుస్సుతో బ్రతికి లోకక్షేమచింతనకై భగవద్భజన చేయుచుండేవారు లేకపోలేరు. అయితే మనము పెద్ద పట్టణములను చూచినామే గాని ప్రశాంతవాతావరణములో గల రహస్య స్థలములను చూడనేలేదు. ప్రకృతమును వదలినావనకండి. ప్రకృత విచారమునకు అనుపయోగమైన దేదీ నేను చెప్పలేదు.

ఇప్పటిస్థితినిబట్టి యోచించితే, మనము దైవదత్తమైన ఆ అపరిమితాయుస్సును బాల్య కౌమార యౌవనవార్ధక్యములను నాల్గు అవస్థలలో, అవినీతపుత్రునివలె తెలిసియో తెలియకనో చేయు అపచారములచేత బోగొట్టుకున్నాము. అనగా ఆయా వయస్సులకు మించిన కృత్యములను చేయుచు ఆయుర్దాయము బోగొట్టుకున్నాము.

నూరు లేక నూటయిరవై యేళ్ళ ఆయుస్సు యోగ్యమని భావించితే, ఏ వయస్సులో నెట్టి యోగాసనములు అథవా - యోగాంగములు యోగ్యములు అంటే, అది తెలదు పుట్టినది మొదలుకొని ఐదు సంవత్సరములవరకూ స్త్రీ పురుషులకు శైశవావస్థ (పసితనము). అపుడు ఆ శిశువులకు యోగాంగసాధనలో ఎలాటి అధి[illegible] కారము లేదు. కాని శిశువులకే విధివశము చేత పార్శ్వవాయువు మొదలగు కొన్ని రోగములు రావచ్చు. ఔషధాదులచేత నివి నివారణ కాకపోవచ్చు. అపుడు వాటిని నివారించుటకై అంగమర్దన, ఆకుంచన, ప్రసారణ మొదలైన విచిత్రమైన యౌగిక చికిత్సాక్రమములు కొద్దిగా విధింపబడినవి.

మనము వయస్సును మాత్రము గురిబెట్టుకొని యోగాంగముల నభ్యసించుట, అభ్యాసము చేయించుట మిక్కిలి ప్రమాదకరమని చెప్పక తీరదు. అంతకంటె ఏ వయస్సులో ఏరోగమున్నది? ఆ వయస్సుగలవారు స్త్రీలా? పురుషులా? కృశకాయులా? (సన్నని వారా?), లేక స్థూలకాయులా? (చాలా లావుగానున్నారా?) ఈ మొదలైన విశేష పరిస్థితులను కూడా గుర్తించి, ఆ వ్యక్తులకు, ఆ రోగములకు అవసరమైన యోగాంగాసనములలో శిక్షణనీయవలెను. గనుకనే ధ్యానబిందూపనిషత్తులో "ఆసనానిచ తావంతి యావంతో జీవరాశయః" అని పరమశివుడు పార్వతికి యోగరహస్యమును ఉపదేశించినాడు. అనగా "ఓ పార్వతి! ఎన్ని జీవు లున్నవో, అన్ని యోగాసనములున్నవి" అని చెప్పినాడు.

లావుగా, సన్నగా నుండు శరీరములను బట్టి యోగాసనసాధనలలో లంఘనక్రియా, బృంహణక్రియా అని పేరుగల రేచక పూరకముల విశేషసాధనలు చెప్పబడియున్నవి. "ప్రయత్న శైథిల్యానంత సమాపత్తి భ్యాం" (పా. ద. 2 పా. 47 సూత్రమును, వ్యాస భాష్య శ్రీ వాచస్పతి మిశ్ర రచిత తత్త్వ వైశారద్యము"

లంఘనక్రియ అంటే రేచకము, బృంహణ క్రియ అనగా పూరకము అని యోగుల సంకేతము. అందుకే ఆయుర్వేద వైద్యులు చెప్పినలంఘనము అంటే ఉపవాసము, బృంహణము అంటే మితభోజనము అనీ అర్థము చేసుకొనుట తప్పు.

లావుగా నుండువారు రేచకముతో బాహ్యకుంభకమును, సన్నబడి కృశించిన వారు పూరకముతో అంతఃకుంభకమునూ చేస్తూ యోగాంగసాధన చేయవలెనేగాని దానికి విరుద్ధముగా చేయకూడదు.

సామాన్యముగా మన ఆయుస్సును ఈ దిగువ చూపినరీతి విభజించవచ్చు:—

1	మొదలు	5	వరకూ	శైశవావస్థ.
5	,,	16	,,	కౌమారావస్థ
16	,,	25	,,	యౌవనావస్థా ప్రారంభము
25	,,	50	,,	[illegible]

50 ,, 75 ,, మధ్యావస్థ
75 ,, 100, 120 వార్థక్యావస్థ (ముసలితనము)

ఈ ఐదింటినీ మన ప్రాచీనులు అనుభవించిరి. ఇప్పటికీ కొంతమంది ఉండవచ్చు. అందరి విషయమునుగురించి నే చెప్పబూనలేదు. ఇంతేకాక మన ప్రాచీనపురుషులు, స్త్రీలూ "హేయం దుఃఖ మనాగతమ్" అని పా. వ. పా 2 సూ 16 లో చెప్పినట్లు, రోగము పీడించు సమయములో దాన్ని నివారించుటకై యత్నించుటకంటే, ఆ రోగము రాకుండుటకై తత్పూర్వభావిగానే కొన్ని యోగసాధనలను చేయుచుండిరి. గనుకనే అపరిమితాయుస్సు గలవారై యుండిరి. పురుగుబడిన సస్యఫలవృక్షములవలె రోగము తగిలిన శరీరమూ త్వరగా నశించి పోవునని ఎవరికి తెలియదు?

యోగాంగసాధనకు రోగులే కావలెనని తలచుట భ్రమ. "రోగములు ఔషధాదులతో నివారణకాలేదు కాబట్టి యోగాసన ప్రాణాయామాదులతో నైన [illegible] వాటిని బోగొట్టుకుందాం" అని యోగసాధనకై ప్రవర్తించుచున్నవారే ఎక్కువగా నా కండ్లకు అగుపడుతున్నారు. మరియు నాలాగే అభ్యాసాన్ని చేస్తున్నారు. ఇది ఒకరకమైన పిచ్చియని నా అభిప్రాయము. ఇంతకంటే రోగము లేనివారు రోగము రాకుండుటకును, రోగులు వచ్చిన రోగమును నిర్మూలము చేసుకొనుటకును యోగసాధన ఒకటే ముఖ్యసాధనమని నిశ్చయించి చేయుట మిక్కిలి శ్రేయస్కరము.

ఆరోగ్యము, అనారోగ్యము ఇవి మానవులకు కాలము, దేశము, సహవాసము, ఆహారము, విహారము, పానము, యానము, ఇత్యాది కొన్ని సంగతుల సమ విషమపరిస్థితులనుబట్టి సుఖదుఃఖములను పంచి క్రీడించుచూ పీడించుచూ వర్తనచేయు స్వభావము గలవని ఎవరికి తెలియదు?

విశాలహృదయులూ, శాంతులూ, ధీరులూ, నిష్పృతుపాతులూని, నిరహంకారులూ. ఐన మన ప్రాచీనులే ఆయురారోగ్యాభివృద్ధులకై అనేక నియమములను వ్రాసిపెట్టిరి. గనుక మనము ఇపుడు వాటిని పాలించుచూ యోగాంగాసనముల నభ్యసించితే తప్పక మేలు కలుగును.

రోగులు, చాలా లావుగా నుండువారు, పెద్ద పొట్టలు కలవారు, గర్భిణీస్త్రీలు తప్ప మిగిలిన వారు ఈదిగువ చెప్పబోవు యోగాసనములను నియమబద్ధులై యభ్యసించి సుఖము ననుభవించగలరు. బ్రహ్మచర్య, పాతివ్రత్యములను సాధ్యమయినంతవరకూ మనము పరిపాలించుచున్నవారమే గనుక ప్రకృతము తత్ప్రసంగము అనవసరమైనది. సాత్త్వికాహారము తీసుకొనుట మిక్కిలి లాభదాయకమని సూచించుట కర్తవ్యము.

5 సంవత్సరములనుండి 16 సంవత్సరములవరకూ స్త్రీ పురుషులకు:—

సద్గురు మూలముగా అన్నివిధములైన యోగాంగ సాధనలయందు పూర్ణాధికారము, కలదు రజస్వలా స్త్రీలు కొన్ని చేయరాదను సంగతి మూడవ ప్రకరణముచూచి తెలుసుకొనగలరు.

16 సం. మొదలు 25 సం. వరకు:—

శీర్షాసన సర్వాంగాసనములను వాటి భాగములనూ, మరియు పశ్చిమతాన, పూర్వతాన, పాశాసన, పభాగ మరీచాసన, వసిష్ఠాసన, బద్ధపద్మాసన, మత్స్యేంద్రాసన, భుజంగాసన, ధనురాసనములు చాలు. మరియు ఉజ్జాయీ శీతలీ భస్త్రికా నాడీశోధన ప్రాణాయామములూ చేయదగినవి. భోజనమైన తరువాత శీర్షాసన సర్వాంగాసనములను చేయకూడదనే సంగతిని మరువరాదు.

25సం. మొదలుకొని 50సం. వరకూ:—

నైష్ఠిక బ్రహ్మచర్యాశ్రమాపేతులై పెండ్లి కాకుంటే 16-25 ఏండ్లవారికి చెప్పిన యోగాంగ సాధనలే చాలు. ఉపకుర్వాణ బ్రహ్మచర్యమును అవలంబించి వివాహితులైనవారికి సిద్ధాసన, పాశాసన, మత్స్యేంద్రాసనములను వదిలి మిగిలినవాటిలో 16-25 సం. వలెనే అభ్యసించేది.

50 సం. ప్రారంభించి 75 సంవత్సరముల వరకూ చాలా జాగ్రత్తగా నుండవలెను. ఆ వయస్సులోనే రోగాదులు బాధించగలవు. అందుచేత యౌగిక నియమములను చక్కగా పాలించుచూ ఈ క్రింద వ్రాసిన యోగాంగములు అభ్యసించవలెను.

25 సం.-50 సం. వరకూ చేయుటకై చెప్పిన యోగాసనాదులలో అష్టావక్రాసన, శలభాసన, మయూరాసన, ఊర్ధ్వకుక్కుటాసనములను, కొన్ని బంధములనూ అభ్యసించుచూ వారమునకు ఒకరోజు మౌనమును, మాసమునకు రెండుసారులు క్షీరపానముతోనూ ఉండవలెను.

75 సం.వ ఆరంభించి 100 లేక 120 వరకు పదిరకములైన ప్రాణాయామములతో ఎక్కువకాలమును గడుపుతూ శీర్షాసన, సర్వాంగాసన, పద్మాసన, మహాముద్రా, పశ్చిమతానాసనముల నభ్యసించినను చాలు:—

ఈ వయస్సు గలవారికి ఇంద్రియ చాపల్యము ఎక్కువ గలుగును. దాన్ని జయించుటకే ప్రత్యాహారమనే యోగాంగమును సాధించుచూ సరియైన గురువులద్వారా సమాధి సాధనను నేర్చుకొని సాత్త్వికాహారము నే భుజించుచూ భగవద్భజన చేయవలెను. ఏకాకిగా అని కూడా కొందరందురు.

అన్నివయోవిభాగములలోనూ వ్యాధులు గలవారికి పైన చెప్పిన యోగాంగ నియమములు పనికిరావు. వారు ఆ వ్యాధి నివారణకై యోగ్యులైన యోగాభ్యాస నిష్ణాతుల ద్వారా ఉపాయము (సాధన) లను తెలుసుకొని అభ్యసించుట మంచిది.


అనుష్ఠాయ యోగాంగం అనం
సేవ్య శ్రియఃపతిమ్॥
అభుక్త్వా సాత్త్వికం చాన్నం
క్వసుఖం లభతే నరః."

అనగా భక్తిసాధకమైన అష్టాంగ యోగమును అభ్యసించక, పరమాత్మ శ్రీమన్నారాయణ చరణారవిందములయందు శరణాగతుడుకాక, పరమ సాత్త్వికమైన ఆహారమును భుజించక ఉంటే మానవుడు ఈ ప్రపంచములో ఎక్కడ సుఖమును పొందగలడు? ఎక్కడనూ లేదు. గనుక మానవమాత్రమునకు పై మూడు సుఖప్రదములు.

సాలంబ సర్వాంగ, పూర్వతాన, హలాసనములు

సాలంబ - సర్వాంగాసన, పూర్వతానాసనముల నభ్యసించు క్రమములను హఠయోగ ప్రదీపికా మొదలైన కొన్ని గ్రంథములలో చెప్పలేదు. నేనూ సాధ్యమయినంతవరకూ గ్రంథాగారములలో వెదకితిని. ఒక పల్లెటూరిలో ఒక వృద్ధుని గుడిసెలో కొన్ని చినిగియున్న తాటాకుల పుస్తకాలనడుమ చిదిరి బదరైన ఒక తాటాకుల పుస్తకము పైన 'యోగరహస్యము' అని ఘంటముతో వ్రాసివదికనుబడెను. అప్పుడు నాకు గలిగిన ఆనందమును వ్రాతతో గాని, వాక్కులతో గాని చూపజాలను. మన ప్రాచీనులు ఈ లాటి అమూల్యగ్రంథములను ఎన్నెన్ని సంగ్రహించి ఎక్కడెక్కడ పెట్టియున్నారో అనుకుంటిని. ఆ పుస్తకము మీద బడిన దుమ్మును నా హృదయాధిదేవత పూజకు ఉపయుక్తమైన పుష్పపరాగమని భావించితిని. దీర్ఘశ్వాసముతో రెండుచేతులు పైకెత్తి పుస్తకాన్ని తల మీద పెట్టుకొని ప్రపంచమునుమరచిపోతిని.

అటుపిమ్మట ఆ పుస్తకమును తెరిచి "నారాయణాయ నమః" అని ఆ శరణ్యుని



హలాసనం.

★ యోగాసనములు - దేహారోగ్యము ★

చరణారవిందములను స్మరించి, చూస్తే "ఎనిమిది అంగములతో కూడిన యోగరహస్యము," అను నీ యర్థమును బోధించు "సాష్టాంగ యోగరహస్యమ్" అని శీర్షిక కనబడినది. అందులో నున్న విషయములను నేనిపుడు ఆంధ్రీకరించి వ్రాయుచున్నాను. పీరికా ప్రకరణమునకు చేరిన ఈ విషయమును పీటమీద బెట్టుటకూ యోగ్యమను నాతలంపును పాఠక బృందము మన్నింపగలదు

ఉత్తానం దండవత్ ధీరః
    శయిత్వా భూతలే సమే,
ప్రసార్య హస్తౌ స్వం దేహం
    సర్వ ముత్థాప్య చోర్ధ్వతః
దండవత్ ధారయేత్ ధైర్యాత్
    అవష్టభ్య కరద్వయాత్ ॥
పృష్ఠభాగం, తతః కుర్యాత్
    దీర్ఘౌ రేచక పూరకౌ॥
నేత్రే నిమీల్య సుదృఢం
    కృత్వా జాలంధరం, శనైః।
ప్రథమే దివసే ధీమాన్
    వసే దేకక్షణం తతః।
అభ్యాసాతి శయే సిద్ధే
    కాలవృద్ధి ముపాసయేత్ ॥
సర్వాంగాసన మేతద్ధి
    కథితం యోగిపుంగవైః॥
గుల్మ ప్లీహాది రోగాణాం
    నాశనం సర్వదేహినామ్॥
భోజనా దూర్ధ్వతో నైవ
    కుర్యాదాసన మీదృశమ్॥
స్త్రీణాం గర్భవతీనాంతు
    నిషిద్ధమిద మాసనమ్॥

(యోగరహస్యమ్ ౧వ అధ్యాయము.)

అనగా, సమమైన భూమిపైన చక్కని కర్రవలె వెలికిలపరుండి, చేతులను నేలకానించి కాళ్లను, వళ్ళను పైకి లేవనెత్తవలెను. లేవనెత్తినపుడు అరిచేతులు వీపుకు ఆనించియుండవలెను. దీర్ఘ దండమువలె శరీరము పైకి ఎత్తినపుడు గడ్డము రొమ్మునకు తగిలియుండవలెను. కండ్లు రెంటినీ మూసుకొని దీర్ఘమైన శ్వాసోచ్ఛ్వాసమును ఉజ్జాయీ ప్రాణాయామము వలె చేయవలెను. ప్రథమాభ్యాసులు మొదటి రోజు 1 నిమిషముకంటె ఎక్కువకాలము సర్వాంగాసనస్థితిలో ఉండకూడదు. చక్కగా అభ్యాసము సిద్ధించిన తరువాత క్రమముగా కాలమును హెచ్చించవచ్చు. కాళ్లు రెంటినీ చేర్చి పైకి దండమువలె నిలిపియున్నపుడు మోకాళ్లు వంగియుండరాదు. అవి ఒకటికి మరియొకటి దగ్గరగా చేరియుండవలెను. కాళ్ళ బొటన వేళ్ళు రెండూ చేరి యుండడమే కాక- లాగిపట్టవలెను. మడమలుకూడ కలిసియుండవలెను. ఇదే సర్వాంగాసనము. అన్ని అవయవములకూ బలమును ఇవ్వగలదని ఆ పేరు దీనికి సార్థకము. గుల్మ, ప్లీహ మొదలగు జీర్ణకోశమునకు సంబంధించిన జబ్బులను ఇది నివారించును. భోజనమైన పిదప చేయకూడదు. గర్భిణీ స్త్రీలూ చేయరాదు.

హలాసనము:—

సర్వాంగాసనతః పాదౌ
    ఆకృష్య శనకైర్భువి
న్యసేత్ యథాస్యోత్తమాంగాత్
    పశ్చాద్భాగే విచక్షణః
హలాకారేణవా ధైర్యాత్
    లాంగలాకృతితోఽపివా
పూర్వవత్ రేచపూరాభ్యాం
    సారం జాలంధరేణచ
తిష్ఠేత్ క్షణార్ధం ప్రథమే
    దివసేఽథ శనైః శనైః
వృద్ధిం కుర్యా దేతదేవ
    హలాసన మితీర్యతే
నాశయేత్ కఠరోగాదీన్
    బాధా ఔదరికా అపి
అర్శరోగాన్ శిరోనాళ
    రోగానపి నసంశయః॥

(యోగరహస్యము)

సర్వాంగాసనము చేయుటకై పైకి లేవనెత్తిన రెండు కాళ్ళనూ తిన్నగా తల (ముఖం) పైగా వెనక్కి దించి, భూమి మీద బొటనవ్రేళ్లు తగులు రీతిని పెట్టి, రేచక పూరక జాలంధర బంధములతో కలిసియుంటే అది "హలాసనము" అనబడును.

(ఇంకా ఉన్నది)

(48వ పేజీ తరువాయి)

అతన్ని అనునయించి తమదగ్గిర వుంచుకుంటారు. సత్యం పత్రికనిర్వహణలో వాళ్ళకు సహాయపడుతూ వుంటాడు. కొన్నాళ్ళకు ఆ బిచ్చగత్తె శారదాకూడా అడుక్కుంటూ 'కాగడా' కార్యాలయానికి వస్తారు. శారద సత్యాన్ని గుర్తించుతుంది. బిచ్చగత్తె శారదను సత్యానికి వప్పజెప్పి వెళ్ళిపోతుంది.

స్టోర్సులో జరిగే అన్యాయాలన్నీ తమకు తెలిసివున్నా, వాటిని ఋజువు చేయటానికి కాగడా పత్రికవారివద్ద తగిన రికార్డు ఆధారమేమీ లేకపోతుంది. సత్యం స్టోర్సు సూపర్‌వైజరు వేషం వేసుకుపోయి, కొత్త పుస్తకాలు పట్టుకొచ్చేస్తాడు. ఉన్న కుళ్ళంతా బయటపడుతుంది. కాగడాలో వివరాలన్నీ ప్రకటించుతారు.

ఆరాత్రి జగన్నాధం కాగడా కార్యాలయంమీదికి రౌడీలను పంపుతాడు: వాళ్లు కార్యాలయం ఆఫీసుమీద దాడి చేసి అందర్నీ కొట్టి ఆఫీసు తగలపెట్టేస్తారు.

ఇలావుండగా జగన్నాధం స్టోర్సు కొత్త పుస్తకాలు మారువేషంతో సత్యం ఎత్తుకుపోయినట్టు పోలీసులకురిపోర్టుచేసి సత్యాన్ని అరెస్టుచేయిస్తాడు.

కోర్టులో విచారణ జరుగుతూవుంటుంది; కాగడా సంపాదకుడు రావుగారు ఒక తెలివైనపని చేస్తాడు. తన యింటిమీదకు జగన్నాధం యే రౌడీ ముఠానో పంపుతాడని ముందుగానే పసిగట్టి, ఆ రికార్డును ఎవ్వరికీ తెలియని మరోచోట దాచేస్తాడు. విచారణ సమయానికి ఆ రికార్డు తీసుకొచ్చి కోర్టువారికి వప్పగింత పెడతాడు. అందులో వున్న మోసమంతా జడ్జీకి అర్థమైపోతుంది. జగన్నాధం బృందాన్ని అరెస్టుచేయిస్తారు. సత్యం, ప్రజలకు జరుగుతున్న అన్యాయాన్ని కోర్టువారి దృక్పధానికి తెచ్చేటందుకుగాను నేరం చేసినమాట నిజమేనని వప్పుకుంటాడు. జడ్జీ లాంఛనప్రాయంగా సత్యానికి కోర్టు లేచేవరకూ శిక్ష విధించి వదిలేస్తారు. టూకీగా ఇదీ కథ.

ఈకథను నిర్వహణచేయటంలో చూపిన చాకచక్యాన్ని ఆసాంతం ఎత్తి చూపాలంటే అది పెద్దగ్రంధమౌతుంది. మచ్చుకు ఒకటి రెండు విషయాలు మనవిచేసి వదిలేస్తాను.

శారద బిచ్చగత్తెకు దొరికినప్పుడు ఆ బిచ్చగత్తె శారదకు ఒక తేగపెట్టి మంచినీళ్లు యిస్తుంది. అలసివున్న శారద నిద్రపోతుంది. బిచ్చగత్తె శారదచేతినున్న గాజులు తీసి దాస్తుంది. కడుపుకక్కురితికి వాటిని అపహరించిందని మనమనస్సు చివుక్కుమంటుంది. కథ యించుమించుకు ముగింపుకువచ్చేవరకూ మనకు ఆ బిచ్చగత్తెమీద అదే అభిప్రాయం వుంటుంది. కాని ఆ బిచ్చగత్తె శారదను సత్యానికి వప్పగింత చేసేఘట్టంలో 'ఎవరైనా అపహరింమతారేమోననే భయంతో వాటినితీసి దాచాను' అని బొడ్లోనుంచి ఏనాడో దాచిన ఆ గాజులుతీసి సత్యం చేతులో వుంచేసరికి ఆ పేదరాలిలోవున్న నైతికబలం మనకు ఒక్కసారి విద్యుత్తులా తగిలి ఉత్కంఠ కలుగుతుంది.

అసలు చిత్రం ఆరంభంలోనే ఒక సన్నివేశం కల్పించి ఆంధ్రరాష్ట్ర పటాన్ని చిత్రించి ఆంధ్రజాతీయ గీతాన్ని పాడించి తిక్కననుంచి నేటివరకూ గల ఆంధ్ర జాతీయ సాంస్కృతికయోధుల చిత్రపటాలను ఒకటొకటే చూపించి జోహారు లర్పించారు. ఆ ఘట్టంతో చిత్రానికి ఆంధ్రజాతీయతాముద్ర హత్తుకు పోయింది. ఇలా చెప్పాలంటే చాలా వున్నయ్.

ఈ చిత్రంలో లోపాలు కూడా లేకపోలేదు. కత్తెర ప్రయోగించవలసినభాగాలు వున్నయ్. 'ఆలీ దొంగలముఠా' ఘట్టాన్ని అనవసరంగా చొప్పించారు. జగన్నాధం ముఠా చేసే పనులను వ్యాఖ్యానరూపంలో వ్యక్తీకరించటానికి ఉపకరిస్తుందని దర్శకులు వాదించితే వాదించవచ్చు. కాని చిత్రంలో ఆ ఘట్టాన్ని చూస్తుంటే జగన్నాధం ముఠా స్ఫురణకు రావటంలేదు.

జగన్నాధం ఉంపుడుకత్తె వనజ భరత నాట్యం కటిక అనవసరం; ఆ రకం వెర్రిగంతులన్నిటినీ భరతనాట్యంక్రింద చెలామణీ చెయ్యటానికి ప్రయత్నించకూడదు. అసలు జగన్నాధానికి భరతనాట్యం దేనికి?

'వెళ్ళిపోదామా మామా' అన్న పాట అనవసరం. ఆ సన్నివేశంలో కథాగమనానికి వున్న తీవ్రతను ఈ పాట కూనీచేసింది. ఆ పాటకోసం చొప్పించిన 'ఇన్‌సర్ట్స్'ను కూడా కత్తిరించివేయవచ్చు.

ఇవి చాలా స్వల్పమైన విషయాలు. వదలని పాతవాసనలో ముందుముందు రాబోయే చిత్రాల్లో యిల్లాంటివికూడా లేకుండా జాగ్రత్తపడాలనే దృష్టితోమాత్రమే వీటిని ఎత్తిచూపుతున్నాను. ఈ స్వల్పదోషాలను సవరించుకుంటే ఈ చిత్రం, అంతర్జాతీయ విఖ్యాతి గడించుకున్న 'బైసికిల్ తీఫ్' అనే ఇటాలియన్‌చిత్రంస్థాయిలో వుంది.

ఈ చిత్రంలో సి. యస్. ఆర్. చిదంబరం పాత్రను అత్యంత సమర్థతతో నిర్వహించారు. ఆయన 'రామచంద్రప్రభూ!' అన్నప్పుడల్లా రుద్రాక్షుల పిల్లి జ్ఞాపకమొస్తుంది.

యస్. వి. రంగారావు జగన్నాధం పాత్రను సి. యస్. ఆర్.తో పోటాపోటీగా నిర్వహించారు. ప్రధానపాత్ర నిర్వహించటం యిదే తొలిసారి అయినా నరసింహారావు ఒడిదుడుకులు లేకుండానే పాత్రను పోషించుకురాగలిగాడు. ముందుముందు మంచి భవిష్యత్తును అందుకోవటానికి తగిన హంగులున్న వ్యక్తి; 'మా అమ్మ చచ్చిపోవాలా?' అని సింహంలాగ గర్జించి వైకుంఠాన్ని పీక పట్టుకున్న ఘట్టంలో అత్యంత దర్శనీయుడుగా వున్నాడు. కృష్ణకుమారి నాయకిపాత్రను నిబ్బరంగా సమర్థించింది.

కాగడాపత్రిక సంపాదకుడు రావుపాత్ర మటుకు పెరుమాళ్ళకు తలకుమించిన బరువైపోయింది.

సంభాషణలన్నీ సరళమైన భాషలో ముచ్చటగా నడిపించారు.

తెలుగుతనం ఉట్టిపడేలాగు తెలుగు జానపదసంప్రదాయాన్ని దృష్టిలో వుంచుకుని, సంగీత దర్శకత్వాన్ని నిర్వహించిన మాస్టర్ వేణు అభినందనీయుడు. 'పాడిన పాటేనా?' - 'ఆపేవారెవరూ? నిజాన్ని అడ్డేవారెవరూ?' అన్న రెండు పాటలూ ప్రేక్షకులకు ఉత్కంఠకలిగించేలా వున్నయ్.

దర్శకుడుగా శ్రీ తాపీ చాణక్య సమర్థత లేవిటో మనకు తెలియవు. తొలి చిత్రంలోనే యిలాంటి విజయాన్ని చేపట్టగలిగిన ఆ వ్యక్తి అత్యంతప్రతిభావంతుడైవుండాలి. చిత్రం మొదలునుంచి తుదివరకూ ఒకటి కనుపించుతుంది: ప్రతి చిన్న విషయంలోనూ అత్యంతమైనశ్రద్ధ; రెండవది భావావేశాన్ని, విచ్చలవిడిగా కట్లు తెంచుకుని వెర్రిగంతులు పెట్టనీయకుండా ఎక్కడికక్కడ అదుపులో వుంచుకుని పొంకమైన పంథాలో నడిపించటం. నిజానికి భావావేశ విషయంలో ఇలాంటి అదుపులేని మరోయేదర్శకుడైనా, నేడు ప్రజలను కల్లోల పెడుతున్న అనేకసమస్యలప్రసక్తికి అవకాశంవున్న ఇలాంటి వాస్తవిక చిత్రాన్నీ ప్రజాజీవితాన్ని ప్రతిబింబించే చిత్రాన్నీ నిర్మించవలసివచ్చినప్పుడు ఉపన్యాసాల వేదిక క్రింద తయారుచేసేవాడు.

నూత్న సంవత్సరపు కానుకగా యిలాంటి ఉత్తమ చిత్రాన్ని ఆంధ్రప్రజలకు అందజేసిన సారధీ ఫిలిమ్సు నిర్మాత సి. వి. ఆర్. ప్రసాద్ కృతకృత్యులు.

తెన్నేటి సూరి

★ కాలక్షేపం ★

(4-వ పేజీ తరువాయి)

రెండింటికీ మించిన త్యాగధర్మం ఇంకొకటి ఉంది.

"లోకాస్సమస్తా స్సుఖినోభవంతు" అని త్రికరణశుద్ధిగా చెప్పగలిగిన బ్రహ్మాండమైన బ్రహ్మజ్ఞానం లేకపోతే, అంతర్జాతీయ వ్యవహారాలు గాని, అంతర్జాతీయ వ్యాపారాలు గాని, ఆత్మవినాశ హేతువు లవుతాయి. ఈ బ్రహ్మజ్ఞానం వర్తకునకు లేని యెడల, ఈ బ్రహ్మజ్ఞానంతో వర్తకరంగానికి చుక్కాని తిప్పనియెడల, వర్తకరంగం తగులబడినట్లవుతుంది. ధరలు ఎప్పుడూ మండిపోతూ ఉంటాయి. వర్తకులు ధరల గిరాకీ కావాలంటారు. వర్తకుడు కరువు కోరుతాడు. "యుద్ధం మళ్ళీ వస్తుంది" అంటే చంకలు కొట్టుకొనేది బ్లాకు మార్కెటు(చీకటి బజారు)వ్యాపార మహారంగా సాగించే సాహుకారు. కడచిన మహాసంగ్రామ కాలములో ఆయుధసామగ్రులను తామరతంపరగా తయారు చేసి అమ్ముకొనిన అమెరికను యంత్రాగారాల ఖామందులు అపారలాభాలుగడించారు. సంగ్రామానంతరం అమెరికను కోటీశ్వరులు కుబేరునకైనా అప్పులిస్తామన్నట్లుగా ప్రపంచ రాజ్యాలకు అన్నింటికీ, ఋణప్రదానం చేస్తున్నారు. కుబేరుని ఆస్తి బేరానికి వస్తే కొనివేస్తా మంటున్నారు. ఇంకో యుద్ధం సిద్ధం అయితే, అమెరికా రాజ్యం ఆటంబాంబులను కూడా అమ్మి, అనంతమైన అయిశ్వర్యం గడించవచ్చు. కాని, చివరకు లోకానికి మిగిలేది ఏమిటి? "విభూతిర్భూతి రైశ్వర్యం" అని అమరకోశంలో నిర్వచించాడు. విభూతి అంటేనే అయిశ్వర్యం. ఆటంబాంబులతో ప్రపంచరాజ్యాలు భస్మమైతే మిగిలేది ఏమిటి? బూడిద—అదే చివరకు మిగిలే విభూతి. కనుక అమెరికను వర్తకశిఖామణులు కోరేది "లోకాస్సమస్తాస్సుఖినో భవంతు" అని చెప్పడానికి బ్రహ్మజ్ఞాని ఒప్పుకోడు.

యంత్రాగారములు మితిమించిన వస్తుసామగ్రిని ఉత్పత్తి చేస్తాయి. యంత్రాగారములకు ఆ శక్తి ఉంది. ఆ శక్తి వానికి ఉండడంవల్లనే ఆసాములు ఆ శక్తికి ఆసక్తితో దాసోహం అంటారు. రోజుకు లక్షు టన్నుల చక్కెర ఉత్పత్తిచేసే ఫ్యాక్టరీలు లక్షఉంటే ఏమవుతుంది? చక్కెర మిక్కుటంగా ఉత్పత్తిఅయి, ఆ సరకును అమ్మలేక వర్తకరంగం ఉక్కిరిబిక్కిరిఅవుతుంది. చక్కెరలో తీపి వర్తకునకు ఉండాలంటే, చక్కెర ధర మిక్కిలిగా ఉండాలి. చక్కెర ధర పడిపోతే చక్కెర వ్యాపారంలో తీపిపోయి, ఆ తీపివస్తువు చేదు అవుతుంది. "లోక సంగ్రహార్థం" వ్యాపారతంత్రం సాగాలంటే, యంత్రాగార చక్రములలో మనం చిక్కుకొని నలిగిపోకూడదని మహాత్ముడు మనవి చేశాడు. మన జాతీయపతాకం మీద రాట్నం లక్ష్మప్రదంగా ఉండాలన్నాడు. రాట్నం త్రిప్పిన మహాత్ముడు రాజఘాటులో సమాధియైనాడు. రాజభవనాలమీద రాట్నంలేని త్రివర్ణపతాకం యథేచ్ఛగా ఎగురుతోంది.

గాంధిమహాత్ముడు ఆరు మాసాలలో కోటిరూపాయలు వసూలు కావాలన్నాడు సత్యాగ్రహం ప్రారంభించిన దినాలలో. ఆనాడు ఆయన భారతజాతిని "మేలుకో!!" అన్నాడు. ఆయన "కో" అంటే కోటిరూపాయలు రాలినాయి. ఆ కోటి రూపాయలను వడ్డీకి నిల్వచేసి, ఆవడ్డీ పైకమునే సత్యాగ్రహోద్యమానికి ఉపయోగిస్తే మంచిదని ఒకరు ఆయనకు సలహాయిచ్చారు. అప్పుడు మహాత్ముడు చక్కని జవాబు చెప్పాడు. "అయ్యా! ప్రజలకు నా మాటయందుగల గౌరవాభిమానమే నా మూలధనము. ఇప్పుడు నేను వసూలుచేసిన పైకము ఆ మూలధనమువల్ల లభించిన వడ్డీమాత్రమై యున్నది" అని సమాధానమిచ్చాడు.

ఏపనిచేసినా, "లోకాస్సమస్తా స్సుఖినో భవంతు" అనే స్వస్తివాక్యంతో ప్రారంభించి. ఆ స్వస్తివాక్యంతో ముగించాలి అని బ్రహ్మజ్ఞానులు ఒక జీవిత ధర్మసూత్రం శాసించారు.

గంగయ్యఅనే పెద్దమనిషి అగ్రహారంలో ఒక మేడ కట్టించాలని సంకల్పించాడు. ఆయన మేడప్లాను ప్రక్కనే, చంద్రయ్య ఒక్క చక్కనితోట వేసి, ఆతోటలో ఒక బావిని తీయించాడు. కొబ్బరి నీళ్ళవంటి తియ్యని గంగోదకం, బ్రహ్మాండమైన జల పడింది. ఆ తోటకు అంతటికీ ఆ నీరు ఎంత తోడినా తరిగేది కాదు. ఆ గ్రామంలో వేసవికాలం వచ్చిందంటే జనానికి త్రాగుటకు నీరు లేక తపించిపోతూఉంటారు. ఈ దురవస్థ చూచి గ్రామస్థులకు అక్కరకు రావాలనే అభిలాషతో యీ తోటలో భారీసైజు బావి త్రవ్వించి కట్టించాడు. వేసంగి వచ్చిందంటె చంద్రయ్య తోటలోకి వెళ్ళి ఊళ్ళోవాళ్లందరూ నీళ్ళు తోడి తెచ్చుకొంటారు "చంద్రయ్య కడుపు చల్లగా ఉండాలి" అని అతనిని దీవించి వెళ్లేవారు. ఇటువంటి తియ్యని నీళ్ళు, యింత అపారమైన జలగల బావి ఆ ఊరి మొత్తముమీద లేదు. చంద్రయ్య తోట ప్రక్కనే మేడకట్టించే గంగయ్య యీబావి చూచాడు. జలార్గళశాస్త్రజ్ఞుణ్ని పిలిపించాడు. తన పెరటిలో బావి త్రీయించాలనిన్నీ, చంద్రయ్య బావిలోని జల అంతా తన బావిలోకి రావాలనిన్నీ తన కోరిక తెలియజేశాడు. జలార్గళశాస్త్రజ్ఞుడు గంగయ్య పెరటి స్థలం అంతా తిరిగి, చంద్రయ్య బావికి ఎదురుగా పది బారలు దూరంలో నుయ్యి త్రవ్విస్తే సమృద్ధిగా నీరు లభిస్తుంది అన్నాడు. వెంటనే గంగయ్య ఉత్సాహంగా అక్కడే త్రవ్వించాడు. జల బాగానే పడింది. కాని, ఆ నీరు ఉప్పుకషాయంగా తయారైంది. చంద్రయ్య బావికి పదిబారలదూరంలో గంగయ్యబావి చంద్రయ్య నీరు చక్కెర పానకం - గంగయ్య నీరు కటికకషాయం. చంద్రయ్య దూరాలోచనతో త్రవ్వించాడు, గంగయ్య దురాలోచనతో త్రవ్వించాడు. జల "నిధియను శంక భూతలము నిచ్చలు త్రవ్వి" నాడు. ఆఖరుకు ఆ బావిలోని నీరు జలనిధి (సముద్ర) జలమే అయింది. లోక సంగ్రహార్థం చేసిన పని చేదెక్కదు. "లోకాస్సమస్తా స్సుఖినో భవంతు" అనే వాడు "ముదమందగదే దురాశరో" అని దురపిల్లక విలసిల్లును, పిల్లపిల్ల తరమున్ దరమున్. ★

Edited, Printed & Published by S. Sambhu Prasad at the Andhra Patrika Press, 7, Thambu Chetty St, Madra

★

వంతెన

ఫొటో:—యస్. వి. కె. పర్వతాలు, (ఉంగుటూరు)

